1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 9
పుటలు : 52
రు. 25 లు
ISSN NO: 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2022

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



(ఎడమ నుండి కుడికి) ముఖ్యఅతిథి: జస్టిస్ ఎ.వి.శేషసాయి, ఆత్మీయ అతిథి: తమ్మా శ్రీనివాసరెడ్డి, అన్నం శ్రీధర్ అవార్డు గ్రహీత: సరస్వతుల రామనరసింహం(సరసి) దంపతులు, నిర్వాహకులు: సామల లక్ష్మణబాబు, సభాధ్యక్షులు: సామల రమేష్‌బాబు, విశిష్ట అతిథి: మండలి బుద్ధప్రసాద్, ఆత్మీయ అతిథి: గారపాటి ఉమామహేశ్వరరావు



భారత ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖా మంత్రి నారాయణస్వామి,మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్,మాజీ రాష్ట్ర శాసనసభ పూర్వఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్రప్రభుత్వ పూర్వ ప్రధానకార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు,ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రచారప్రముఖ్ సునీల్ అంబేకర్, రాష్ట్ర సమరసతావేదిక అధ్యక్షులు తాళ్ళూరి విష్ణు,రాష్ట్ర సామాజిక సమరసత మహిళాకన్వీనర్ కోడూరు జయప్రద,రచయితలు బూదాటి వెంకటేశ్వర్లు,పులికొండ సుబ్బాచారి,మున్నగువారు

## ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంతోనే: జాతీయ పాఠ్యప్రణాళికతో స్పష్టం

# తాపీ ధర్మారావు పురస్కారం- 2022

## విజయవాడ- 5, సెప్టెంబరు 2022 సా॥ 5.30గం. వేదిక : హోటల్ ఐలాపురం



డా॥ తమ్మా
శ్రీనివాసరెడ్డిస్వాగతం



సభాధ్యక్షుడు డా.సామల రమేష్‌బాబు తొలిపలుకులు



ప్రసంగిస్తున్న
విశిష్ట అతిథి, పుస్తకావిష్కర్త
డా॥ మండలి బుద్ధప్రసాద్



'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' పుస్తకం విడుదల



ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి,
జస్టిస్ ఎ.వి.శేషసాయి



మన్నన పత్రాన్ని
చదువుతున్న
డా॥వెన్నిసెట్టి సింగారావు



'సరసి' గారికి పురస్కార ప్రదానం



'సరసి' గారికి తోటి కార్టూనిస్టుల సత్కారం...





ప్రసంగిస్తున్న ఆత్మీయ అతిథులు:
శ్రీ'బాచి' (అన్నం శ్రీధర్),
ప్రొ.గారపాటి ఉమామహేశ్వరరావు.



ప్రసంగిస్తున్న
పురస్కార స్వీకర్త
శ్రీ 'సరసి'



జస్టిస్ ఎ.వి.శేషసాయి గారికి జ్ఞాపిక
అందచేస్తున్న తెలుగుజాతి ట్రస్టు ట్రస్టీలు.
శ్రీమతి డి.పి.అనురాధ, డా.సా.లక్ష్మణబాబు



వందన సమర్పణ:
తెలుగుజాతి ట్రస్టీ
శ్రీవై.హనుమంతరావు





సభలో పాల్గొన్న పెద్దలతో కొందరు...

వార్త వివరాలు : పుట 16 నుండి 22 వరకు

ఫొటోలు: తమ్మా శ్రీనివాసరెడ్డి

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




డిసెంబరు 2022

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఇవీ సంగతులు:** | | | **05** |
| **సంపాదక హృదయం:** | ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంతోనే... | | **07** |
| **విన్నపం:** | ఒక పామరుడి విన్నపం | **గుంటుపల్లి శ్రీనివాస్** | **09** |
| **స్పందన:** | వర్ణ వివక్షకు జయం కల..**భాస్కరమ్మ రామమోహన బాపూజీ** | | **11** |
| **సాంకేతిక కోణం:** | భాషకు,లిపికి ఉన్న బంధం ఏమిటి?-4 | **రహ్మానుద్దీన్ షేక్** | **12** |
| **తెలుగు-సంస్కృతం:** | తెలుఁగు సంస్కృతంలోంచి.... | **మత్తిపూడి సుబ్రహ్మణ్యం** | **15** |
| **ముఖచిత్రం-1:** | తాపీ ధర్మారావు పురస్కారం-2022 | **కళ్యాణకృష్ణ** | **16** |
| **ఆంగ్లభాషా ప్రభావం:** | తెలుగు, కన్నడ దినపత్రికలపై ఆంగ్లభాషా.. | **యం.రాజకృష్ణ** | **23** |
| **స్ఫూర్తి:** | నిజాయితీ+నిబద్ధత=చుక్కా రామయ్య | **తెలిదేవర భానుమూర్తి** | **27** |
| **ముఖచిత్రం-2:** | కులవివక్ష లేని సమాజాన్ని సాధిద్దాం | | **29** |
| **సాహిత్యరంగం:** | బి.సి.అస్తిత్వ సాహిత్యం-ప్రపంచీకరణ | **సుంకర గోపాలయ్య** | **31** |
| **నాటకాలు:** | ఆధునిక తెలుగు సాహిత్యంలోని... | **గోవిందు సురేంద్ర** | **36** |
| **ఆన్లైన్ విద్య:** | ఆన్లైన్ విద్యా విధానంలో సవాళ్లు | **వెంగళరావు పచ్చువ** | **38** |
| **బాలసాహిత్యం:** | తెలుగు బాలసాహిత్యంలో మనం ఎక్కడ... | **టి.వి.రామకృష్ణ** | **39** |
| **పుస్తకాల పరిచయం:** | తెలంగాణ ఉమ్మడి పదిజిల్లాల పెద్దలు రాసిన పిల్లల కథలు | | **42** |
| **నివాళి:** | పదకవితా పరిశోధక నిపుణుడు.. | **గుమ్మా సాంబశివరావు** | **48** |
| **అభినందన:** | ఒంటెత్తు పోకడ లేని సాహిత్య యోధుడు.... | **దివికుమార్** | **49** |
| **గ్రంథాలయం:** | | | **50** |
| **వారసత్వ సంపద:** | దున్నబోతే దూడల్లోకి-మేయబోతే.. | **పి. శివరామకృష్ణ 'శక్తి'** | **43** |
| **ధారావాహిక:** | పడమటి గాలితో నిరువు తొలగిన.. | **గుజ్జర్లమూడి కృపాచారి** | **45** |
| **భాషాశాస్త్రజ్ఞుల సమావేశం:** | 44వ భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సమావేశ దృశ్యాలు | | **51** |

**కవితలు:** నేను మళ్ళీ జన్మిస్తా...: **లక్ష్మీశ్రీనివాస్(28),** మారాము: **ఎన్.గోపి(37),** శ్రమైక జీవన..: **వై.హనుమంతరావు(47).**



| ఫోటోలు | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **సరసి** | **బండారు రఘురాం** |


ammanudi.org **వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు**

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**

# ఇవీ సంగతులు...

### భారతదేశ మాతృభాషా సర్వేక్షణ వివరాలు

576 భాషల సర్వేను సిద్ధం చేసిన గృహమంత్రిత్వశాఖ ఈ నివేదికలో పొందుపరిచిన భాషలు దశాబ్దానికొకసారి జరిపే భాషా జనాభా లెక్కల్లో వరుసగా రెండు సార్లు, అంతకు మించి వచ్చిన భాషలను పొందుపరిచినట్టు పేర్కొంది. కొన్ని ఎంపిక చేసిన భాషల భాషాపరమైన విశేషాలను కూడా ఈ నివేదికలో జత చేసినట్టు గృహమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా అన్ని భాషలకు సంబంధించిన దృశ్యకాలను(వీడియోలను) కూడా క్షేత్రస్థాయిలో సేకరించి పొందుపరిచినట్టు తెలిపారు. సర్వే చేసిన భాషలన్నిటికీ జాతీయ సమాచార సంబంధ సంస్థ, జాతీయ ఫిల్మ్ అభివృద్ధి సంస్థ కలిసి ఆడియో రూపంలో, వీడియో రూపంలో ప్రతి మాతృభాషలో సంభాషణలు పొందుపరుస్తాయని తెలుస్తోంది. 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో మొత్తం 19,569 భాషలు మాతృభాషలుగా ఉన్నట్టు 2018లో విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా తెలిపింది. ఈ 19,569 భాషలు/యాసలు/మాండలికాల పేర్లను జనాభా లెక్కల సమయంలో ప్రజలు పేర్కొన్నారు. వీటిని అధికారులు శాస్త్రీయంగా పరిశీలించి 121 ప్రధాన భాషలుగా కలిపేసారు.

### ముప్పై లక్షల పారిభాషిక పదాలను పెనువలలో వెతుక్కునే సదుపాయంతో చేర్చనున్న కేంద్ర సంస్థ

కేంద్ర ప్రభుత్వ సంస్థ CSTTI(శాస్త్రీయ, సాంకేతిక పారిభాషిక పదాల కమిషన్) భారతీయ భాషల్లో పారిభాషిక పదకోశాలను తయారు చేసి నిఘంటువుల నిర్మాణం చేస్తున్నది. ఈ సంస్థ తాజాగా ఒక ప్రకటనలో త్వరలో గూగుల్ వెతుకులాటలో కనపడేలా భారతీయ భాషల్లో పారిభాషిక పదాలను చేర్చనున్నట్టు చెప్పింది. shabd.education.gov.nic వలగూడులో ఈ పదాలు అందుబాటులో ఉంటాయి. (ప్రస్తుతానికి ఈ వలగూడు అందుబాటులో లేదు).

### ఇంగ్లిష్ భాషను సైతం తెలుగు, హిందీ ద్వారా బోధిస్తున్నారు

హైదరాబాదులోని ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులు ద్విభాషా పుస్తకాలున్నప్పటికీ పాఠ్యాంశాలను తెలుగులోనే బోధిస్తున్నారు. తెలుగు రాని, బీహార్-ఉత్తరప్రదేశ్-మధ్యప్రదేశ్ మొ॥ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి హిందీ తప్ప వేరే భాష రాదు. వారికి బోధన హిందీలోనే జరుగుతుంది. ఇంగ్లిష్ సైతం తెలుగు, హిందీ ఆధారంగా బోధిస్తున్నామని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు చెప్పారు.

### ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి. విజయబాబు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పాత్రికేయుడు పి. విజయబాబును నియమించింది.

### మరాఠీలో కూడా ఎంబీబీఎస్ పుస్తకాలు

మహారాష్ట్రలో వైద్యవిద్యను మరాఠీ భాషలో బోధించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఎంబీబీఎస్ పుస్తకాలను మరాఠీ భాషలో ముద్రించేందుకు ఏడుగురు సభ్యుల కమిటీని గురువారం నియమించింది. ఇటీవలే మధ్యప్రదేశ్ ప్రభుత్వం హిందీలో ఎంబీబీఎస్ పుస్తకాలను ప్రవేశపెట్టగా, ఇప్పుడు మహారాష్ట్ర కూడా స్థానిక భాషలో బోధించే దిశగా అడుగులు వేస్తోంది. వచ్చేవారం ముంబైలో కమిటీ సమావేశం నిర్వహించి దీనిపై చర్చించనున్నారు.

### తెలుగు రాయడమే రావట్లేదు!


బోర్డు మీద పేరు రాస్తున్న విద్యార్థి.. పరిశీలిస్తున్న కలెక్టర్

**విజయవాడ నవంబరు 22** (ఆంధ్రజ్యోతి) : పాఠశాల నిర్వహణ నిధులతో కోనేరు బసవయ్య చౌదరి పాఠశాలలో మౌలిక వసతుల పనులను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం తొమ్మిది, పదోతరగతి విద్యార్థుల నుంచి ఉపాధ్యాయుల విద్యాబోధనను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఒక విద్యార్థిని బోర్డు మీద పేరు తెలుగులో రాయమన్నారు. విద్యార్థులు తమ పేరును కూడా తప్పుగా రాయడంతో పిల్లలకు చదువుతోపాటు రాయడం కూడా నేర్పించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. పదోతరగతి విద్యార్థులు తెలుగు కూడా చదవలేని స్థితిలో ఉన్నారని డీఈవో సీవీ రేణుకపై అసహనం వ్యక్తం చేశారు. తమ పేరు రాయడానికి కూడా కష్టపడుతున్నవారు ఇతర సబ్జెక్టులు ఎలా నేర్చుకోగలరని విద్యార్థులను ప్రశ్నించారు. విద్యార్థులు లెక్కల్లో చాలా వెనుకబడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వాహణను పరిశీలించి నాణ్యత, నిర్వహణ. సరిగా లేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో మోడల్ పాఠశాలగా పేరున్నా అందుకు తగ్గ ప్రమాణాలు లేవన్నారు. అన్ని పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

Date : 26/11/2022 EditionName : GREATER HYDERABAD PageNo :

మూడో తరగతిలోనూ

# మాతృభాష చదవలేకపోతున్నారు!

- తెలుగు రాష్ట్రాల్లో 52 శాతం మంది విద్యార్థుల పరిస్థితి ఇదీ
- 19% మంది ఒక్క తెలుగు పదమూ చదవలేకపోయారు
- ఎన్‌సీఈఆర్‌టీ సర్వేలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఏపీలలో మూడో తరగతి విద్యార్థులు కూడా తెలుగును తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు. ఈ విషయంలో ఏకంగా 52 శాతం మంది కనీస ప్రమాణాలు చేరుకోలేదు. మొత్తం విద్యార్థుల్లో 19 శాతం మంది ఒక్క పదమూ సరిగా పలకలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక గణితంలో ఏపీలో 47 శాతం, తెలంగాణలో 49 శాతం మంది కనీస ప్రమాణాలను అందుకోలేకపోయారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) పేరిట అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాల్ని అమలు చేస్తోంది. తెలంగాణలో 'తొలిమెట్టు' పేరుతో ఆగస్టు 15న దీనికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా మౌఖికంగా, రాతపూర్వకంగా పరిశీలించారు. మొత్తం 20 మాతృభాషల్లో, గణితంలో 3వ తరగతి విద్యార్థుల పరిస్థితిపై జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) తాజాగా నివేదికను విడుదల చేసింది. సర్వేలో భాగంగా



ప్రతి రాష్ట్రంలో కొందరు విద్యార్థులను కలిసి నివేదిక రూపొందించారు. దేశంలోని 10 వేల ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 3వ తరగతి విద్యార్థులు 86 వేల మందికి సంబంధించిన అధ్యయన నివేదిక ఇది. తెలుగు రాష్ట్రాల్లో 183 పాఠశాలల్లోని 1,583 మంది విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

## అబ్బాయిల కంటే మెరుగ్గా అమ్మాయిలు

ప్రపంచస్థాయి ప్రమాణాల ప్రకారం నిమిషంలో 8 పదాలలోపు మాత్రమే చదవగలిగిన వారిలో కనీస ప్రాథమిక పరిజ్ఞానం లేదని అర్థం. 9-26 మధ్య పదాలను తప్పులు లేకుండా చదివితే ప్రపంచ కనీస ప్రమాణాలను పాక్షికంగా అందుకున్నట్లు లెక్క. 27-50 మధ్య పదాలు చదవగలిగితే ప్రపంచ కనీస సామర్థ్యాలను కలిగి ఉన్నారని లెక్క. ఈ ప్రకారం ఏపీ, తెలంగాణలలో సగటున 52 శాతం మందిలో కనీస అభ్యసన సామర్థ్యాలు లేవని స్పష్టమైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలు చాలా వరకు మెరుగ్గా ఉన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తర్వాత ఏమేర మార్పు వస్తుందో వేచిచూడాలి.

| చదివిన పదాల సంఖ్య | విద్యార్థుల శాతం |
|---|---|
| 0 | 19 |
| 1-10 | 6 |
| 11-20 | 13 |
| 21-25 | 14 |
| 26-30 | 14 |
| 31-35 | 10 |
| 36-40 | 7 |
| 41-45 | 5 |
| 46-70 | 12 |

(గమనిక: నిమిషం వ్యవధిలో సరిగా చదివిన పదాల సంఖ్య)

ఒక పేరా ఇచ్చి ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు చెప్పినవారు

| సగటు సరైన జవాబులు | విద్యార్థుల శాతం |
|---|---|
| 0-20 | 19 |
| 21-40 | 6 |
| 41-60 | 15 |
| 61-80 | 22 |
| 81-100 | 38 |

గణితంలో ప్రధాన రాష్ట్రాల వారీగా పరిస్థితి (శాతాల్లో..)

| రాష్ట్రం | కనీస స్థాయిలేని | పాక్షిక సామర్థ్యాలు | కనీస సామర్థ్యాలు | ప్రమాణాలకు మించి |
|---|---|---|---|---|
| ఏపీ | 9 | 38 | 44 | 9 |
| తెలంగాణ | 11 | 38 | 40 | 11 |
| కేరళ | 7 | 38 | 46 | 9 |
| తమిళనాడు | 29 | 48 | 20 | 3 |
| కర్ణాటక | 8 | 36 | 42 | 14 |
| మహారాష్ట్ర | 11 | 37 | 42 | 10 |
| బిహార్ | 9 | 25 | 48 | 18 |
| పశ్చిమబెంగాల్ | 5 | 26 | 53 | 16 |
| హరియాణా | 8 | 41 | 45 | 6 |
| గుజరాత్ | 18 | 44 | 31 | 7 |

# From Hyd, tutoring nuances of Telugu to kids settled abroad

Sushil.Rao@timesgroup.com

**Hyderabad:** Despite migrating to the countries where they have gone to make a living and settled, many parents from the two Telugu states are particular that their children learn to speak, read and write Telugu.

**WORLD AT YOUR FEET**
TRACKING TELUGU DIASPORA

A Telugu teacher in Hyderabad is catering to the needs of such families, teaching Telugu to the children online. Shatapatra Manjari teaches Telugu to scores of such children from as many as 14 countries.

"The families live in different time zones across the world. Since they show great interest in learning Telugu, I have three other teachers who teach in shifts. Each child's needs and grasping ability and interest to learn vary. While parents may want their children to learn the language, ultimately it is up to us teachers to make the subject interest for the children," Manjari told **TOI**.

Manjari is a post-graduate in Telugu from Arts College, Osmania University, and she also did her MPhil. She was teaching degree college students in a private college until Covid-19 resulted in loss of a job. That is when she branched out into teaching the language to individual students from different countries. The children are mostly in the age group of five and 16 years.

The parents mostly are in IT jobs, software developers or running businesses of their own. "Sometimes, even the parents sit in the classes to see the progress of their child in the studies," Manjari said. What is also interesting is the grandparents of the children who would have left India to be with their children also take the interest to understand how the children are being taught.

## ROOTED TO TELUGU CULTURE



- Telugus abroad want their kids to speak, read & write Telugu
- Hyderabad tutor teaching Telugu to children from 14 countries
- Telugus largely settled in US, UK, Australia, Singapore, Sweden, France, Jordan, Qatar and Norway

"Kids pick up English fast. Sometimes, parents are unable to cope with their children's English, and would rather converse with them in Telugu
— **Shathapatra Manjari** | CITY-BASED ONLINE TUTOR

సంపుటి : 8 సంచిక : 9
అమ్మనుడి
డిసెంబరు 2022

సంపాదక హృదయం

# ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంతోనే: జాతీయ పాఠ్యప్రణాళికతో స్పష్టం

**ఇ**టీవల ఉభయ రాష్ట్రాల పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితిని వెల్లడించే కీలక అంశాలు పత్రికల్లో ప్రముఖంగా వచ్చాయి. మచ్చుకు కొంత సమాచారాన్ని తెలిపే వార్తల్ని ఈ పక్కపుటల్లోనే ఇచ్చాము. చూడండి. ఉన్నత పాఠశాలల్లో తెలుగు పిల్లలకు తమ పేర్లను కూడా సరిగా రాయడం చేతకాదు. చిన్న చిన్న కూడికలూ, తీసివేతలూ కూడా చేయలేనంత హీనస్థాయికి వారి లెక్కల జ్ఞానం పడిపోయింది. మోడల్ పాఠశాల అని ప్రభుత్వం చెప్పుకొంటున్న ఆ స్కూళ్లల్లోని పరిస్థితే ఇది.

ప్రభుత్వాలు సంజాయిషీ చెప్పుకోవలసిన అంశం ఇది. పాఠశాల విద్య స్థాయి ఇంత దిగజారిపోయినందుకు ఎవరిని శిక్షించాలి? బలి అయిపోతున్నవారు పిల్లలు!

❖ ❖ ❖ ❖

2020లో విడుదలైన నూతన జాతీయ విద్యావిధానంపై ప్రశంసలతోపాటు విమర్శలూ వచ్చాయి. కొన్ని అంశాలపై, ముఖ్యంగా విద్యలో బోధనాభాషపట్ల విధాన స్పష్టత లేకపోవడం ఇందుకు ఒక కారణం. ఇప్పుడు 'జాతీయ పాఠ్యప్రణాళిక ముసాయిదా' విడుదల కావడంతో కొన్ని సందేహాలు పటాపంచలైపోయాయని అనుకోవచ్చు. ఆ ముసాయిదాలో ఇచ్చిన ప్రధాన సూత్రీకరణలు ఇలా ఉన్నాయి:

1. 0–8 సంవత్సరాల మధ్య వయస్సులోని పిల్లలు 'మాట్లాడే భాష'ను అమిత వేగంగా నేర్చుకొంటారు.
2. బహు భాషీయత (మల్టీ లింగ్వలిజం)లో మేథోవికాస, సంఘ–సాంస్కృతిక లాభాలు ఇమిడి ఉన్నాయి.
3. మాట్లాడడమనేది పిల్లలకు స్వాభావికంగా వచ్చే విద్య. ఐతే, వ్రాయడం, చదవడం అనేవి అంత స్వాభావికంగా రావు. వాటిని నేర్చుకోవాలి.
4. సంక్లిష్ట భావనలు (నాన్ ట్రివియల్ కాన్సెప్ట్స్) పిల్లలు తమ మాతృభాషలో మాత్రమే త్వరితంగా, లోతుగా గ్రహించగలరు.
5. సాంస్కృతిక అవగాహన, వ్యక్తీకరణలకు భాషే ప్రాణం. పిల్లలందు నైపుణ్యాభివృద్ధికి ఇదే మూలం.

పై 5 సూత్రీకరణల్లో 4వ అంశానికున్న ఆరు వివరణలు ఇవి:

(అ) సాధారణంగా పిల్లలు మూడు సంవత్సరాల ప్రాయం నిండగానే విద్యాలయప్రవేశం చేస్తారు. ఆసరికే వారు తమ మాతృభాషలో అవశ్యజ్ఞానం కలిగివుంటారు... వినడం, మాట్లాడటం, అవగాహన చేసుకోవడం, ఇతరులతో తమ భావాలను అర్థవంతంగా, విజయవంతంగా పంచుకోవడం మొ॥ విషయాలందు నైపుణ్యాలను, సైతం సాధిస్తారు. ఇతర భాషలను గ్రహించే నేర్పు, ఇతరులతో సంబంధాలను నెరపడం మొదలైనవి. ఇవన్నీ కూడా ప్రాథమికంగా పిల్లల సృజనాత్మకత, విమర్శనాత్మక విశ్లేషణ, ప్రాథమిక స్థాయిలో గోచరించే అక్షరం–అంకెల పరిజ్ఞానాలకు సంబంధించినవి. ప్రాథమిక స్థాయిలో కనుక వివిధ పాఠ్యాంశాలను ఆ విద్యార్థుల మాతృభాషలో బోధిస్తే పిల్లల మేథోవికాసం, సాంఘికాభినివేశం అంచెలంచెలుగా పెరిగి, వారి అభివృద్ధికి ఆటంకాలు లేని రహదారులనేర్పరుస్తాయి. కాబట్టి 'ఇంటిభాష'(మాతృభాష)యే ఉత్తమం. అంటే పిల్లల ఇండ్లలో మాట్లాడే భాష వారి విద్యార్జన క్రమాన్ని సులభతరం చేసి, ఇంటా–బయటా కొనసాగే విద్యాక్రమానికి త్వరితంగా అనుసంధానిస్తుంది.

(ఆ). ఒక విద్యార్థి విద్యాలయ ప్రవేశం చేసినప్పుడు తరగతి గదిలో పరాయి భాష మాధ్యమంగా బోధన కొనసాగితే– అంతకు మునుపు మూడు సంవత్సరాలు ఆ విద్యార్థి అవగాహన చేసుకొని, నేర్చుకున్న భాషాజ్ఞానం, విషయ పరిజ్ఞానం పూర్తిగా అసంబద్ధమై, అసంగతమై పోతాయి. దీనికి ప్రధాన కారణం, పరాయి భాషలో బోధన మొట్టమొదటి నుండి మరలా ప్రారంభం కావడమే! అంతవరకు ఆ విద్యార్థి తనకు బాగా పరిచయమైన 'ఇంటిభాష'(మాతృభాష)లో పొందిన అనుభవం, నేర్పు, అసంఘటిత విద్యాక్రమం, అభ్యాసరీతి పూర్తిగా పూర్వపక్షమైపోతాయి. తిరోగమనమార్గంలో పయనిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా మనకు లభించే ఆధారాలు ఈ విషయాలనే తెలియచేస్తున్నాయి. పిల్లలు తమ 'ఇంటిభాష'(మాతృభాష)లో అభ్యసిస్తే, కేవలం భాష మాత్రమే కాక, ఇతర విషయాంశాలైన గణితం, సామాన్యశాస్త్రాలను సైతం సులభంగా నేర్చుకుంటారు. మాతృభాష కాని భాషలో విద్యాభ్యాసం చేస్తే సహవిద్యార్థులకంటే సమవయస్కుల కంటే వీరు వెనుకబడతారని నివేదికలు నివేదిస్తున్నాయి.

(ఇ). మాతృభాషలో నేర్చుకొన్న విషయాంశాలను, నైపుణ్యాలను భాషామాధ్యమం మారినపుడు మరలా, మరలా పిల్లలకు బోధించాల్సిన అవసరం లేదు. శాస్త్రీయ పరిశోధనలు ఆ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి.

(ఈ). మాతృభాషంటే కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమే కాదు! పిల్లల వ్యక్తిగత, సాంఘిక,

సాంస్కృతిక ప్రాతినిధ్య స్వభావం దానిలో ఇమిడి వుంటుంది. దీన్ని విస్మరించి మరో భాషా మాధ్యమంలో పిల్లలకు చదువునేర్పడం అత్యంత గర్హనీయమే కాక, ఏ మాత్రం కోరుకోదగింది కాదు. చిన్న పిల్లలందు ఆత్మస్థైర్యం, ఆత్మగౌరవం, స్వతంత్ర వ్యక్తిత్వం, స్వీయ నైపుణ్యాలను పెంపొందించి, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేసే తరుణంలో ఈ పరాయి భాషా మాధ్యమం ఎంత మాత్రం తగని విషయం. లేనియెడల, ఉపాధ్యాయుల ధ్యేయాలు నీరుగారిపోతాయి.

(ఉ). నేర్చుకునే క్రమంలో పిల్లలందరికీ గణనీయమైన, గుణాత్మకమైన మద్దతు వారి మనోభావాలను పరిరక్షించే వాతావరణం ఎంతో అవసరమని శాస్త్రీయ పరిశోధనలు తెలియచేస్తున్నాయి. ఇది కేవలం పిల్లలకు తెలిసిన భాషలో(ఇంటిభాష)మాత్రమే సాధ్యం.

(ఊ). వినడం, మాట్లాడడం, ఇతరులతో కొనసాగించే సంభాషణల ద్వారా పిల్లలు ఎంతో నేర్చుకుంటారు. కేవలం మాతృభాష మాత్రమే ఇలాంటి అభ్యసన వాతావరణాన్ని పరిపుష్టం చేసి, పిల్లల సమగ్రాభివృద్ధికి దోహదంచేస్తుంది. కావున, సంభాషణ మాధ్యమం తప్పనిసరిగా మాతృభాషై వుండాలి. ఇదే విద్యకు నిజమైన పునాది...

"జాతీయ విద్యావిధానం -2020 పూర్తి నూతనత్వ ధోరణులకు తెరతీసింది. బట్టీయం పట్టే బండ పద్ధతి నుండి తన దృష్టిని మూడు ముఖ్యవిషయాలపై కేంద్రీకరించింది. అవి: సృజనాత్మకత; సంశోధన(పరిశోధన); సంభాషణ సహిత అభ్యసనక్రమం. వీటన్నింటికీ సహజ పరిణామమేమిటంటే- ప్రాథమిక(పునాది) స్థాయిలో మాతృభాషే మాధ్యమంగా కొనసాగడం! మరో భాషామాధ్యమాన్ని ఆ స్థాయివిద్యలో నిరుత్సాహపరచడం!

జాతీయ పాఠ్యప్రణాళిక ముసాయిదా (ఎన్.సి.ఎఫ్) పత్ర ప్రధాన సూత్రాలు: విద్యార్థులు మాతృభాషను గౌరవించడం; విద్యార్థులందరూ తమ, తమ, మాతృభాషల్లోనే భావాలను వ్యక్తీకరించే పద్ధతిని ప్రోత్సహించడం; సాధ్యమైనంతమేర తరగతి గదిలో బోధన మాతృభాషలో కొనసాగడం. మాతృభాషలను కొనసాగిస్తూ, ఇతర భాషలను అన్వయం చేసుకుంటే, విద్యార్థులు భాషాంతరాలను సులభంగా గుర్తుంచుకొని, బహుభాషావరణంలో భాసించగలరు."

చివరగా ఈ ముసాయిదా పత్రంలో ఇలా ఉంది: భారతదేశంలోని వివిధ భాషలు, మౌఖిక - లిఖిత సాహిత్యాలు, విభిన్న సంప్రదాయాలు- ఇవన్నీ విద్యార్థుల విద్యాభ్యాస క్రమంలో, వారి అనుభవ పరిధుల్లో చాలా ప్రముఖ పాత్రను పోషిస్తాయి. అవే వారి సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి రహదారి మార్గాలు.

2020 కొత్త జాతీయ విద్యావిధానాన్ని గాని, దానిని వివరిస్తూ ఇప్పుడు ప్రజల ముందుకొచ్చిన 'జాతీయ పాఠ్యప్రణాళిక ముసాయిదా'ను గాని మన పాలకవర్గాలు పట్టించుకొని తీరాలి. వీటిని ఎక్కువకాలం నిర్లక్ష్యం చెయ్యలేరు.

❖ ❖ ❖ ❖

పాలన, బోధన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రెండు అంశాలపై కోర్టులో నడుస్తున్న వ్యాజ్యాలతో శ్లేష్మంలో పడ్డ ఈగలాగా ఇరుక్కుపోయింది. అబద్ధాలను ఆవాహన చేస్తూ సుప్రీంకోర్టు దాకా చేరుకొంది. పాలనలో తెలుగు అమలు విషయంలో ఇప్పటికే సమాధానం లేని స్థితిలోకి జారిపోయింది. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా నేతల, అధికారుల ధోరణి మారడంలేదు. ప్రజల్ని ఏమార్చి, తమ దారితో తాము సాగడమేతప్ప, తెలుగుజాతి జనుల క్షేమాన్ని గాని భవిష్యత్తునుగాని పట్టించుకోవడంలేదు.

ఇక్కడ కొత్త జాతీయ విద్యావిధానం, మొత్తంగా ఘనంగా ఉన్నదని మేము వకాల్తా పుచ్చుకొని మాట్లాడంలేదు. కొత్త పాఠ్య ప్రణాళిక ముసాయిదాను బట్టి మాత్రమే ఇదంతా వ్రాస్తున్నాం.

భారత రాజ్యాంగం ఎంతగొప్పదైనా, అమలు చేసేవారిని బట్టే దాని ప్రయోజనం నిరూపితమౌతుందన్నట్లుగానే, కొత్త జాతీయ విద్యావిధానం పరిస్థితికూడా ఉంటుంది. పాలకులు చెప్పేదంతా నమ్మడానికి విజ్ఞులు ఎప్పుడూ సిద్ధంగా ఉండరు. ప్రశ్నించే ఆస్కారం ఎప్పుడూ ఉంటుంది. పాలకుల రహస్య ఎజెండాలను, వ్యూహాలను గమనించలేనంత అమాయకులు కారు ప్రజలు.

బోధనా భాష, పాలనా భాషల విషయంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ వేసిన వ్యాజ్యాలు బలంగా నడుస్తున్నాయి. ఈ పోరాటాన్ని తెలుగుమాతృభాషోద్యమకారులు హృదయ పూర్వకంగా బలపరుస్తున్నారు. 'న్యాయస్థానాల్లో రాగల ఫలితాలతోనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. (తర్వాతి పుటల్లో డా.శ్రీనివాస్ వ్రాసిన బహిరంగలేఖను ఇచ్చాము. దయచేసి దానిని చదవండి) ఇప్పుడు తెలుగు భాషోద్యమం ఇంకా చైతన్యమంతం కావలసిఉంది. ముఖ్యంగా బోధనారంగంలో ఉన్నత స్థాయిలోనివారు ప్రజల్లోకి వెళ్లి వారిని కదిలిస్తూ ఉద్యమ నేతృత్వం వహించాలి. ఒకప్పుడు భద్రిరాజు కృష్ణమూర్తిగారు తానుగా నడుంకట్టుకొని ముందుకు రాలేకపోయినా, ఉద్యమాల అవసరం గురించి హెచ్చరించారు. ఆ సందేశాన్ని 'అమ్మనుడి'లో ఇటీవలే ప్రచురించాము కూడా. ఇప్పుడాయన శిష్యులు, ప్రశిష్యులూ పూనికవహించి, ముందుకు రావలసిన సమయం వచ్చింది.

తెలుగుజాతికి రెండు రాష్ట్రాలున్నాయి. సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడు పి.వి. నరసింహారావు, ఎన్టీరామారావు వంటివారు కీలక నిర్ణయాలు తీసుకొని వ్యవస్థల్ని ఏర్పాటుచేశారు. విద్యాశాఖ మంత్రులుగా పి.వి., మండలి కృష్ణారావు వంటి వారు ఎంతో కృషిచేశారు. ఉద్యమచైతన్యంతో ఎందరో సంఘాలుగా వ్యక్తులుగా పనిచేశారు, చేస్తున్నారు. అయినా వారి శక్తి, బలమూ చాలడంలేదు. గత అనుభవాల నుండి నేర్చుకొన్న పాఠాల్ని బలంగా స్వీకరించి, నిరంతర ఉద్యమ చైతన్యాన్ని ప్రజల్లో నిర్మాణం చేస్తూనే ఉండాలి. గుంటుపల్లి శ్రీనివాస్ వంటి నిబద్ధత గల విజ్ఞాన వంతులను బలపరచాలి. ప్రజల్లోకి వెళ్లి ఉద్యమాలతో ప్రభుత్వాలను దారికి తెచ్చుకోవాలి. ఉద్యమాలతోనే ఎటువంటి మార్పునైనా సాధించగలం. ప్రజాస్వామ్యంలో చోదకశక్తి అదే.

30-11-2022

సామల రమేష్‌బాబు

డా॥ గుంటుపల్లి శ్రీనివాస్
93948 10088

## పండితులకు, పెద్దలకు, భాషావేత్తలకు, రాజకీయ నాయకులకు, మేధావులకు, పత్రికాధిపతులకు, టీవీ ఛానళ్ళ వారికి

# ఒక పామరుడి విన్నపం

**100** సంవత్సరాల ముందు కన్నా ఇప్పుడు తెలుగులో కవులు పెరిగారు, అచ్చు వేసే పుస్తకాలు కానీ/ఇ – పుస్తకాలు కానీ వ్రాసేవారు,ఆ పుస్తకాలు ప్రచురించేవారి సంఖ్య ఎన్నో రెట్లు పెరిగింది. సాహిత్య ప్రక్రియ కూడా అంతే స్థాయిలో కొనసాగుతూనే ఉంది. ప్రజలలో అక్షరాస్యత ఎన్నోరెట్లు పెరిగింది. అయినా తెలుగు భాష అంతరించిపోతుంది అన్న భయం అందరిలో ఉంది. ఎందుకని? దీనికి గల కారణాలు ఏమిటి? నా మనస్సులోని ప్రశ్నలు మీలాంటి పెద్దలముందు ఉంచుతున్నాను. ఎందుకంటే, ఈ కీలక సమస్యలపై అందరూ మనస్సు పెట్టి ఆలోచిస్తే పరిష్కారం దొరుకుతుందేమోనన్న చిన్న ఆశతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

1. ఇప్పుడు అందరి చేతుల్లో సెల్‌ఫోన్‌లు / స్మార్ట్‌ఫోన్‌లు ఉన్నాయి. అందులో మెసేజ్‌లు తెలుగులో, తెలుగులిపిలో వ్రాయటం మన పిల్లలకు, యువతకు, పెద్దలకు ఎందుకు నేర్పలేకపోతున్నాము? ఆటంకం ఏమిటి? దానిని అధిగమించాలంటే ఏమిచెయ్యాలి?

2. వందల సంవత్సరాల తెలుగుజాతి యొక్క వివేకం, వివేచన అయిన 'శతక సాహిత్యాన్ని' చక్కటి కథలతో, బొమ్మలతో జోడించి … పిల్లలకు ఎందుకు చేరువ చేయలేకపోతున్నాము?"

(నిజానికి శతకసాహిత్యంలో ఉన్నది … Life skills… అంటే వివిధ సందర్భాలలో ఒక మనిషి ఎలా ఆలోచించాలి, ఎలా ప్రవర్తించాలో చెప్పేవి….. ఇది కాలాతీతమైన జ్ఞానం).

3. బడిలోని తెలుగు పాఠ్య పుస్తకాలు చూస్తుంటే చాలా బాధగా ఉంది. ఏదైనా పాఠ్యాంశం వ్రాస్తే దానికి ఒక లక్ష్యం ఉండాలి. ఆ పాఠం తయారు చేసేటప్పుడు "ఆ పాఠం యొక్క ఉద్దేశ్యం ఏమిటి ? పాఠం చదివిన తర్వాత పిల్లవాడు నేర్చుకోవాల్సిన అంశాలు ఏమిటి? ఆ పాఠం నుండి నేర్చుకోవాల్సిన, నేర్పాల్సిన అంశాలను (భాషలోని నాలుగు నైపుణ్యాలైన వినడం, మాట్లాడటం, చదవడం, వ్రాయటం గురించిన లక్ష్యాలను) నిర్దుష్టంగా నిర్దేశిస్తున్నామా? అసలు SCERT కి, విద్యాశాఖకు ఇందులో ఏమైనా స్పష్టత ఉందా?

4. సైన్స్ పుస్తకాలను, పాఠ్యాంశాలను తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు, మరీ ముఖ్యంగా సాంకేతిక పదాలు(technical terminology) క్లిష్టంగా ఉండేవిధంగా అనువాదం చేసి వ్రాయడం వలన 'తెలుగు విద్యార్థులకు, ప్రజలకు, జాతికి నిజంగా మంచి జరిగిందా??

5. ప్రపంచంలో ఎక్కడైనా భాషా సామర్థ్య పరీక్షలు అంటే నాలుగు నైపుణ్యాలు పరీక్షిస్తారు. అనగా వినడం (listening), మాట్లాడటం(speaking), చదవడం(reading), వ్రాయడం (writing). కానీ మన పరీక్షావిధానం ప్రపంచ స్థాయిలోలేదు (పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం అయితే నైజీరియా, కాంబోడియాల కన్నా అధ్వానం!).

కానీ మార్కులు మాత్రం విశ్వంలో అందరికన్నా మనమే ఫస్ట్ !! (హిందీలో ఉత్తరప్రదేశ్ వారి కన్నా, మనవాళ్ళకే అధిక మార్కులు, అధిక ఉత్తీర్ణత; ఇంగ్లీష్ మార్కులలో అయితే బ్రిటీష్ విద్యార్థులు మన ముందు దిగదుడుపే !! ) ..

ఇన్ని మార్కులు వస్తున్నా… కనీసం పట్టుమని 'పది పదాలు' తప్పులు లేకుండా వ్రాయలేక పోతుంటే "లోపం ఎక్కడుంది??". దానిపై ఎందుకు మనం దృష్టి పెట్టడం లేదు? దానికి పరిష్కారం ఏమిటి?

6. ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ప్రచురించిన బైలింగ్వల్ (bilingual) పుస్తకాల్లోని తెలుగు వాక్యాల నిర్మాణం చాలా నాసిరకంగా ఉంది. ఆ పుస్తకాల నాణ్యత గురించి మైసూర్‌లోని పరిశోధనా సంస్థలోని వారు… వ్యాసాలు వ్రాశారు. కానీ తెలుగు నాట మేధావులకు, కవులకు, పండితులకు వాటిని ప్రశ్నించడానికి ధైర్యం సరిపోలేదా? లేక భాష ఏమైపోయినా పర్వాలేదు అన్న బాధ్యతారాహిత్యమా?? ఐఐఐటీ మోడల్ ప్రశ్నాపత్రంలో అయితే తెలుగు అనువాదం …. ఎంతో నాసిరకంగా ఉంది. వీటిని ప్రశ్నించకుండా ఉండి, తర్వాత తెలుగు స్థితి దిగజారిందని పెడబొబ్బలు పెడితే ఎలా?? పాఠశాల దశలోనే తప్పులు నేర్చుకున్న పిల్లలు, తర్వాత చక్కటి తెలుగులో వ్రాయగలరా? తేనెలొలికే తెలుగును ఆస్వాదించగలరా?

7. మన ఇళ్ల దగ్గర ఉన్న పచారీ కొట్టు దగ్గర నుండి , పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకు … అన్ని సరుకులు/ వస్తువుల పైన ఇంగ్లీష్‌లో మాత్రమే సమాచారం ఉంటుంది. మరి సామాన్య తెలుగు ప్రజలకు ఆ వస్తువు పేరు ఎలా అర్థం అవుతుంది? ప్రతి దుకాణంలో రసీదు ఇంగ్లీష్‌లో ఇస్తున్నారు? మరి సామాన్య తెలుగు ప్రజలకు అందులో ఉన్నది ఎలా అర్థం అవుతుంది?

ఏ 'బిల్లింగ్ మెషీన్' కు కూడా భాషా పక్షపాతమో, ఇంగ్లీష్ మీద వ్యామోహమో లేక తెలుగు అంటే ద్వేషమో ఉండదు. మనం వాడే సాఫ్ట్‌వేర్‌ను బట్టే బిల్లింగ్ మెషీన్‌లోనుండి బిల్లు వస్తుంది.




"తెలుగు భాష ఉన్న సాఫ్ట్‌వేర్" వాడితే తెలుగులోనే బిల్లులు వస్తాయి.

సుప్రీం కోర్టు తీర్పులు కూడా తెలుగు అనువాదంతో వస్తున్నాయి. కానీ, మనం రోజూ వాడే పాలప్యాకెట్, సబ్బు, పేస్టు, మిగతా వస్తువుల పై మాత్రం తెలుగులో వివరాలుండవు .. ఎందుకని?

8. పరిపాలన అనేది ప్రజల కోసమా లేక అధికారుల కోసమా? ప్రభుత్వ అధికారుల కోసమే అయితే "వారికి ఇష్టం వచ్చిన భాషలో వ్రాసుకోమనండి. కానీ ప్రజలకు ముందు తేల్చి చెప్పండి ... పరిపాలన ప్రజలకోసమా లేక అధికారుల కోసమా??

9. భాష అంటే మనకన్నా ఎంతో మక్కువ (ఒకరకంగా దురభిమానం) ఉన్న జర్మన్‌లు, వారి పిల్లలకు 1వ తరగతి నుండి (కొన్ని చోట్ల LKG) ఇంగ్లీష్ నేర్పుతున్నారు. దానికోసం వారు ఇంగ్లీష్ మాధ్యమంలోకి మారలేదు. భాషలో నాలుగు నైపుణ్యాలకు (వినడం, మాట్లాడటం, చదవడం, వ్రాయటం) సరియైన ప్రాధాన్యతనిస్తూ ఇంగ్లీష్ నేర్పుతున్నారు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలలో, మన తెలుగు వారు కొన్ని లక్షల మంది నివసిస్తున్నారు. కనీసం వారిని ఒక్కసారైనా ఇంటర్వ్యూ చేసి... అక్కడ పిల్లలకు ఇంగ్లీష్(లేదా ఇతర విదేశీ భాషలు ... స్పానిష్ , ఫ్రెంచ్ వగైరాలు) ఎలా నేర్పుతున్నారు? వారు వాడుతున్న పద్ధతి ఏమిటి? వారి పాఠ్యపుస్తకాలు ఎలా ఉన్నాయి? పరీక్షా విధానం ఎలా ఉంది అని ఎందుకు అడగడం లేదు?

జాతిపిత మహాత్మా గాంధీ పిల్లలకు 4-5 భాషలు అయినా నేర్పవచ్చు. వారికి నేర్చుకొనే సామర్థ్యం ఉంది అని చెప్పారు. నిజానికి వారికి భాషలు నేర్పడం మనకు (ముఖ్యంగా పాఠశాలకు) చేతకాదు. వీళ్లచేతగాని తనానికి "వేసుకున్న ముసుగే ఇంగ్లీష్ మీడియం". కొత్త భాష నేర్పడానికి, కొత్త భాష నేర్చుకోవడానికి "ఆ భాషా మాధ్యమంలో చదువుకోనక్కరలేదని మహానుభావుల దగ్గర నుండి, అంతర్జాతీయ అనుభవం, చరిత్ర మరియు నూతన జాతీయ విద్యావిధానం ఘోషించినా.... మన చెవులకెక్కడం లేదు. కారణం '' మన ఆలోచనలోనే తప్పుంది ... అని గ్రహించలేకపోతున్నాము". సత్య నాదెళ్ల మనవాడే, మిగతా కంపెనీల సీఈఓలు మనవాళ్ళే అన్న దురభిమానం " వాస్తవాన్ని చూడనివ్వటం లేదా?".

ఈ ప్రశ్నలకు మనం నిజాయితీగా సమాధానాలు వెతికి, వాటి సాధనకు కంకణ దారులమవ్వటమే మనముందు ఉన్న కర్తవ్యం.

ఇట్లు, మీ... డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్.

(డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ ఆధునిక వైద్య శాస్త్రంలో ఉన్నత విద్యను పొంది, ఒక ప్రఖ్యాత హాస్పిటల్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నారు. తెలుగులో పరిపాలన జరగాలనీ, తెలుగు మాధ్యమంలో ప్రాథమిక విద్యాబోధన చేయాలనీ కోరుతూ - ఈ రెండు అంశాలపైనా ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ- ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో పోరాడుతున్నారు.

-సం॥).

స్పందన

# వర్ణ వివక్షకు జయం కలగకూడదు!

'అమ్మనుడి' నవంబరు సంచిక అట్టమీద బ్రిటన్ కొత్త ప్రధాని ఫొటో కింద రాసింది చూసి చాలా ఆశ్చర్యం వేసింది. మీరు రాసినదానిలో 4 విషయాలున్నాయి. నాలుగూ నిజం కాదు.

(1) భారతదేశాన్ని 200 ఏళ్ళు పాలించింది బ్రిటన్ అన్నారు. ప్రత్యక్షంగా పాలించింది నిజమే గానీ, ఆ దేశపు పెట్టుబడులు ఈ దేశంలో ఇప్పటికీ ఎన్నో వున్నాయి. (తరిమెల నాగిరెడ్డిగారు రాసిన 'తాకట్టులో భారత దేశం' అనే పుస్తకం లో ఇచ్చిన వివరాలతో సహా). దానికి తోడు 'సహాయం' పేరుతో అక్కణ్ణించీ కొన్ని నిధులు వస్తున్నాయి. వీటి వల్ల, బ్రిటన్, తనకు అనుకూలమైన విధానాలను, ఇక్కడి పాలకులద్వారా సాధించుకోగలుగుతుంది. ఆ రకంగా, బ్రిటన్ ఆధిపత్యం ఎంతోకొంత ఇప్పటికీ వున్నట్టే.

(2) కొత్త ప్రధాని 'రుషి' కి భారత మూలాలున్నాయనడం కూడా ప్రశ్నార్థకమే! అతని తాతలు ఎప్పుడో, ఒక ఆఫ్రికా దేశానికి వలస వెళ్ళి, ఆ తర్వాత తండ్రి కాలంలో బ్రిటన్‌కి చేరారు. రుషి బ్రిటన్ లోనే పుట్టాడు. ఇంక అతనికి భారత మూలాలున్నాయనడం ఎలా సాధ్యం? భారతదేశం నించి వెళ్ళిన స్త్రీని పెళ్ళిచేసుకున్నాడు. అంతే.

(3) సాంస్కృతిక అనుబంధాన్ని పదిలంగా వుంచుకున్నాడని రాశారు. ఏమిటా అనుబంధం? చేతులకి ఎర్ర దారాలు కట్టుకుని, ఆవుని పూజిస్తే సాంస్కృతిక అనుబంధం వున్నట్టేనా? అతని పూర్వుల భాష పంజాబీ అతనికి వచ్చా? మాట్లాడతాడా? అతను పుట్టుకతో ఇంగ్లీషు పౌరుడు. ఇంక భారత మూలాలేమిటి? పేరు ఒక్కటే భారతీయం.

(4) అతనికి జయము కలుగుగాక! అన్నారు, ఎందుకు? తన తల్లిదండ్రులు వచ్చినట్టు, అనేక లక్షలమంది ఇతర దేశాల నించీ బ్రిటన్‌కి వస్తూవుంటే, అలా వలసవచ్చే వారిని "ఇన్‌వేడర్స్" (దండయాత్రకి వచ్చినవాళ్ళు) అని, ఇతని మంత్రివర్గంలోని ఒక మంత్రిణి అంటే, ఇతను నోరుమెదపలేదు. ఇతని పార్టీ వర్ణవివక్షతో కూడిన చట్టాల్ని తీసుకొచ్చింది. ఆ వివరాలు రాయడానికి ఇక్కడ చోటు చాలదు. అలాంటి పార్టీ తరఫున ఇతను ఇప్పుడు ప్రధాని. అలాంటి దుర్మార్గచట్టాల్ని తేవడంలో అతనికి జయం కలగాలా? చాలా అన్యాయం. మీరు సరైన సమాచారం తెలియకే అలా రాసివుండవచ్చును.

బ్రిటన్‌లో, ఇంగ్లీషు కాని ఇతర భాషల ప్రజలు లక్షల్లో వున్నారు. వారందరికీ వాళ్ళ మాతృభాషల్లో విద్యాబోధన ఏర్పాట్లు అతను గానీ, అతని పార్టీ గానీ చేస్తే, అతన్ని మీరు ప్రశంసించవచ్చు. ఎందుకంటే, మన పత్రిక పేరే 'అమ్మనుడి' కాబట్టి.

–భాస్కరమ్మ రామమోహన బాపూజీ, హైదరాబాదు

---

బాపూజీగారూ, మీరు ప్రస్తావించిన నాలుగు అంశాలూ నన్ను లోతుగా ఆలోచింపచేశాయి. సరైన సమాచారం లేకపోవడం అనే మాట మీరు నా మర్యాదను కాపాడడానికి అన్నారుగానీ సంపాదకుడుగా నేను ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించానేమో అనిపిస్తున్నది. నేను మరింత అధ్యయనం, పరిశీలన చేసిఉండాల్సింది మరింత ఆలోచింపజేసినందుకు మీకు మప్పిదాలు. –సం.

---

## రచయితలు ఈ క్రింది సూచనలను తప్పక గమనించాలి.

1. అమ్మనుడి పత్రికలో ప్రచురణ కోసం పంపే రచనలు మాకు చేరిన తరువాత వాటిని సంపాదకునితోపాటు మరి ఇద్దరి పరిశీలన కోసం సంప్రదించబడతాయి. అందులో ఒకరు తెలుగు భాషలో మరొకరు సాహిత్యాంశాలలోనూ లేదా చరిత్రకు సంబంధించిన అంశాలలోనూ నిపుణులైవుంటారు. ఆ నిపుణుల అభిప్రాయాన్ని కూడా పరిశీలించిన తరువాత పత్రిక సంపాదకుడు ప్రచురణకు నిర్ణయించే తుది నిర్ణయం తీసుకుంటారు. ఆ వెంటనే నిర్ణయాన్ని రచయితకు తెలియజేస్తారు.

2. ఆ తరువాత దానిని ప్రచురించడానికి కనీసం రెండు లేక మూడు నెలల వ్యవధి పట్టవచ్చు. వెంటనే ప్రచురించాలని రచయితలు తొందర పెట్టవలదని కోరుతున్నాము.

3. అమ్మనుడి పత్రిక ప్రధానంగా తెలుగుభాష రక్షణ, పరిశోధన, అభివృద్ధి అంశాలకు సంబంధించిన పత్రిక. తెలుగు సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలకు రెండవ ప్రాధాన్యత ఉంటుంది.

4. వ్యాసాల ప్రచురణ విషయమై తుది నిర్ణయం సంపాదకునిది మాత్రమే.

5. పరిశోధక విద్యార్థులు తమ గుర్తింపు ఉత్తరాన్ని తమ ప్రొఫెసర్ గారిచే ధృవపరచి పంపాలి.

6. రచయితలందరూ తమ రచనతో పాటు వారి పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు, మొయిల్ ఐడి తప్పక తెలియపరచాలి.

7. రచనను ప్రచురించిన పత్రిక రచయితలకు వారి మొయిల్ ఐడికి మాత్రమే పంపబడుతుంది. ముద్రిత ప్రతిని పంపడం వీలుకాదు. చందాదారులకు మాత్రమే అది పంపబడుతుంది.

పై అంశాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

–సంపాదకుడు, '**అమ్మనుడి**' మాస పత్రిక

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# భాషకు, లిపికి ఉన్న బంధం ఏమిటి?-4

**గత** సంచికలో మనం భట్టిప్రోలు లిపి గురించి, అక్కడ లభించిన బుద్ధ ధాతుపేటికల గురించి చెప్పుకున్నాం. తెలుగు సీమల్లో, తెలుగు సీమల వెలుపల ఆ తరువాత దక్షిణ భారతదేశంలో లభ్యమైన శిలాశాసనాలలో లిపులన్నిటికీ (తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో, గోవాలో) మూలంగా ఈ భట్టిప్రోలు లిపి ఉంది. తరువాత వచ్చిన రాజుల శాసనాల్లో నాగరలిపి ప్రవేశించినా, తిరిగి రేనాటి చోళుల శాసనాల నాటికి తెలుగు లిపిలో శాసనాలు వేయటం, తద్వారా రాజప్రాసాదాల్లో తెలుగు భాషకు వైభవం రావటం జరిగింది. ఇక అక్కడి నుంచి తెలుగు-సంస్కృత భాషల్లో శాసనాలు మనకు కనిపిస్తున్నాయి. కానీ ఈ శాసనాల్లో రాయబడిన లిపి ఎక్కడ నుంచి వచ్చింది?

భారతదేశంలో భాషల పరంగా భేదాలు భూమ్యాకాశాలలా ఉత్తర భారత భాషలకు, దక్షిణ భారత భాషలకు ఉన్నప్పటికీ, లిపిలో చూడటానికి అక్షరాల ఆకృతి వేరుగా ఉన్నా, ఉచ్చారణ-స్థానం-అమరిక విషయాలలో సామ్యత ఉంటుంది, హ్రస్వ ఏత్వం(ఎ), హ్రస్వ ఓత్వం(ఒ), ళ, ఱ మినహా మన అక్షరాలు కూడా ఒకటే. భాషల్లో ఇంత తేడా ఉండి, లిపులలో ఇంత సామ్యత ఎలా?

ముందుగా చెప్పుకున్నట్టు భాషలు మనుషుల నోళ్లలో నుంచి వస్తే, లిపులు విద్వాంసుల కలముల నుండి, శిలాశాసనాలు చెక్కే స్థపతుల ఉలి నుండి, వ్రాయసకాండ్ర ఘంటాల నుండి వచ్చాయి. భాషకు లిపి ఉండాలి, మాటలను రాతపూర్వకంగా నిక్షిప్తం చేయాలి అన్న ఊహ బహుశా మానవ పరిణామక్రమంలో పెద్ద మలుపుకు దోహదపడి ఉండాలి. ప్రపంచంలోని చాలా భాషలు లిపులు కలిగి ఉన్నాయి. ఒక నాగరికతకు, మరో నాగరికతకూ పెద్దగా సంబంధాలు లేకపోయినా, ఆయా నాగరికతలు తమ తమ లిపులను తయారు చేసుకున్నాయి. శబ్దాలను అనుసరించి అక్షరాలు ఉండే మన భారతదేశ లిపులు, పదాలను అనుసరించి ఉండే చీనా దేశపు లిపి లాంటి లిపులు, బొమ్మల ద్వారా చిత్రాల ద్వారా రాయబడే ఈజిప్టు (మిస్ర్) దేశపు హైరోగ్లిఫిక్స్ లిపులు, అక్షరాల ఆధారంగా శబ్దాలుండే రోమన్-ఆంగ్ల లిపులు. ఇలా లిపులు పలువిధాలుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. మరి భారతీయ భాషలన్నిటిలో లిపుల విషయంలో సామ్యత ఉంది. అదెందుకని?

భారతదేశంలో ఆధునికంగా చెలామణిలో ఉన్న లిపులన్నీ దాదాపుగా బ్రాహ్మీ లిపి నుంచి వచ్చినవే. ఈ బ్రాహ్మీ లిపికి మరియు తరువాత వచ్చిన అన్ని లిపులకు పాణిని శివ సూత్రాల ద్వారా అక్షరాలను ఏర్పరిచాడు.




ఈ అక్షరాలను తయారు చేసుకున్న శివసూత్రాలు/ మాహేశ్వర సూత్రాలు/ మహేశ్వర సూత్రాలు/ అక్షర సమామ్నయాలు / వర్ణసమామ్నయాలు/ మాహేశ్వరాణి సూత్రాలు మొత్తం పద్నాలుగు. పాణిని ఈ సూత్రాలను అక్షర సమామ్నాయాలనే పిలుచుకున్నాడు కానీ, ఆ తరువాత వచ్చిన నందికేశ్వరుడు లాంటి పండితులు ఈ సూత్రాలను శివసూత్రాలని వ్యవహరించారు. వారి ప్రకారం శివుడు తన డమరుకంతో పద్నాలుగు సార్లు శబ్దం చేయగా అక్షరాలు పుట్టాయని. అలా విన్న పాణిని వాటిని సూత్రీకరించాడని చెప్తారు.

ఆ పద్నాలుగు సూత్రాలు:

1. అఇఉణ్. 2. ఋ ఌ క్. 3. ఏఓఙ్. 4. ఐఔచ్. 5. హయవరట్. 6. లణ్. 7. ఞమఙణనమ్. 8. ఝభఞ్. 9. ఘఢధష్. 10. జబగడదశ్. 11. ఖఫఛఠథచటతవ్. 12. కపయ్. 13. శషసర్. 14. హల్.

ఈ పద్నాలుగు సూత్రాల్లో ఒక్కొక్క సూత్రం కొన్ని అక్షరాలు జతచేస్తే వచ్చింది. ఈ సూత్రాల ఆధారంగా పాణిని మొత్తం సంస్కృత వ్యాకరణాన్ని రూపొందించుకున్నాడు. ఈ సూత్రాలను సంస్కృత వ్యాకరణానికి ఆధార సూత్రాలుగా నమ్ముతారు వ్యాకరణకారులు. ఈ సూత్రాలు పాణిని రచనయిన అష్టాధ్యాయికి ముందుగానో లేదా అష్టాధ్యాయిలో భాగంగానో రచింపబడ్డాయని తెలుస్తోంది. అప్పటి సమాజంలో రాయడమనేది హీనంగా చూడబడేది. గుర్తుపెట్టుకుని ఒప్పచెప్పటం, ఒకరి ద్వారా విని గుర్తుపెట్టుకోవటం, విన్నవి విన్నట్టు తిరిగి మరొకరికి చెప్పటం అప్పటి చదువుల్లో ముఖ్యమైన లక్షణం. అందుకని అక్షరాలకు రూపం ఇవ్వటం మీదకన్నా, మనిషి మాట్లాడినపుడు వచ్చే ఒక్కొక్క శబ్దాన్ని గుర్తించి సూత్రీకరించడం పాణిని చేసాడు. ఈ సూత్రాలకు




ఇలానే రాయాలన్న నిబంధన లేనందువలన, అన్ని భారతీయ భాషలు ఈ సూత్రాల ఆధారంగా లిపులను నిర్మించుకోగలిగాయి. ఇలా అక్షరాలను సూత్రీకరించే సమయంలో పాణిని తనకు ముందున్న వ్యాకరణకారులను అనుసరించడంతో పాటుగా, స్వయంగా కొన్ని అక్షరాలను ఈ సూత్రాలలో చేర్చుకున్నాడు.

ముందుగా చెప్పుకున్నట్టు మాహేశ్వర సూత్రాలు శివుడు తన డమరుకాన్ని పద్నాలుగు సార్లు మోగించగా ఉత్పన్నమైన అక్షరాల సముచ్చయం అనుకున్నాం కదా. సంస్కృతంలో ఒక శ్లోకంలో ఈ విషయం చెప్పబడింది. ఆ శ్లోకం:

**"నృత్తావసానే నటరాజరాజో ననాద ఢక్కాం నవపఞ్చవారమ్!**
**ఉద్ధర్తుకామః సనకాదిసిద్ధాన్ ఏతద్విమర్శే శివసూత్రజాలమ్!!"**

అర్థం : తన శివతాండవాన్ని ముగిస్తూ శివుడు సనాకాది ఋషుల సిద్ధి కోసం, ఉద్ధరణ కోసం తొమ్మిది+అయిదు సార్లు అనగా పద్నాలుగు సార్లు తన డమరుకాన్ని వాయిస్తాడు. అలా పద్నాలుగు శివసూత్రాల ఈ వల(వర్ణమాల) పుట్టింది.

శివుడి నటరాజ రూపం నుంచి అక్షరాలు పుట్టి, ఆ అక్షరాల నుంచి వ్యాకరణం రూపొందింది కనుక వ్యాకరణసూత్రాల ఆద్యుడిగా నటరాజస్వామిని కొలుస్తారు.

పైన చెప్పిన పద్నాలుగు సూత్రాల ఆధారంగా పాణినికి పదాలను నిర్వచించడం, పదాల రూపకల్పనకు, ఇతరత్రా పదసంయోగాలకు కావాల్సిన నియమాలను రూపొందించడం సులువు అయింది. ఒక పదం రూపొందించటానికి కావాల్సిన అక్షరాలను ఒకటి కన్నా ఎక్కువ సూత్రాల నుండి తీసుకొని ఆ సూత్రాల ప్రత్యాహారంగా గ్రహించాడు. అందువలన మాహేశ్వర సూత్రాలను ప్రత్యాహార విధాయక సూత్రాలని కూడా అంటారు. మొదటి నాలుగు సూత్రాలలో(అఇఉణ్-ఐఔచ్)లలో అచ్చులను నిర్వచించి, మిగితా పది సూత్రాలలో హల్లులను నిర్వచించాడు పాణిని. పాణిని ఇక్కడ అచ్చులను అచ్ అని, హల్లులను హల్

అని వ్యవహరించాడు. నా గమనింపులో సంస్కృతంలో, హిందీలో ఇంకా ఇతర భారతీయ భాషల్లో అచ్చులను స్వరాలని, హల్లులను వ్యంజనాలని వ్యవహరిస్తారు. అంటే పాణిని వాడిన పదాలే తెలుగులో మనం వాడుతున్నాం. మిగతా భాషలు ఆ పదాలను మార్చుకున్నాయి.

ప్రత్యాహారమంటే ఇక్కడ అర్థం సంక్షిప్తీకరణ. ఈ ప్రత్యాహారాలను ఎలా రూపొందించుకోవాలోనన్న విషయాన్ని పాణిని అష్టాధ్యాయిలో వివరించాడు. “ఆదిరన్త్యేన సహేతా” అని. అనగా మనకు కావాల్సిన అక్షరాలున్న సూత్రాలలో మొదటి సూత్రం మొదటి అక్షరం, చివరి సూత్రపు చివరి అక్షరం కలిపితే కొత్త ఉపసూత్రం(ప్రత్యాహారం) వస్తుంది.

ఉదాహరణకు, అచ్ సూత్రం అఇఉణ్ సూత్రపు మొదటి అక్షరం అ, ఐఔచ్ సూత్రపు చివరి అక్షరం చ్ కలయికతో వస్తుంది. అచ్ సూత్రంలో అఇఉణ్ సూత్రంలోని అ–ఇ–ఉ, ఐఔచ్ సూత్రంలోని ఐ–ఔ అనగా అచ్ = అ ఇ ఉ ఋ ఌ ఏ ఐ ఓ ఔ వస్తాయి.

అలానే హల్ ప్రత్యాహారం కోసం ఐదవ సూత్రం మొదటి అక్షరం(హయవరట్ లో హ), పద్నాలుగవ సూత్రం చివరి అక్షరం (హల్ లో ల్) కలిపితే వస్తుంది.

హల్ = హ య వ ర, ల, ఞ మ ఙ ణ న, ఝ భ, ఘ ఢ ధ, జ బ గ డ ద, ఖ ఫ ఛ ఠ థ చ ట త, క ప, శ ష స, హ.

ఇలా పద్నాలుగు ప్రధాన సూత్రాలను వాడి 291 ప్రత్యాహార సూత్రాలను రూపొందించవచ్చు. అయితే ఈ వర్ణసముచ్చయాలలో అన్నిటికీ అర్థాలు ఉండకపోవచ్చు. పది కృత్రిమ ప్రత్యాహారాలు కూడా వస్తాయి. అయితే, పాణిని కేవలం 41 ప్రత్యాహారాలనే సూచించి వాడాడు.

ఇలా పాణిని రాతలో, మౌఖికంగా భాష ఎలా ఉండాలి అన్న విషయమై నియమాలు రాసుకున్నాడు. ఇవి సంస్కృత భాషకు వ్యాకరణంగా, తరువాతి కాలంలో అన్ని భారతీయ భాషలకు అక్షరాలుగా తయారయ్యాయి.

పాణిని ఈ సూత్రాలు రాసుకున్నాక పరికించి చూడగా ఋ అక్షరానికి దీర్ఘం అవసరం అయినది. అలానే ఋ కి అధివర్ణం కావాల్సి వచ్చింది. అలా ఌ అక్షరాన్ని సూచించాడు పాణిని. ఌ కి కూడా దీర్ఘం ఉండాల్సిన అవసరం ఉంది ఈ నియమాల ప్రకారం అలా ౡ అక్షరం వర్ణమాలకు చేరింది. ఇలా పాణిని అంతకు ముందు లేని మూడక్షరాలను – ౠ, ఌ, ౡ లను వర్ణాలలో కలుపుకుని ఈ సూత్రాలలో చేర్చాడు.

అలా మనం నేడు భారతదేశ వ్యాప్తంగా వాడుకుంటున్న అక్షరాలను దాదాపు ఐదు వేల సంవత్సరాల క్రితం పాణిని సూత్రీకరించాడు. అనగా మనది మౌఖిక భాషే, రాత భాష మనకు పై నుంచి దిగువకు అన్న పద్ధతిలో పండితులు నియమించిన చిహ్నాల ఆధారంగా వచ్చింది. **ఈ పరిణామక్రమాన్ని చూసాక నాకొచ్చిన ఊహ ఏంటంటే మన మాట్లాడే భాషను వ్రాయటానికి సరిపోయేన్ని అక్షరాలున్న ఏ లిపిలోనైనా తెలుగును వ్రాసుకోవచ్చు. అవతలి వ్యక్తికి మన భావాలు తెలియాలి అన్న లక్ష్యంతో మనం రాస్తున్నపుడు, అవతలి వ్యక్తికి తెలుగు లిపి తెలుసు అంటే తెలుగులో వ్రాయవచ్చు. కానీ అవతలి వ్యక్తికి తెలుగు లిపి రాదంటే తెలుగును ఆ వ్యక్తికి తెలిసిన లిపిలో వ్రాసివ్వటంలో ఏమైనా దోషం ఉందా?**

ఆ మధ్య తెలుగు విశ్వవిద్యాలయానికి వెళ్ళినపుడు ఆముక్తమాల్యద అరవ లిపిలో ఉండటం గమనించాను. పద్యాలన్నీ తెలుగువే, లిపి మాత్రం తమిళం. గీతా ప్రెస్ వారి దుకాణానికి వెళితే దాదాపు అన్ని భారతీయ లిపులలో సంస్కృత భగవద్గీత శ్లోకాలు కనిపిస్తాయి. అంటే **చదువుకోవాల్సిన వ్యక్తికి భాష జ్ఞానం ఉండి, అతనికి ఆ భాష లిపి తెలీకపోతే అతను తెలిసిన ఆ భాషను తెలిసిన లిపిలో చదువుకోవడంలో ఎలాంటి సమస్య ఉండకూడదు. తెలుగులిపి తెలీని తెలుగువాళ్ళు తెలుగును రోమన్(ఇంగ్లిష్) లిపిలో చదవడం ఇలాంటిదే.**

కినిగె పుస్తకాల వాళ్ళు ఆ మధ్య తెలుగు పుస్తకాలను ఇంగ్లిష్ లిపిలో తెంగ్లిష్ పుస్తకాలుగా అమ్మారు. ఆ పుస్తకాలను చదివే పాఠకులున్నారు.

తెలుగు కనిపించని సమస్యలున్న కాలంలో ఈమాట పత్రిక ఆంగ్ల లిపిలో తెలుగు భాషలో ఉండేది. అందువలన **మనకు మనది కాని, పై నుంచి అందించబడిన లిపి తెలుగు లిపిగా ఉన్నందున, చదివేవాడి సౌకర్యార్థం ఏ లిపిలో ఉన్నా భాష తెలుగు ఉండి, చదువరికి తెలుగు అర్థమైతే చాలు అన్న సందర్భంలో మనం నేడున్నాము.**

గత సంచికల్లో చెప్పుకున్నట్టు వీవెన్ గారు లేఖిని ని అందించడంతో పాటుగా నిఖిలేను అందించారు. https://lekhini.org/ వద్ద లేఖిని ఉంటే, https://lekhini.org/nikhile.html వద్ద నిఖిలే ఉంది.

ఈ రెండిటినీ అంతరవర్తిని (మధ్యవర్తి/ఇంటర్ఫేస్)గా ఉంచుకొని పని చేసే సాంకేతిక పనిముట్లను, ఆప్‌లను మనం రూపొందించుకుంటే ఆంగ్లంలో తెలుగును రాసేవారు తమ రాతను లేఖిని ద్వారా తెలుగులిపికి మార్చి తెలుగుచదివే వారికి అందిస్తే, తెలుగురాని ఆంగ్లం మాత్రమే చదవగలిగే వారికి తెలుగులిపిలో ఉన్న పాఠ్యాన్ని నిఖిలే లో ఆంగ్ల లిపిలోకి మార్చి పంపవచ్చు.

ఇలా మన భాష తెలిసి మన లిపి తెలీని వారికి వారికి తెలిసిన లిపిలోనే తెలుగును రాసివ్వగలిగే అక్షరాల జతలను తయారు చేసుకుంటే తెలుగు లిపిలోనే తెలుగును చదవాలన్న అడ్డంకిని తొలగించవచ్చు.

**వ్రాత సంప్రదాయం నుంచి మాట సంప్రదాయానికి మారుతున్న సంధి కాలంలో మనం ఉన్నాము. వ్రాతకు ప్రాధాన్యత తగ్గి మాటలకు, మాటల ద్వారా భావవ్యక్తీకరణకు ప్రాధాన్యత పెరుగుతోంది. తెలుగు వ్యాకరణవేత్తలు, భాషావేత్తలు తెలుగుకు ఈ లిపిప్రాధాన్యం లేని మాట ప్రాధాన్యమున్న కాలానికి తగినట్లు కావాల్సిన సామగ్రి సరంజామా రూపొందించుకోవటం వైపు పని చేయాల్సిన అవసరం ఉంది ఇప్పుడు.**

(తరువాయి వచ్చే సంచికలో…)

మట్టిపూడి సుబ్రహ్మణ్యం
79810 70615

# తెలుఁగు సంస్కృతంలోంచి వచ్చిందా?
# లేదు. సంస్కృతం తెలుగుకు పెంపుడు తల్లే తప్ప, కన్నతల్లి కాదు.

దాదాఁపు 2,000 బి.సి. ప్రాంతంలో వాడుకలో ఉండి మన కాలానికి అంతరించిపోయిన 'ప్రోటో-ద్రావిడియన్' అనే భాషలోంచి తెలుగు పుట్టింది. తెలుగుజాతికి ఆర్య హిందువులతోనూ వారి భాష అయిన సంస్కృతంతోనూ పరిచయం ఏర్పడకముందే తెలుగు భాష సంస్కృతం లేకుండా దాని కన్నా వేఱుగా స్వతంత్రంగా పెంపొందింది. సంస్కృతం కంటే దాని జన్యభాషల కంటే తెలుగు పూర్తిగా తేడా అయిన భాష అనే వాస్తవం – దాని ప్రాథమిక పదజాలంతో వాటి పదజాలాన్ని పోల్చడం ద్వారా మనకు తెలుస్తున్నది.

**ప్రాథమిక పదజాలం (basic vocabulary) అంటే ఏమిటి?**

ప్రాథమిక పదజాలం అంటే – ఒక జాతి తన నాగరికత యొక్క తొలుదొల్తటి దశలో ఒంటరిగా బ్రతుకుతున్నప్పుడు ఇతర జాతులతో ఎటువంటి సంబంధం లేకుండా లేదా వారి బాసట తీసుకోకుండా తనంతట తానే కనుగొని ఎసవాడిన మాటలు.

మచ్చుకు-సర్వనామాలు, చుట్టఱికపు మాటలు, అంకెలు, వస్తువులు, పదార్థాలు, దృగ్విషయాలు, ప్రకృతి శక్తులు, జంతువులు, చెట్లు, ప్రాథమిక క్రియలు మొదలైనవి. తెలుగువారు ఎసవాడే ప్రాథమిక పదజాలమూ ఉత్తర భారతీయులు ఉపయోగించే ప్రాథమిక పదజాలం ఎక్కడా కొద్దిగా కూడా కలవవు. కాబట్టి, తెలుగు పూర్తిగా ఒక భిన్నమైన రకం నుంచి దిగిందని తేటపడుతున్నది.

**ఆదాన పదాలు (borrowed vocabulary)**

కడచిన 1,300 ఏళ్ళలో – ముఖ్యంగా తెలుగువారు పెద్ద ఎత్తున హిందూ మతంలోకి మారిన తర్వాత – తెలుగు సంస్కృతం నుండి భారీగా మాటల్ని అరువు తెచ్చుకున్న మాట నిజం. ఇలా జరగడానికి ముందు వారు ప్రధానంగా బౌద్ధులు. అందువల్ల అంతకు ముందు ప్రాకృతం నుండి కూడా చాలా పదజాలం తీసుకుని ఉన్నారు.

తెలుగులో సంస్కృత ఆదాన పదాల వాటా ఎంత? అనేది ఖచ్చితంగా లెక్కించడం కష్టం. కానీ అది 50% – 80% మధ్య ఎక్కడైనా ఉండవచ్చు. నా వ్యక్తిగత ఎంపికలో, ఆ ఆదానాల్లో చాలా వరకు అక్కర్లేని ఆదానాలే. ఎందుకంటే తెలుఁగుభాష వాటన్నింటికీ దీటుగా నిలవఁగల శబ్దసంపదను కలిగి ఉంది. మచ్చుకు-

**తెలుగు – సంస్కృతం:**

గుడి – దేవాలయం, వేల్పు – దేవుఁడు, లంకె – సంబంధం, బండి – వాహనం,గరుసు – ఆచారం, లెంక – సైనికుఁడు, దండు – సైన్యం, ఱేఁడు – రాజు, ప్రెగడ – మంత్రి, పడాలు – సేనాపతి, ఆణియం – దేశం, మణివం/ మణియం – అధికారం, పాలెం – స్కంధావారం (కంటోన్మెంట్) మొ॥.

**ప్రతికూల ప్రభావం:**

దురదృష్టవశాత్తు, సంస్కృత ఆదానాలు తెలుగుపై మూఁడు రకాల ప్రతికూల ప్రభావాల్ని చూపాయి:

1. స్థానిక/ అసలైన తెలుఁగు పదజాలాన్ని చంపడం.
2. దాని ఎసవాడకాన్ని సామాజికంగా హీనస్థాయికి దించేయడం.
3. తెలుగువారి సృజనాత్మక ఊహనీ, కనుగోలు (innovative) తత్త్వాన్నీ చంపి, వారిని ఎప్పటికీ పదజాలం కోసం ఇతరుల మీఁదే పూర్తిగా ఆధారపడేలా చేయడం.

(ఈ 3వ ప్రభావం ఇప్పటికీ తీవ్రంగానే ఉంది, ఎందుకంటే ఆధునిక తెలుగువారు తమ మాతృభాషలో క్రొత్త భావనల కోసం క్రొత్త మాటల్ని రూపొందించలేరు. అందుకోసం విదేశీయుల వైపో లేదా సంస్కృత ఋండితుల వైపో చూస్తారు).

**1. స్థానిక/ అసలైన తెలుగు పదజాలాన్ని చంపడం**

సంస్కృత పదాల మీఁద తెలుగువారికి ఉన్న ఎనలేని మక్కువ కారణంగా అసలైన తెలుగు పదాలు అనేకం తిరిగిరాలేని విధంగా అసహజ మరణాన్ని పొంది వాడుకలోంచి మాయమై పోయాయి. మచ్చుకు, స్వచ్ఛమైన తెలుగు పదం 'తెన్ను' – దక్షిణమనే సంస్కృత శబ్దం విఱివిగా వాడుకలోకి వచ్చాక మాయమైంది.

అలాగే ఉత్తరం అనే సంస్కృత మాట వాడుకలోకి రాకముందు తుకాట తెలుగువారు అందుకు ఏ మాటని ఎసవాడారో ఈనాడు ఎక్కువ మందికి తెలియదు. (డాకడ అనేవారు).

**2. అచ్చతెలుగు మాటల ఎసవాడకాన్ని సామాజికంగా హీన స్థాయికి దించేయడం:**

మచ్చుకు, కింది పదాలలో, మొదటిది తెలుగు. హీనంగా లెక్కించ బడుతుంది. రెండోదేమో సంస్కృతం. సంస్కారవంతంగా భావించబడుతుంది.

పెళ్ళాం-భార్య, మొగుడు-భర్త, కొడుకు-కుమారుఁడు(కొందఱు దీన్ని తిట్టుగా కూడా భావిస్తారు),పంతులు-ఉపాధ్యాయుఁడు, దండం-నమస్కారం/ నమస్తే, తిండి-ఆహారం, గొల్ల-యాదవుడు, కంసాలి-విశ్వకర్మ మొదలైనవి. (తెలుఁగుమాటలు ఎంత హీనంగా చూడఁ బడుతున్నాయంటే – ఇప్పుడీ కులనామాల్ని వాటి అసలుపేర్లతో పేర్కొంటే రక్తపాతాలు జరిగిపోతాయి. కనీసం కోర్టుకేసులూ, అరెస్టులూ

తరువాయి 21వ పుటలో....



# నవంబరు 5న విజయవాడలో ఘనంగా జరిగిన సభలో తెలుగు భాషోద్యమ కార్టూనిస్టు 'సరసి'కి 'తాపీధర్మారావు పురస్కారం-2022' ప్రదానం

## 'అమ్మనుడిని అటకెక్కిస్తారా' సరసి కార్టూన్ల పుస్తకం విడుదల

**ఘ**నంగా జరిగిన తాపీ ధర్మారావు పురస్కారోత్సవంలో, జస్టిస్ శేషసాయి నుంచి 2022కు పురస్కారాన్ని ప్రముఖ కార్టూనిస్టు, రచయిత 'సరసి' అందుకున్నారు. "ఏ జాతి అయితే తన భాషను, సంస్కృతిని మర్చిపోతుందో నిర్లక్ష్యం చేస్తుందో అటువంటి జాతికి మనుగడ ఉండదు కాలగర్భంలో కలిసిపోతుందని మహాత్మాగాంధీ ఏనాడో అన్నారు. అందుకే చిన్ననాటి నుంచే చిన్నారులకు భాషపట్ల ప్రేమ చిగురింపజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది, ఆ ప్రేమ పుట్టాలి అంటే వారిని భాషా సమావేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొనేలా ప్రోత్సహించాలి. వారే యువకులైన తర్వాత భాష అవసరాన్ని పదిమందికీ చెప్పి భాషకు సముచిత స్థానం కల్పించడంలో ప్రముఖ పాత్ర వహిస్తార"ని, ముఖ్య అతిథిగా సభలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి అన్నారు.

ఇంకా ఆయన ఇలా అన్నారు:



సమాజ శిల్పాన్ని తన తాపీతో మలచిన మహనీయుడు, ఆనాటి ఎందరో భావి కవులకు మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాత, సమాజ గమనాన్ని తన రచనల ద్వారా ఎంతో ప్రభావితం చేసిన మహనీయుడు తాపీ ధర్మారావు పేరుమీద సామల రమేష్‌బాబు ఆధ్వర్యంలోని 'తాపీ ధర్మారావు వేదిక- ప్రతి ఏటా తెలుగు భాష కోసం కృషి చేసిన జర్నలిస్టులకు అందించడం అభినందనీయమని, అందులో భాగంగా కార్టూన్ జర్నలిస్ట్ అయిన సరసిని ప్రఖ్యాత తాపీ ధర్మారావు పురస్కారంతో గౌరవించడం సముచితమన్నారు. వారి కార్టూన్లు జనాల మెదళ్లను కదిలించేంత శక్తివంతమైనవని జస్టిస్ శేషసాయి వ్యాఖ్యానించారు. తెలుగు భాషకు పడుతున్న గతిని, ఒక భాషా ప్రేమికుడుగా చిత్రకారులు సరస్వతుల రామనర్సింహం (సరసి) వందల వ్యంగ్య చిత్రాలతో ఎండగట్టారన్నారు.

సాధారణంగా ఒక సత్కారం చేయాలంటే ఎవరికీ భయపడాల్సిన పనిలేదు, కానీ ఒక సత్కారం స్వీకరించాలంటే మాత్రం తప్పనిసరిగా భయపడాలి. మెడలో వేసే ప్రతి దండ, కప్పబడే ప్రతి శాలువ, ఇవ్వబడే ప్రతి పురస్కారం కూడా సమాజం పట్ల మన బాధ్యతను ఎప్పుడూ రెట్టింపు చేస్తుంది. సరసి అనే పేరుతో సమాజ సేవకు అంకితమైన తెలుగు తల్లి గోదారి బిడ్డ సరస్వతుల రామనర్సింహం-సరసి వంటి సంస్కారవంతులకు చేసే సత్కారం మాత్రం సమాజానికి ఎప్పుడూ ఉపయోగపడుతుంది. ఎందుకంటే రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారు. అంతేగాక మరో గోదావరి బిడ్డగా తన చేతుల మీదుగా వారిని సత్కరించడం తనకూ గర్వకారణమని శేషసాయి అన్నారు.

సరసి చిత్రాలతో ఉన్న 'అమ్మనుడిని అటకెక్కిస్తారా?' గురించి ప్రస్తావిస్తూ, దానిని అమ్మ సంకలనం అని ప్రస్తుతించారు. సంకలనకారుని ఆవేదన, తెలుగు భాష ఎదుర్కొంటున్న సమస్యలు

ఎత్తిచూపడమేగాక తెలుగు మాతృభాషగాగల మనందరికీ కూడా ఈ సంకలనం ఒక చురకలాంటిదన్నారు.

సరసి కలం నుంచి జాలువారిన వ్యంగ్య చిత్ర సంకలనం లోని కార్టూన్లను గుర్తుచేస్తూ భాషను అటకెక్కిస్తే, సంస్కృతి, సాంప్రదాయాలు కూడా అటకెక్కేస్తాయన్నది వందశాతం వాస్తవం. దానిలోని సూక్ష్మతను గుర్తించి తెలుగు జాతి మేలుకొలుపులాంటి కార్టూన్‌లని అందించిన సరసి అభినందనీయుడని కొనియాడారు. భాషను మరచిపోతే తెలుగు కళలు, కళారూపాలు మనుగడ కోల్పోతాయని అందోళన వ్యక్తం చేశారు. కార్టూన్లు సరదాకు వేసేవి కావని, వాటి శక్తి అపారమని, దానివల్ల ఎంతో మార్పులని దగ్గర నుంచి గమనించానని ఈ సందర్భంలో మరో కార్టూనిస్ట్ బాచి వేసిన కార్టూన్‌తో తన జీవితంలో కలిగిన ఒక అనుభవాన్ని సభికులతో పంచుకున్నారు. తెలుగు సదా వెలగాలని ఆకాంక్షిస్తూ, ప్రతిష్ఠాత్మక పురస్కారానికి సరసిని ఎంపిక చేయడంపై  తాపీ ధర్మారావు వేదిక నిర్వాహకులందరినీ ఆయన అభినందించారు.

**సభాప్రారంభకులు, పుస్తక ఆవిష్కర్త డా॥ మండలి బుద్ధప్రసాద్**



తొలుత శాసనసభ మాజీ ఉపసభాపతి డా॥ మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆయన తన ప్రసంగంలో "ఆనాటి తెలుగువాళ్ళ ఆలోచనా దృక్పథాన్ని కొత్త మలుపు తిప్పిన మహోన్నత రచయిత, పత్రికా సంపాదకులు తాపీ ధర్మారావు'' అన్నారు. ''ప్రత్యేకించి స్వతంత్రంగా ఆలోచించి రచనలు చేయాలి అని చెప్పి, చేసి చూపించిన వ్యక్తి ఆయన. వారు జన్మించింది బరంపురంలో, చదువుకున్నది వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి వద్ద. ఆయనకు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రఖ్యాత కోడి రామ్మూర్తి నాయుడుగారు. వ్యవహారిక భాషా విధానానికి గురువు రామ్మూర్తి  నాంది పలికితే శిష్యుడిగా ధర్మారావు ఆనాడు ఆయనను వ్యతిరేకించారు. కానీ తదనంతరం గురువుగారి అలోచనా విధానమే సరైనదని గుర్తించి గిడుగు వారి వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లి చరిత్రలో చిరస్మరణీయమైన వ్యక్తిగా మిగిలిపోయిన వ్యక్తి తాపీ ధర్మారావు" అని తెలిపారు.

"పత్రికా సంపాదకుడిగా వ్యావహారిక భాషను పత్రికల ద్వారా వ్యాప్తి చేసిన ఘనత దక్కించుకున్న ఆయన ప్రజావాణి, కాగడా వంటి పత్రికలకు సంపాదకత్వం వహించి ఎంతో మందిని పత్రికా రంగంలో తీర్చిదిద్దారు. నార్ల వెంకటేశ్వరరావు వంటి పేరొందిన పత్రికా సంపాదకులు కూడా  ధర్మారావు వద్దే జర్నలిజం పాఠాలు నేర్చుకొన్నారని" బుద్ధప్రసాద్ అన్నారు.

''హేతువాద దృష్టితో ఆయన అనేక రచనలు చేశారు. దేవాలయాల మీద బూతు బొమ్మలు ఎందుకు? పెండ్లి-దాని పుట్టుపూర్వోత్తరాలు వంటి,పరిశోధన రచనలను చేశారు. అనేక అనువాదాలనూ స్వతంత్రమైన దృక్పథంతో రచించారని" గుర్తు చేశారు మాజీ ఉప సభాపతి.

"అభ్యుదయ రచయితల సంఘానికి, పత్రికా రచయితల సంఘానికి కూడా ఆయన అధ్యక్షులుగా పనిచేశారు. ఆ రకంగా వారు జాతికి చేసిన సేవలు అనిర్వచనీయమైనవని, అలాంటి మాహామహుని పేరిట అందజేస్తున్న పురస్కారం ఈనాడు తెలుగుభాషకు కార్టూన్ లోకంలో ప్రత్యేక స్థానమిచ్చిన సరసికి అందించడం ఆనందదాయకమని" బుద్ధప్రసాద్ అన్నారు. తర్వాత ఆయన సరసి గారు సృష్టించిన 200 పైగా కార్టూన్లతో తెలుగుజాతి ట్రస్టు ప్రచురించిన 'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' పుస్తకాన్ని విడుదల చేశారు.



అనంతరం సభాధ్యక్షులు, అమ్మనుడి సంపాదకులు డా సామల రమేష్‌బాబు మాట్లాడుతూ, తన ప్రసంగంలో ఇలా చెప్పారు."అర్థశాస్త్రం రచయిత చాణుక్యుడు ఒక మాట అంటాడు, 'అన్ని శాస్త్రాల్లోకి గొప్ప శాస్త్రం అర్థశాస్త్రం' అని. అంటే అప్పుడు రాజకీయం అనే మాట లేదు. ఆ రోజుల్లో రాజకీయ శాస్త్రం మరియు ఆర్థిక విషయాలు అన్నీ కలిస్తేనే అప్పటి అర్థశాస్త్రం. అంతేగాని ఇప్పుడు మాదిరిగా రాజకీయాలను విడదీసి చూడటం లేదు. అప్పుడున్న స్పష్టత అది. అన్ని శాస్త్రాలలోకల్లా అదే ముఖ్యమైన శాస్త్రం. ఎందుకంటే నిర్ణయం చేయగల శక్తి దానికే ఉంటుంది. ఏ భాషలో అయితే తను పుట్టాడో, ఏ భాషను తాను మాట్లాడుతున్నాడో, ఆ భాషకు ద్రోహం చేసేటటువంటి లేదా ఆ భాషను పట్టించుకోనటువంటి పరిపాలకులు వస్తారని మనం ఊహించామా?" అని అన్నారు.

రమేష్‌బాబు ఇంకా మాట్లాడుతూ, "ఆ రోజుల్లో వాళ్లకు పోటీ లేదు, ఛాలెంజ్ చేసే వాళ్ళు ఎవరూ లేరు కనుక తెలిసింది తెలుగే! మరో భాష సమస్య లేదు. రామ్మూర్తి వాడుక భాషోద్యమం చేసేటప్పుడు కూడా ఆయనకు శత్రువు ఎవరూ లేరు. ఆ రోజుల్లో కవులు  పండితులు వాళ్ల వరకే భాషను వాడుకుంటూ మంచి మంచి కావ్యాలు సృష్టించి రాజుల దగ్గరికి వెళ్లి వారి దగ్గర సత్కారాలు పొందటం వరకే ఆలోచన పరిధి పరిమితమై ఉండేది.  మిగతా వాళ్లంతా రకరకాల వృత్తులు చేసుకుంటూ మౌఖికమైన భాషతోనే బ్రతికే వాళ్ళు గాని, వ్రాసే అవసరం లేదు, కాబట్టి అప్పుడు ఎలాంటి సమస్య ఉత్పన్నం కాలేదు.

కాలక్రమేణా ప్రజలందరికీ చదువు కోవడం అవసరం అని తెలిశాక, తెలుగు ప్రజలందరూ మొట్టమొదటి ఇబ్బంది పడింది వాళ్ళ భాషలో వాళ్ళు రాయలేకపోవడం. ఈ కీలకమైన అంశాన్ని గమనించి గిడుగు రామ్మూర్తి పంతులు ఆంధ్ర సీమలో  భాషోద్యమానికి బీజం వేశారు. పండితులతో పోరాటం చేశారు. వాళ్లకు నచ్చ చెప్పారు. దాదాపు ఆ విషయంలో వాళ్ళ మధ్య చర్చా యుద్ధాలు, సైద్ధాంతిక




యుద్ధాలు జరిగాయి. దాన్నుంచి సాధించవలసింది సాధించి, చివరికి యూనివర్సిటీల్లో కూడా ప్రజల భాషను తీసుకువచ్చేటట్లుగా పోరాడారాయన. ఈ విషయంలో తాపీ ధర్మారావు గారి పాత్ర చాలా కీలకమైనది. కానీ ఎక్కువగా ప్రచారంలోకి రాలేదు. గిడుగు రామ్మూర్తి చనిపోయే ముందు 1940లో మద్రాసులో ఒక ప్రసంగం చేశారు. అదే ఆయన ఆఖరి ప్రసంగం. ఆయన ఉపన్యాసంలో కూడా 'బహుశా ఇదే నా ఆఖరి ప్రసంగం' అని అన్నారు. అదే జరిగింది. అప్పుడు పత్రికా విలేకరులు, పత్రికల సంపాదకులను అందర్నీ పిలిచి వాళ్లందర్నీ ఉద్దేశిస్తూ ఒక పిలుపునిచ్చారు గిడుగు రామ్మూర్తి పంతులు. భాషను రక్షించడం పత్రికల చేతుల్లోనే ఉంది. అవి ఎవరినైనా శాసించగలవు. కనుక మీరు ప్రజల భాషలో వ్రాయాలి. దీనిని ప్రజల్లోకి తీసుకుపోవాలి" అని స్పష్టంగా చెప్పారని" డా. రమేష్‌బాబు గుర్తు చేశారు.

వ్యావహారిక భాషను వాడే విషయంలో గురువుని వ్యతిరేకించిన తాపీ ధర్మారావు, గురువు ఆశించిన ఉన్నతలక్ష్యాన్ని అర్థం చేసుకున్నవారై, తన పద్ధతిని మార్చుకొని, 'పాతపాళీని విసిరేస్తున్నానని, కొత్తపాళీని అందుకుంటున్నానని' ప్రకటించారు. ఆ కొత్తపాళీ అనే పుస్తకం మార్కెట్‌లో దొరుకుతుంది. దానిలో గొప్ప సందేశం ఉంది. ప్రతి పేజీని రెండు మూడు సార్లు చదవాలి. దానిలో కవితలు రెండు మాత్రమే ఇచ్చారు. ఆ కవితలను కూడా చదవాలి. దానిలో మొత్తానికి చెప్పదలుచుకున్నదంతా ఉంది. గిడుగు రామ్మూర్తి చనిపోయే ముందు పెద్ద కొడుకుతో మాట్లాడుతూ, "ఇప్పటివరకు మన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళేవారు ఎవరు వస్తారా? అని అనుకున్నాను, నా వారసుడు తాపీ ధర్మారావు వచ్చేసాడు" అని ప్రకటించారు. అటువంటి సంఘటన చరిత్రలో చోటు చేసుకుంది. అదే ప్రకారం తాపీ ధర్మారావు గురు సందేశాన్ని అందిపుచ్చుకుని తానే పత్రికల ద్వారా, సినిమాల ద్వారా వ్యవహార భాష ప్రచారానికి పూనిక వహించాడు. తన పత్రిక జనవాణిలో జనభాషలో రచనలు మొదలుపెట్టి పత్రికా రంగం మొత్తాన్ని కదిలించిన వ్యక్తి తాపీ ధర్మారావు అని అన్నారు డా. రమేష్‌బాబు.

ఈ పురస్కారాన్ని ఇవ్వడానికి దారి తీసిన కారణాలను గురించి ఇలా ఆయన వివరించారు. "నడుస్తున్న చరిత్ర పేరుతో పత్రిక నడిచే రోజుల్లో సాహితీవేత్త కత్తి పద్మారావు ఒక వ్యాసంలో తాపీధర్మారావు పేరు ఉటంకిస్తూ, వారికి రావలసిన ఖ్యాతి రాలేదని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన మరో సాహితీవేత్త, పాత్రికేయులు డా॥ నాగసూరి వేణుగోపాల్ వరుసగా దానిపై రెండు వ్యాసాలు రాశారు. అప్పటిదాకా ధర్మారావు గురించి పెద్దగా తెలియని నేను, తెలిసిన తర్వాత ఆలోచనలో పడ్డాను. గిడుగు సందేశం గురించి అనేకసార్లు ప్రస్తావించామేగానీ వారి సందేశాన్ని అందిపుచ్చుకుని ఆ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి, ఆచరణలోకి తీసుకువచ్చిన వ్యక్తిని మరిచిపోయామని అనిపించి,ఆయన గురించి పూర్తిగా అధ్యయనం చేశాను. దాని ఫలితంగానే ఈ అవార్డు స్థాపనకు నేను చొరవతీసుకోవడం జరిగింది. నాగసూరి వేణుగోపాల్ ప్రతిపాదన మీద తాపీ పుట్టినరోజును 'తెలుగు జనమాధ్యమాల దినోత్సవం' గా ప్రకటించడం జరిగింది. ఇదీ ఈ పురస్కారం వెనుక ఉన్న చరిత్ర" అన్నారు రమేష్ బాబు.

సరసికి తాపీ ధర్మారావు పురస్కార కార్యక్రమ సందర్భంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య మొదటి అధ్యక్షులు సి ధర్మారావుని గుర్తు చేసుకోవలసిందే! ఎందుకంటే వారే, సరసిని పత్రికకు పరిచయం చేశారు. బుద్ధప్రసాద్ వంటి వారి సహకారంతో మొట్టమొదటి అవార్డును డా.నాగసూరి వేణుగోపాల్‌కి, అనంతరం మరి 9 మంది పత్రికా సంపాదకులకు రచయితలకు ఈ అవార్డుని ఇవ్వడం జరిగింది. దీంతో ఈ అవార్డుకు అనుకోని గుర్తింపు వచ్చింది. అయితే తొలిసారి కార్టూన్ జర్నలిస్ట్ కి ఈ అవార్డు ఇవ్వడం పై కొందరు పెదవి విరిచారు. కానీ తెలుగు భాషా సేవలో సరసి పాత్ర తూచలేనిది అన్నది నిర్వివాదాంశం. ఇప్పటి వరకూ కేవలం తెలుగు భాషమీద సుమారు 300 కార్టూన్లను గీసిన వ్యక్తి సరసి మాత్రమే!. మరొక విషయం ఏమిటంటే, కార్టూన్ అనేది పామరులను పండితులను ఏకకాలంలో కదిలించే శక్తి కలిగి ఉందనడంలో సందేహం లేదు. అందుకే కార్టూన్ జర్నలిస్ట్ సరసిని తాపీ ధర్మారావు పురస్కారం -2022 కి ఎంపిక చేయడం జరిగిందని రమేష్‌బాబు సభకు వివరించారు. సరసిని ఈ అవార్డుకు ఎంపిక చేసిన అనంతరం అనేక మంది మిత్రులు మంచి నిర్ణయం అనడం సంతోషాన్నిచ్చింది. వారి కార్టూన్లను పుస్తకంగా తేవాలని అనుకుని తెలుగుజాతి ట్రస్టు ద్వారా అందమైన పుస్తకంగా మీ ముందుకు తీసుకొచ్చాం అన్నారు రమేష్‌బాబు.

బుద్ధప్రసాద్ గారి గురించి మాట్లాడుతూ, ఆయన తెలుగు భాషోద్యమానికి అండ అన్నారు. బుద్ధప్రసాద్ ఉద్యమంలో లేకపోతే 2002లో శ్రీకాకుళంలో రెండు రోజులు శిబిరం జరిగేది కాదని, దీనికి పూనుకొన్నది ప్రసాద్ గారే అని చెప్పడానికి ఆనందంగా ఉంది అని కొనియాడారు.

ఉద్యమంలో నా చేయి పట్టుకుని నడిపించిన కీ.శే. సి.ధర్మారావు గారు 'ఒక లక్ష్యం కోసం మనం పనిచేస్తున్నప్పుడు, ఏదైనా విభేదాలు వస్తే వ్యక్తుల్ని ద్వేషించకూడదు. మనుషులుగా మనం అందర్నీ ప్రేమించాలి' అని ఆయన వద్ద నేను నేర్చుకున్నటువంటి విషయం అన్నారు.

మీ అందరికీ తెలుసు... ఈ మధ్య డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు గారిని, సమాఖ్యకి అధ్యక్షులుగా ఎన్నుకున్నాం. కారణం ఇవాళ తరం మారింది, అవసరాలు మారుతున్నాయి. ఉద్యమం యొక్క అవసరాలు కూడా మారుతున్నాయి. దేశ స్థాయిలో కూడా ఉమామహేశ్వరరావు భారతీయ భాషా శాస్త్రజ్ఞుల యొక్క అఖిల భారత సంఘానికి అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఒక భాషా శాస్త్రజ్ఞుడు మన తెలుగు భాషోద్యమ సమాఖ్యకు అధ్యక్షులుగా ఉండటం ఆనందించదగ్గ విషయం అని సామల రమేష్‌బాబు అన్నారు.

**పురస్కార ప్రదానం:**

అనంతరం పురస్కార గ్రహీత శ్రీ సరసి గారినీ వారి అర్థాంగి శ్రీమతి రత్నం గారినీ వేదిక పైకి ఆహ్వానించారు. మన్నన పత్రాన్ని



తెలుగుజాతి ట్రస్టీ డా.వెన్నిసెట్టి సింగారావు గంభీర స్వరంతో చదివి వినిపించారు. పెద్దలందరూ నిలబడి ఉండగా ముఖ్య అతిథి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఆ దంపతులను శాలువాతో సత్కరించి మన్నన పత్రాన్నీ, పురస్కార పత్రాన్నీ, లాంఛనంగా ఒక చెక్కునూ అందరి తోడ్పాటుతో, సభికులందరీ కరతాళ ధ్వనుల మధ్య వారికి అందజేశారు.

ఆ వెంటనే ప్రత్యేకంగా ఈ సభకు విచ్చేసిన 20మంది కార్టూనిష్టు మిత్రులంతా ఎంతో ఉత్సాహంతో సరసి గారిని సన్మానించారు.

తరువాత ప్రసంగించిన ఆత్మీయ అతిథి శ్రీ బాచి (అన్నం శ్రీధర్) ప్రసంగాన్ని తరువాతి పుటలలో చూడండి.

**ఆత్మీయ అతిథి ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం**



"యువతను నిద్ర లేపాలి, యువత ఏ పనైనా చేస్తుంది. వారిని సరైన మార్గంలో నడిపి తెలుగు ఉద్యమానికి అందించగల శక్తి మన దగ్గర ఉంది. వారు ఇలాంటి భాషా సంబంధమైన కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించాలి అని తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, డా. గారపాటి ఉమామహేశ్వరరావు అన్నారు. "వార్తాపత్రికను చదివే ఓపిక కూడా నేటి యువతకి ఉండటం లేదని, అలాంటి యువతని భాషోద్యమం వైపు నడిపించడానికి కార్టూన్ మంచి పాత్ర పోషిస్తుందని, అలాంటి ఆలోచించదగ్గ కార్టూన్లను భాషపై అందించిన సరసి లాంటి వారికి తాపీ ధర్మారావు పురస్కారం అందించడం ఆనందదాయకమన్నారు.

ఎంత ఉత్తేజితమైన వ్యాసం రాసినా దానిని చదివి అర్థం చేసుకునే స్థితిలోలేని వారిని సరసి కార్టూన్ ఒక్క నిమిషంలో ఆలోచింపజేస్తుందనడంలో సందేహంలేదన్నారు. నేడు విడుదల చేసిన సరసి కార్టూన్‌ల సంకలనాన్ని ఆంగ్లంలోకి , ఇతర భాషలలోకి అనువదించి, తెలుగు భాషకోసం, తెలుగు వారు ఎంత కృషి చేస్తున్నారో ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతి సంవత్సరం భారతదేశంలో మూడున్నర కోట్ల మంది గ్రాడ్యుయేట్లు తయారవుతున్నారని, వాళ్ళందరూ ఇంగ్లీషులోనే చదువుకుంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితులున్నాయా? అందరూ అమెరికా వంటి విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకుంటారా అంటే సమాధానం శూన్యమే! కనుక విద్యాబోధనంతా అంగ్లంలో జరిగినంత మాత్రాన అందరికీ ఉద్యోగాలు రావు అన్నదాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి" అని డా. ఉమామహేశ్వరరావు అన్నారు.

తరువాత సన్మానితులు శ్రీ సరసి, తన స్పందనను, కృతజ్ఞతలను తెలుపుతూ ప్రసంగించారు. వారి ప్రసంగాన్ని వారి మాటల్లోనే తరువాతి పుటలలో దయచేసి చూడండి.

'తెలుగుజాతి (ట్రస్టు)' కార్యదర్శి డా.సామల లక్ష్మణబాబు, ట్రస్టీ శ్రీమతి డి.పి.అనురాధ అతిథులకు జ్ఞాపికలను అందచేశారు.





సభాధ్యక్షుల తుది పలుకుల తర్వాత తెలుగుజాతి(ట్రస్టు) తరపున శ్రీ యర్రంశెట్టి హనుమంతరావు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమ ప్రారంభానికి ముందు తేనేటి విందును ఏర్పాటు చేయడంతోపాటు అన్ని కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించిన తాపీధర్మారావు వేదిక బాధ్యుడు, తెలుగు భాషోద్యమంలో తొలినుండీ భాగస్వామిగా ఉంటున్న ప్రముఖ ఫొటోగ్రాఫర్ డా. తమ్మా శ్రీనివాసరెడ్డి సభాసందర్భాన్ని వివరించి అందరికీ స్వాగతం పలికారు. అతిథులను వేదికపైకి ఆత్మీయంగా స్వాగతించారు. వారిని



ట్రస్టు కార్యదర్శి డా.సామల లక్ష్మణబాబు, ట్రస్టీ శ్రీమతి డి.పి.అనురాధ, రచయిత కొంపల్లి సుందర్, రైతు ఉద్యమనేత శ్రీ భవానీప్రసాద్, ప్రముఖ జర్నలిస్టు శ్రీ వల్లీశ్వర్, ఫొటోగ్రాఫర్ శ్రీ గోపాలరెడ్డి, అతిథులను సత్కరించారు.

తాపీధర్మారావు పురస్కారాన్ని స్థాపించిన వెంటనే జరిగిన తొలిపురస్కార కార్యక్రమం 2009లో విజయవాడలో జరిగింది. తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతిలలో తక్కిన 9 కార్యక్రమాలు జరిగాయి. విజయవాడలో జరిగింది 11వ పురస్కార కార్యక్రమం.

–'కళ్యాణకృష్ణ'

## ఆత్మీయ అతిథి, అన్నం శ్రీధర్ ప్రసంగం



అందరికీ నమస్కారం నేను కూడా ఈ రోజు మీతోపాటు సభలో కూర్చోవాల్సింది. ఈ రోజు యిక్కడ ఆత్మీయ అతిథిగా వేదికపై కూర్చున్నాను. సరసి గారు నాకు ఫోన్ చేసి నాకు తాపీధర్మారావు గారి పురస్కారం నవంబరు 5న విజయవాడలో ప్రదానం చేస్తున్నారని చెప్పారు. నేను సంతోషించి అభినందించడమే కాకుండా ఓ ఉచిత సలహా పడేశాను. అదేమిటంటే సన్మాన కార్యక్రమాలలో సాధారణంగా సన్మానం పొందే వ్యక్తి గురించి వేదిక మీద ఇంకోవ్యక్తి కొన్ని విషయాలు చెబుతారు. కానీ వారు చెప్పే మాటలకూ సన్మానం పొందే వ్యక్తి వృత్తికి, ప్రవృత్తికీ ఎటువంటి సంబంధం ఉండదు. కనుక నీ గురించి బాగా తెలిసిన వ్యక్తి చేత చెప్పిస్తే ఆ సభకు నీకు కూడా అందమొస్తుందని చెప్పాను. ఆ మాట చెప్పగానే సరసి గారు ఏదోసామెత చెప్పినట్లు 'ఆ పని నువ్వే ఎందుకు చేయకూడదు...' అనడమే కాకుండా అమ్మనుడి సంపాదకులు రమేష్‌బాబు గారితో చెప్పారు. రమేష్‌బాబు గారు నాకు ఫోన్ చేసి 'మీరు రేపు జరగబోయే సభకు 'ఆత్మీయ అతిథి' గా వస్తున్నారు' అని ఖరాకండిగా చెప్పేశారు. అంతేకాకుండా మీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎ.వి.శేషసాయి గారు ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఇద్దరూ(సన్మానం అందుకునే సరసి, ముఖ్య అతిథి సాయిగారు) నా చిరకాల మిత్రులు, 40 వసంతాల సాంగత్యం కాబట్టి సంతోషంగా ఒప్పేసుకున్నా.

ముందుగా మీకు జస్టిస్ సాయిగారి గురించి రెండు మాటలు చెబుతాను. వారి నిబద్ధత గురించి చెప్పాలి. వారు ఆ రోజుల్లో ఎలా వున్నారో, ప్రాక్టీసు రోజుల్లో ఎలా వుండేవారో ఇప్పుడు ఓ న్యాయమూర్తిగా కూడా అదే నిబద్ధతతో వున్నారు. ఆయన కోర్టును నిర్వహించే విధానం చూస్తే ఎంతో గొప్పగా వుంటుంది. ఉదయం 10.30 గంటలకు ఎలా వుంటారో 4.30 గంటలకు కూడా అదే ఎనర్జీతో హాస్య చలోక్తులతో హుందాగా కోర్టు నిర్వహిస్తారు. మేము (కార్టూనిస్టులం) బొమ్మలు గీయడం వచ్చిన కార్టూనిస్టులమైతే సాయిగారు బొమ్మలురాని కార్టూనిస్టు. దీనికి తోడు వారికి అపారమైన జ్ఞానం న్యాయశాస్త్రంలో వున్నది. దానికై నిరంతరం వారు చేసే కృషి అనిర్వచనీయం. అంతే కాకుండా వారి జ్ఞాపకశక్తి అద్వితీయం. ముప్పయ్ నలభై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటనలు కూడా గుర్తుపెట్టుకుంటారు. దీనితో పాటు వారికి తెలుగు భాష మీద పట్టు ఎంతో యిప్పుడే వారి ప్రసంగం మీరు విన్నారు కదా! అలాగే వారు అష్టావధానం శతావధానం కూడా చేయగలరు. మేము ప్రాక్టీసులో వున్న రోజుల్లో నేను అప్పుడప్పుడూ సివిల్ కేసుల్లో వారి దగ్గరకు సలహాల కోసం వెళ్ళినప్పుడు వారు క్లయింట్స్‌తో మాట్లాడుతూ చాలా బిజీగా వుండేవారు. మధ్యలో క్లయిట్స్‌తో మాట్లాడుతూ, ఫోన్స్ అందుకుంటూ కూడా ఎక్కడా క్రమం తప్పకుండా డిక్టేషన్ చెప్పేవారు. అంతటి గొప్ప వ్యక్తి నాకు మిత్రులవడమే కాకుండా ఆంధ్రరాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా వుండటం నిజంగా మన అదృష్టం. వెరసి సాయిగారు సాహిత్యాభిలాషి, భాషాభిమాని, హాస్యప్రియులు, న్యాయశాస్త్ర కోవిదులు.

ఇక మా సరసిగారు. పురుషులందు పుణ్యపురుషులు వేరయా. కార్టూనిస్టుందు సరసి కార్టూనిస్టు వేరయా. ఈ సభలో దాదాపు ఓ ఇరవై మంది కార్టూనిస్టులం వున్నాం. ఇప్పటికి మేము సుమారు 30 వేలకిపైగా కార్టూన్లు గీసి వుంటాము. కానీ అన్ని వేల కార్టూన్లలో పట్టుమని పాతిక కార్టూన్లు పాఠకులకు గుర్తుండిపోయే కార్టూన్లు వుంటాయి. కానీ సరసిగారు ఈ నలభై సంవత్సరాలలో పట్టుమని పదివేల కార్టూన్లు మాత్రమే గీశారు. కానీ ఆ పదివేల కార్టూన్లలో 90 శాతం కార్టూన్లు పాఠకుల గుండెల్లో పదిలంగా నాటుకుపోయాయి. దీనికి కారణం సరసిగారి కార్టూన్ కథా వస్తువుగా 'మధ్యతరగతి జీవుల'నాడిని పట్టుకోవడమే. ఇంతేకాకుండా వారు ఒక కార్టూను గీయదలిస్తే దాన్ని కులంకషంగా ఆలోచించి కార్టూన్లు గీస్తారు. ఎక్కడా కూడా ఆంగ్ల పదాలు దొర్లకుండా అచ్చ తెలుగు సంభాషణలతో అలరిస్తారు. అందుకే ఆయన 'అచ్చ తెలుగు కార్టూనిస్టు' అయితే మేమందరం మోడ్రన్ కార్టూనిస్టులుగా వుండిపోయాము. ఆయన ఏ కార్టూన్ గీసినా అది మన మీదే గీశాడా అని పాఠకుడు అనుకునేంతగా వుంటుందంటే, వారి సమాజ నిశిత పరిశీలనే దానికి కారణం. వారి బొమ్మలు కూడా అలరిస్తాయి. వారిలో ఉన్న ఇంకో గొప్పతనమేమిటంటే వారు కొన్ని సబ్జెక్టులు తీసుకుని వందలాది కార్టూన్లు గీశారు. అది మా ఇతర కార్టూనిస్టులకు తలకుమించిన పనే. వారు తెలుగు భాషమీద మమకారంతో 300 పైగా కార్టూన్లు గీశారంటే వారి ప్రతిభకు తర్కాణం. అదేవిధంగా రైలు ప్రయాణాల మీద, సంగీతం పైన (క్లాసికల్ మ్యూజిక్), అపార్టుమెంట్ల జీవనం పైన, పెళ్ళిళ్ళు, యాత్రలు మీద మధ్యతరగతి జీవితాలను కథా వస్తువుగా తీసుకొని గీసిన కార్టూన్లు మరే కార్టూనిస్టు గీయలేదంటే ఆయనకు 'కార్టూను' మీద వున్న ప్రేమ, పట్టు తెలుస్తుంది. అందుకే మా కార్టూనిస్టులు ఏమంటారంటే 'బాపు గారి తర్వాత అచ్చ తెలుగు కార్టూన్లు గీసింది మన సరసిగారే' అని.

ముఖ్యంగా సరసి గారు ఏ కార్టూను గీయకూడదో బాగా తెలిసిన వ్యక్తి. సమాజ హితం కోసం చాలా కార్టూన్లు గీసిన సామాజిక కార్టూనిస్టు. అందుకే ఆయన కూర్టున్ల రంగంలో మహోన్నతంగా వెలుగుతున్న మహా కర్టూనిస్టు. ఆయనకు ఈ ఆంధ్రదేశంలో రాని అవార్డులంటూ లేవు 'బాపు రమణ పురస్కారంతో'పాటు యిప్పుడు తాపీ ధర్మారావు పురస్కారం-2022 సరసి గారిని వరించిందంటే మాకు ఆశ్చర్యంలేదు. వారికి మరొక్కసారి అభినందనలు తెలియజేస్తూ శలవ్!!

## పురస్కార గ్రహీత 'సరసి' ప్రసంగం

అందరికీ నమస్కారం. ఆనందకరమైన విషయం ఏమిటంటే జస్టిస్ శేషసాయి గారు ఈ రోజు రావడం, వారి పక్కన కుర్చోవడం, వారి చేతులమీదుగా ఆవార్డు అందుకోవడం. అలాగే నా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన మండలి బుద్ధప్రసాద్ గారు తెలుగు భాషోద్యమంలో ఎంతో సేవ చేశారు. నా ఈ పుస్తకాన్ని వెలుగులోకి తేవడానికి పూర్తిగా తోడ్పాటునందించిన ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు. వీరందరికీ నా ధన్యవాదాలు.

హైదరాబాదులో ట్యాంకుబండుమీద ఒకప్పుడు ఒక బోర్డు



ఉండేది. సేల్ ఆఫ్ ఈటబుల్స్ ప్రొహిబిటెడ్ హియర్' అని. అక్కడ అమ్మేదెవరండీ? మరమరాలు, శనక్కాయలూ, అమ్ముకునేవారు. వారికి అర్థం అవుతుందా ఆ బోర్డు? మన విజయవాడ పెద్దబస్‌స్టాండ్‌లో 'సబ్‌వే నుండి ఎరైవల్సుకు దారి' 'ఎరైవల్సు'. తెల్లారి లేస్తే బస్టాండ్ నిండా తిరిగేది తట్టలూ బుట్టలూ పట్టుకొని రైతులు, కార్మికులు. వాళ్లకి అర్థం కావాలికదా! ఎవర్ని ఉద్దరించడానికి ఈ బోర్డులు! అధికారులకి ఆ మాత్రం జ్ఞానం ఉండక్కర్లేదా?

'తెలుగు భాషోద్యమ సమాఖ్య' అని... దాని ద్వారా గత పాతిక ముప్పయి సంవత్సరాలుగా సామల రమేష్‌బాబు గారి నేతృత్వంలో తెలుగుభాష, మాతృభాషకి జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తున్నాం. దాన్లో మేమందరం సభ్యులం.

తెలుగు మాట్లాడుతున్నాం కదా? దానికొచ్చిన నష్టం ఏమిటి అని కొందరంటున్నారు. ఇప్పుడు మనం వార్తా పత్రికలు చదువుతున్నాం. భవిష్యత్తులో అవి చదివేవారు కూడా ఉండరు. ఇప్పుడు స్కూళ్లలో ఇంగ్లీషు మీడియం పెట్టేశారు. మేము ఇంగ్లీషుకి వ్యతిరేకం కాదు. ఉద్యోగాల కోసం ఇంగ్లీషు నేర్పండి. అయితే అత్తగారిని ఇంట్లోకి తెచ్చుకోడానికి తల్లిని ఇంట్లోంచి తరిమెయ్యక్కర్లేదు. తెలుగును ఒక మాధ్యమంగా కొనసాగించండి. ఒక సబ్జెక్టుగా కాదు.

పిల్లలకి ఎన్ని భాషలు నేర్పినా చక్కగా నేర్చుకొంటారు. జర్మనీలో ఉన్న మన తెలుగుపిల్లలు 4 భాషలు మాట్లాడుతున్నారు. ఇంగ్లీషు కోసం ఏళ్ల చరిత్ర కలిగిన మన తెలుగు మహా వృక్షాన్ని నరికెయ్యక్కర్లేదు. భాషాద్రోహం చెయ్యక్కర్లేదు.

ఈ కార్టూను పుస్తకం - గతంలో నేను తెచ్చిన కార్టూను పుస్తకాల కంటే భిన్నమైనది. కేవలం నవ్వుకోవడం కోసం కాదు. ఒక సందేశం ఉంది ప్రతి కార్టూను వెనక. తెలుగు భాషకి జరుగుతున్న అన్యాయానికి కడుపుమండి, ఆవేదనతో వేసిన కార్టూన్లు ఇవి. ప్రభుత్వాలనే కాదు, నిర్లక్ష్యం చేస్తున్న మన ప్రజలమీద కూడా కార్టూన్లు వేశా. ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాల సంగతి సరే.. ఇంట్లో మన పిల్లలకి తెలుగు నేర్పుదాం. భాషతో బాటు జాతిని కాపాడుకుందాం.

మరో ముఖ్యవిషయం చెప్పాలి. మూడు దశాబ్దాలుగా ఎన్నో కష్టనష్టాలకు వోర్చి, అనేక ఇబ్బందులకు గురి అవుతూ, ప్రభుత్వ ప్రోత్సాహం ఏమాత్రం లేకపోయినా- ఏనాడో గిడుగు రామ్మూర్తి గారు, తాపీ ధర్మారావుగారు వేసిన బాటలో నా తెలుగు అంటూ పాకులాడుతూ పత్రిక నడుపుతూ ఉద్యమం చేస్తున్న రమేష్‌బాబు గారికి దేశంలో భాషకి సంబంధించి అత్యున్నత పురస్కారం ఏది ఉన్నా అది వారికి ఇవ్వాలి. నిజాయితీగా భాషాసేవ చేస్తున్న మహనీయుడాయన. ఆయనకి నా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

తాపీధర్మారావు గారి పేరిట అత్యున్నత పురస్కారాన్ని నాకు ఇచ్చిన కమిటీ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను మరోసారి.

తెలుగు భాషమీద ప్రేమ పెంచుకోండి. అన్ని ప్రశ్నలకు మీకు సమాధానం దొరుకుతుంది.

అలాగే భారత సర్వోన్నత న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ఈ పుస్తకాన్ని అభినందించారు. వారికి కూడా ధన్యవాదాలు. అందరికీ మరోసారి నమస్కారాలు, ధన్యవాదాలు.

-సరసి

---

15వ పుట తరువాయి...

## తెలుఁగు సంస్కృతంలోంచి...

సంప్రాప్తమవుతాయి).

**పూర్వీకులు ఎందుకిలా చేసారు?**

రెండు కారణాల వల్ల ఈ ఆదాన (borrowing) కార్యక్రమం అడ్డూ ఆఁపూ లేకుండా శతాబ్దాల తరబడి కొనసాగింది: ఒకటి- పురాతన కాలంలో బహు కొద్దిమందిగానే ఉండిన అక్షరాస్యులూ పండితులూ సంస్కృతాన్ని పవిత్రమైన, ప్రతిష్ఠాత్మక భాషగా భావించేవారు. ఆ భాషాపదాలను ఏసవాడఁగల తమ సామర్థ్యానికి చాలా పొంగిపోయేవారు.

రెండవది - తుకాట కాలంలో చాలామంది తెలుఁగు కవులు - అందుబాటులో ఉన్న తెలుఁగు పదజాలం రచనాపరమైన అవసరాలను తీర్చడానికి సరిపోదని తలఁచారు. ఎందుకంటే ఛందస్సులో తెలుగు కవిత్వం వ్రాయాలంటే గళ్ళనుడికట్టు (క్రాస్‌వర్డ్ పజిల్) ని పరిష్కరించడం లాంటి నేర్పు అవసరం. దాని సంక్లిష్ట నియమాలు అలాంటివి. అంతే కాక ఛందోబద్ధ పద్యాలలో మిగిలిపోయిన ఖాళీలని పూరించేడం కోసం కూడా చాలా అనవసరమైన పదాలు సంస్కృతం నుండి టోకున తెలుఁగులోకి దిగవేయఁబడ్డాయి (dumping).

సంస్కృత పదాలను తెలుగు పదాలతో సమాసించడం కుదరదు కాబట్టి మతికొన్ని సంస్కృత పదాలు సమాసాల గుండా తెలుగులోకి చొఁబడ్డాయి. ఇదంతా కూడా తెలుగేదో సంస్కృతానికి నిజమైన కన్నబిడ్డ అయ్యుంటుందని మంది భ్రమపడ్డానికి దారితీసింది. అ

---

### గీటురాళ్లు... రాత-రోత

చదివిన విన్నా జనుల కందరికి చక్కగ తెలిసితే రాతా,
మెదడు చించుకొని నిఘంటులన్నీ వెదికించిందే రోతా.

వాడుకమాటల వలెనే భావాల్ ప్రకటించిందే రాతా,
పాడుముష్టితో పెద్దసమాసాల్ వాడిందైతే రోతా.

చిన్నమాటలనె గొప్ప భావములు చెప్పగలిగితే రాతా,
మిన్ను విరిగినటు ధ్వనించి భావం సున్న చుట్టితే రోతా.

అష్టకష్టములు అనుభవించు కవి అవేదనయే రాతా,
ఇష్టభోగములు ఊగాడుచు పళ్ళికిలించిందే రోతా.

-తాపీ ధర్మారావు ('కొత్తపాళీ' నుండి..)



తాపీ ధర్మారావు

# తాపీ ధర్మారావు పురస్కారం - 2022

## మన్నన



సరస్వతుల రామనరసింహం(సరసి)

తొలుత 'నడుస్తున్న చరిత్ర' పత్రికలో, తర్వాత 'అమ్మనుడి' పత్రికలో– ఇప్పటికి 25 ఏళ్లుగా ప్రతినెలా తెలుగు నేలపై ప్రభుత్వాల్లో, ప్రజల్లో చోటుచేసుకొంటున్న భాషాసంక్షోభంపై వందలాది కార్టూన్లను చిత్రించిన 'సరసి', ఒక ప్రత్యేకమైన కార్టూనిస్టు. కేవలం పకపకలకోసంగాక సామాజిక ప్రయోజనాన్ని కూడా కలిగించేవిగా ఆయన కార్టూన్లుంటాయి. అవన్నీ తెలుగు భాషోద్యమకారుల్లో, ప్రజల్లో ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఆ విధంగా ఉద్యమంలో ఆయన భాగస్వామి అయ్యారు.

రైలు, బస్సు, విమాన ప్రయాణాలలో ఇబ్బందులు, అపార్టుమెంటు జీవితాల్లో అసౌకర్యాలు, పెళ్ళిళ్ళలో చమత్కారాలు, మూఢ నమ్మకాలు, వ్యక్తుల బలహీనతలు, విపరీత భావాలు, స్వార్థాల వంటి గుణాలను తన కార్టూన్లలో ఎత్తిచూపారు. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాలలో భార్యాభర్తల సరసం, కోపతాపాలు, ఈతి బాధలు, పిల్లల పెంపకం వంటి వాటికి సున్నితమైన వ్యంగ్యం జోడించి ప్రతిరోజూ వీరు వెలువరిస్తున్న కార్టూన్ల కోసం పాఠకులు ఆత్రుతగా ఎదురు చూస్తూ ఉండటం వీరి ప్రతిభకు నిదర్శనం.

భాష, కుటుంబం, సామాజిక అంశాలు పైనే కాదు. శాస్త్రీయ సంగీతం గురించి 'సరసి' వేసినన్ని కార్టూన్లు వేరే కార్టూనిస్టు లెవరూ వెయ్యలేదు. ప్రఖ్యాత చిత్రకారులు కీ.శే. బాపు పలుసందర్భాలలో తనకి ఇష్టమైన కార్టూనిస్టు 'సరసి' అని చెప్పేవారంటే అంతకంటే ఘనమైన ప్రశంస మరొకటి ఏముంటుంది?

వీరు చిత్రించిన నిలువెత్తు అంబేడ్కర్ తైలవర్ణ చిత్రాన్ని ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, కాసు బ్రహ్మానందరెడ్డి తైలవర్ణ చిత్రాన్ని అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి, పొట్టి శ్రీరాములు తైలవర్ణ చిత్రాన్ని సభాపతి దుద్దిళ్ళ శ్రీపాదరావు శాసన సభ సమావేశమందిరంలో ఆవిష్కరించి 'సరసి'ని సత్కరించారు.

వేలాది కార్టూన్లతో ప్రసిద్ధుడైన 'సరసి' వందల్లో కథల్ని కూడా రచించారు. అవి కూడా ఆయన కార్టూన్ల వలెనే సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశించినవే! కొన్ని రేడియో నాటికల్ని కూడా రాశారు.

హైదరాబాదులోని ప్రతిష్ఠాత్మక 'బాలానందం' సంస్థ ట్రస్టు బోర్డు సభ్యుడిగా ఉంటూ, అక్కడ ప్రతి ఏటా బాలలకు చిత్రలేఖనంలో పోటీలు నిర్వహిస్తూ, మెలకువలు నేర్పిస్తున్నారు. హైదరాబాదు ఆనందబాగ్‌లో 'సద్గురు శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవ సమితి' సంస్థ ద్వారా 25 ఏళ్లుగా పలువురు సీనియర్ కళాకారులచే శాస్త్రీయ సంగీత కచేరీలు నిర్వహిస్తున్న ఘనత 'సరసి' గారిదే.

ఆయన ఎన్నో సన్మానాలు, పురస్కారాలు, అవార్డులు పొందారు. ఇప్పటికే పది కార్టూన్ల సంకలనాలను వెలువరించారు. 'సరసి' గారు తత్వ శాస్త్రంలో ఎం.ఏ., న్యాయశాస్త్రంలో ఎల్.ఎల్.బి. చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ సహాయ కార్యదర్శి(గెజిటెడ్)గా పనిచేశారు.

'సరసి' అనే కలంపేరుతో అందరి ప్రేమాభిమానాలు పొందుతున్న సరస్వతుల రామనరసింహం గారు, తన పేరుకు తగ్గట్టు సరస్వతీ పుత్రుడే. అన్ని సాహిత్య, కళారంగాల్లోనూ, ప్రజల తెలుగుకు పట్టంకట్టడంలో అందరికీ ఆదర్శంగా నిలిచిన తాపీధర్మారావు గారి పేరిట ఇస్తున్న 'తాపీధర్మారావు పురస్కారాన్ని' 2022కు గాను 'సరసి'గారికి అందించేందుకు తాపీధర్మారావు వేదిక నిశ్చయించింది. ఈ పురస్కారాన్ని ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి గౌరవనీయులు జస్టిస్ ఎ.వి.శేషసాయి గారి చేతులమీదుగా అందించడానికి ఎంతో సంతోషిస్తున్నాము.

'సరసి' గారూ, దయతో ఈ పురస్కారాన్ని స్వీకరించండి.

తాపీ ధర్మారావు వేదిక,
తెలుగుజాతి (ట్రస్ట్)
98480 16136
విజయవాడ.

వేదిక: హోటల్ ఐలాపురం
గాంధీనగర్ – విజయవాడ
05 నవంబరు 2022.

యం. రాజకృష్ణ
9949695231

# తెలుగు, కన్నడ దినపత్రికలపై ఆంగ్లభాషా ప్రభావం

**భా**షాభివృద్ధిలో దినపత్రికలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రజలకు సమాచారాన్ని వేగంగా చేరవేస్తూ సమాజంలో అతిశక్తివంతమైన వ్యవస్థగా రూపుదిద్దుకున్నాయి. ఇటువంటి దినపత్రికలే భాషకు పట్టుగొమ్మలు. భాష ఎప్పుడూ నిత్యనూతనమైనది. వ్యవహారంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తనలో కలుపుకొంటూ,భావితరాలకు భాషను అందించటంలో దినపత్రికలు అమితంగా కృషిచేస్తున్నాయి.భాషాభివృద్ధికి,సంస్కృతి,సంప్రదాయాలకు మరియు మూఢాచార నిర్మూలనకు దినపత్రికలు ఎంతగానోదోహదంచేస్తాయి.

మొదటిసారిగా క్రీ.శ. 16వ శతాబ్దంలో దినపత్రిక అనేది పురుడుపోసుకొన్నది. అప్పటి రాజకీయ, ఆర్థిక సంబంధమైన వార్తలలో న్యూస్బుక్ గాను, తరవాత న్యూస్లెటర్సాను వెలువడింది. 1560 ప్రాంతంలో జర్మనీ, స్విస్ దేశాలలో మొదలై, 1618 నాటి ఇంగ్లీష్, ఫ్రెంచ్ మరియు డచ్ భాషలలో వారం వారం వార్తాపత్రికలు రూపొందాయి. తర్వాత 1702లో ఇంగ్లాండులో తొలి దినపత్రిక 'ది డెయిరీ కోరాంటో' వచ్చింది. ఆ తరవాతనే భారతదేశంలో తొలి పత్రిక 1780లో కలకత్తాలో 'బెంగాల్ గెజిట్' ప్రారంభమైంది. దీని రూపకర్త జె.ఎ. హక్కీ కాబట్టి దీనికి 'హక్కీ గెజిట్' అని కూడా అంటారు. బెంగాల్ గెజిట్ తర్వాత భారతదేశంలో ఇతర ప్రాంతీయ భాషలలో కూడా పత్రికలు వెలువడ్డాయి. తెలుగులో 'వృత్తాంత', 'వర్తమాన తరంగిణి' మరియు 'హితవాది' వంటి పత్రికలు తొలిసారిగా 1830-1857 మధ్యకాలంలో రూపొందాయి. కన్నడలో 1851 మైసూరు నుంచి వెలువడిన 'వృత్తాంత పత్రికే' మొదటిది.

ప్రస్తుతం తెలుగు కన్నడ దినపత్రికలలో ఆంగ్లభాషా ప్రభావం తత్సమ, తద్భవాల రూపంలో ఎంత వరకు ఉన్నదో, పరిశీలించడమే ఈ వ్యాస లక్ష్యం. అందువల్ల తెలుగు దినపత్రికలైన ఈనాడు, సాక్షి మరియు ఆంధ్రజ్యోతి పత్రికల్ని, కన్నడ దినపత్రికల్లో విజయవాణి, ప్రజావాణి మరియు విజయకర్ణాటక వంటి పత్రికల్ని తీసుకొని వాటిలోని (ఫిబ్రవరి 20, 21 మరియు 22 తేదిల) పదాలను రాజకీయం, వ్యాపారం, విద్య, ఉపాధి, సినిమా, క్రీడలు, నేరపరిశోధన మరియు ఆరోగ్య రంగాలుగా విభజించి. వాటిలో ఉపయోగించిన ఇంగ్లీష్ పదజాలాన్ని తీసుకొని, తులనాత్మకంగా పరిశీలించి ఈ వ్యాసంలో పొందుపరిచాను.

జనవ్యవహారంలోని భాషలాగే పత్రికారంగంలోని భాష కూడా నిత్యం మార్పులకు లోనవుతూ ఉంటుంది. ఈ పరిణామక్రమంలో తెలుగు పత్రికారంగంపై ఆంగ్లభాషా ప్రభావం ఒకింత ఎక్కువగానే కనబడుతుంది. ఎందుకంటే కొత్త భావాలకు కొత్త పదాలు అవసరమైనప్పుడు వాటికి కొత్త పదాలను సృష్టించే అవకాశం ఉన్నా తెలుగు పత్రికలలో ఆంగ్ల పదాలనే వాడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో తక్కిన ప్రాంతీయ భాషలతో పోల్చుకుంటే ఆంగ్ల పదాలకు సమానార్థకాలైన తెలుగు పదాల వాడకంలో తెలుగు పత్రికల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఉదా: స్వైన్ఫ్లూ అనే పేరుతో పిలిచే రోగం సామాన్య ప్రజలను వణికించే జ్వరం, దానికి పందిజ్వరం అని ఒక్క పత్రిక కూడా రాయలేకపోయింది. దీనికి 'హందిజ్వర' అని కన్నడ దినపత్రికలు వాడుతున్నాయి, మాతృభాషపై కన్నడిగులకు ఉన్న మమకారం, మన భాషమీద మనకు ఎందుకు లేదు అన్న ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారి (2017) మాటలు ఈ సందర్భంలో గమనార్హం. అలాగే కన్నడిగుల కన్నడీకరణానికి క్రింది ఉదాహరణలే నిదర్శనం. ఇందులో తెలుగు, కన్నడ దినపత్రికలు ఆంగ్లపదాలను ఉన్నది ఉన్నట్లుగా వాడటం, తత్సమ రూపాలుగా వాడటం, సమాన దేశ్యపదాలను ఏ భాష ఎంతవరకు ఉపయోగించుకున్నాయి అన్నవిషయాన్ని చూడవచ్చు. తెలుగు దినపత్రికలోని ఇంగ్లీష్ తత్సమాలను మరియు తక్కువగా ఉన్న దేశ్య, సంస్కృత, మిశ్రమసమాసాలను కన్నడ దినపత్రికలలో కన్నడ దేశ్య పదాలుగా, ఎక్కువ మొత్తంలో సంస్కృత, మిశ్రసమాసాలుగా వాడడాన్ని గమనించవచ్చు.

**రాజకీయరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. Senior | సీనియర్ (సా.21, ఈ.20) | హిరియ (వి.20) |
| 2. voters | ఓటర్లు (ఈ. 22) | మతదారరు (వా.21) |
| 3. bill | బిల్లు (ఆ. 20, సా. 21) | మసుదే (వి.20) |
| 4. reservations | రిజర్వేషన్లు(సా.21,ఈ.22) | మీసలాతి (ప్ర.20) |
| 5. governor | గవర్నర్ (ఈ. 20) | రాజ్యపాల (ప్ర. 21) |
| 6. party | పార్టీ (ఈ.21,ఆ.20) | పక్ష (ప్ర. 20,21, వి.క. 21) |
| 7. ration card | రేషన్ కార్డు (సా. 20) | పడితర చీటి (వి. 22) |
| 8. government | గవర్నమెంట్,ప్రభుత్వం(ఆ.20,ఈ21) | సర్కార(వి.20) |
| 9. project | ప్రాజెక్టు (ఈ. 21) | యోజనె (వి.క. 20) |

**వ్యాపారరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. discount | డిస్కౌంట్,రాయితీ(సా.20,ఈ. 21) | రియాయితి(ప్ర.20) |
| 2. sale | సేల్, విక్రయం (ఆ.21,ఈ21) | మారాట (వి. 21) |
| 3. driver | డ్రైవర్ (ఈ. ఆ. 20) | చాలక (ప్ర. 20) |
| 4. income | ఇన్కమ్,ఆదాయం (సా.22,ఆ.22) | ఆదాయ (వి. 21) |
| 5. license | లైసెన్స్ (సా. 22) | పరవానగి (వి.క22) |
| 6. tenders | టెండర్లు (ఈ. 21) | గుత్తిగె (వి. 21) |

**విద్య, ఉపాధిరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. admission | అడ్మిషన్,దరఖాస్తు (సా.21,ఈ21) | దాఖలాతి (ప్ర.22) |
| 2. reservations | రిజర్వేషన్లు(ఆ. 22) | మీసలాతి (వి.21) |

| | | |
|---|---|---|
| 3. degree | డిగ్రీ (ఈ. 20) | పదవి (వి. 22) |
| 4. intermediate | ఇంటర్ (సా. 21) | పదవి పూర్వ (ప్ర.22) |
| 5. invigilator | ఇన్విజిలేటర్ (ఆ. 22) | మేల్విచారక (వి. 22) |
| 6. notice board | నోటీస్ బోర్డు (సా. 22) | సూచనా ఫలక (ప్ర. 21) |
| 7. post | పోస్ట్ (ఆ. 20) | హుద్దె (వి. 21) |
| 8. School | స్కూల్/పాఠశాల (సా. 21, ఈ. 20) | శాలె (వి. 22) |
| 9. interview | ఇంటర్వ్యూ (సా. 20) | సందర్శన (వి.క.22) |
| 10. hall ticket | హాల్టిక్కెట్ (ఈ. 21) | ప్రవేశ పత్ర (వి. 20) |
| 11. scholarship | స్కాలర్షిప్ (ఆ. 20) | విద్యార్థి వేతన (వి.క. 22) |
| 12. model school | మోడల్ స్కూల్ (సా.21) | మాదరిశాలె (వి. 21) |
| 13. practical exam | ప్రాక్టికల్ఎగ్జామ్ (ఆ.20) | ప్రయోగిక పరీక్షె (వి. 20) |

**నేరపరిశోధకరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. kidnap | కిడ్నాప్ (ఆ.20) | అపహరణ (వి.క. 22) |
| 2. suspend | సస్పెండ్ (ఈ. 20) | అమానతు గోళిసు (వి. 21) |
| 3. arrest | అరెస్టు (ఆ. 20) | బంధన (ప్ర. 20) |
| 4. case | కేసు (ఈ. 20) | మొకద్దమె (వి.క. 21) |
| 5. jail | జైలు (ఆ. 22) | కారాగృహ (ప్ర. 20) |
| 6. appeal | అప్పీల్ (ఆ. 21) | మనవి (వి.క. 22) |
| 7. website | వెబ్సైట్ (ఆ. 22) | జాలతాణ (వి.క. 21) |

**చిత్రరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. anchor | యాంకర్లు (ఈ.21) | నిరూపక (ప్ర. 21) |
| 2. release | రిలీజ్ (ఈ.20,సా.21) | బిడుగడె (ప్ర.20,వి.21) |
| 3. award | అవార్డు (ఈ. 20) | ప్రశస్తి (వి. 20) |
| 4. theatres | థియేటర్లు (ఈ. 21) | చిత్రమందిరగళు (ప్ర. 20) |
| 5. designing | డిజైనింగ్ (ఆ. 22) | విన్యాస (ప్ర. 22) |

**క్రీడారంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. balls | బాల్స్/బంతి (సా 20, ఈ. 21) | ఎసత (వి. 20) |
| 2. century | సెంచరీ (సా. 20, 21) | శతక (వి. 22) |
| 3. double century | డబుల్ సెంచరీ (సా. 20, 21) | ద్విశతక (వి. 22) |
| 4. not out | నాటౌట్ (ఈ. 21) | అజేయ (వి. 20) |
| 5. match | మ్యాచ్ (సా. 20, 22) | పంద్య (వి.క. 20) |

**ఆరోగ్యరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. blood pressure | బీపి (ఈ. 20) | రక్తదొత్తడ (ప్ర.22) |
| 2. injection | ఇంజెక్షన్/సూది మందు(ఆ.21,ఈ.22) | సుచుమొద్దు (వి.క. 22) |

సమాజంలో అతి వేగంగా వస్తున్న కొత్తకొత్త మార్పులూ, అత్యంత ప్రభావశీలమైన పారిశ్రామికీకరణం మరియు అంతర్జాలంద్వారా వాడుకలోకి వస్తున్న వాణిజ్యం మొదలైనవి, ఉదా. గ్యాస్టవ్. ఈ పదం ఇదివరకు లేదు. పొయ్యి, కుంపటి వంటివే వాడుకలో ఉన్నాయి. గ్యాస్టవ్ వాడకం పెరగడంతో పొయ్యి, కుంపటితో పాటుగా పొంత, గొట్టం, నుసి, పిడక, కచ్చిక వంటి పదాలెన్నో వ్యవహారంలోంచి జారిపోతున్నాయి. అలవాట్లు మారినా నష్టం భాషకే. గ్యాస్టవ్ తెలుగులోకి అది ప్రవేశించినప్పుడే దాన్ని 'గాలికుంపటి' అని చేసుకొని ఉంటే కనీసం కుంపటి అనే పదమయినా మిగిలి ఉండేది. ఇవేకాకుండా వ్యవహారంలో ఉన్న వివిధ రంగాలకు చెందిన పదాల స్థానంలోనూ ఆంగ్లపదాలు వ్యాప్తిలోకి వస్తున్నాయి. వైద్యం, ఆరోగ్యం, న్యాయం, పరిపాలన, ఆర్థికం, సామాజికం, వ్యవసాయం, వృత్తులు, వ్యాపారాలు, విద్య, వంటి రంగాలలోనూ అధికంగా ఆంగ్లభాషాపదాల వాడుక పై ఉదాహరణల్లో కన్పిస్తుంది. వీటన్నింటికీ ప్రపంచీకరణ కూడా కొంత కారణమవుతోంది. వాటివల్ల తెలుగుపదాలు మరుగునపడిపోతున్నాయి.

రోజురోజుకు పత్రికారంగంలో తెలుగుతనం తగ్గి పరభాషా వ్యామోహంలోకి జారిపోతున్నామనడానికి పై ఉదాహరణలే నిదర్శనాలు. మాతృభాషను పరిరక్షించేందుకు అటు అధికారులు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదు. ఇప్పటికే చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర్వులు, ఇతర ఆదేశాలు, సమాచారం అంతా ఆంగ్లభాషలోనే కొనసాగుతోంది. నిరక్షరాస్యులు సైతం ఏదో ఒక సందర్భంలో ఆంగ్లపదాలను వినియోగిస్తున్నారంటే దానిప్రభావం ఏ స్థాయిలోవుందో అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు ఇంగ్లీష్ పాఠశాలల పేరిట ఇంగ్లీషు మాధ్యమాన్ని కొనసాగిస్తోంది. మన పక్కరాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు తమ మాతృభాషను కాపాడుకోవాలనే సంకల్పంతో అటు అధికారులు, ఇటు ప్రజాపతినిధులు కృషి చేస్తున్నారు. అయితే మన అధికారులు మాత్రం ఆంగ్ల భాషకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తుంది. నేటి దినపత్రికలలో అవకాశం ఉన్న చోట్ల కూడా ఆంగ్ల తత్సమాలనే వాడుతున్నారు. ఎంతగా తెలుగు, కన్నడ దినపత్రికలపై ఆంగ్లభాషా ప్రభావమూ, అనూదిత పదాలలో సంస్కృత ప్రభావమూ ఏదో ఒక్కటి తప్పటంలేదు అని ఈ కింది కొన్ని ఉదాహరణలవల్ల తెలుస్తోంది.

**క్రీడారంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. comedy | కామెడి/హాస్యం(సా.21) | కామెడి/హాస్య (సా.21) |
| 2. hero | హీరో/ కథానాయకుడు(ఈ.22) | హీరో/నాయక(వి.క.22) |
| 3. heroine | హీరోయిన్/ కథానాయిక (ఈ. 22) | హీరోయిన్/నాయికి (వి.క. 22) |
| 4. computer | కంప్యూటర్/గణకయంత్రం(సా.ఆ.21) | కంప్యూటర్/గణకయంత్ర (వి. 21) |
| 5. internet | ఇంటర్నెట్/అంతర్జాలం (సా.ఆ. 21) | ఇంటర్నెట్/అంతర్జాల(వి.క. 21) |
| 6. court | కోర్టు/న్యాయస్థానం (సా. 20) | కోర్టు/న్యాయాలయ (వి. 20) |
| 7. supreme-court | సుప్రీంకోర్టు/అత్యున్నతన్యాయస్థానం(ఈ.ఆ.21) | సుప్రీంకోర్టు/సర్వోచ్చన్యాయాలయ (వి.క. 22) |

తెలుగు, కన్నడ దినపత్రికలలో ఆంగ్ల తత్సమాలను విరివిగా వాడుతున్న సందర్భాలను ఈ కింది ఉదాహరణల్లో గమనించవచ్చు.

**వ్యాపారరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. sensex | సెన్సెక్స్(ఈ.20,21) | సెన్సెక్స్ (వి. 21) |

| | | |
|---|---|---|
| 2. nifty | నిఫ్టీ (సా.ఈ. 20) | నిఫ్టీ (వి.క. 20) |
| 3. package | ప్యాకేజి (ఈ. 20) | ప్యాకేజి (ప్ర. 20) |
| 4. shares | షేర్లు (ఈ.సా. 21) | షేర్గళు (వి.క. 22) |
| 5. card | కార్డు (ఆ. 20) | కార్డ్ (వి. 21) |

**చిత్రరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. teaser | టీజర్ (ఈ. 21) | టీజర్ (ప్ర. 21) |
| 2. audio relese | ఆడియోరిలీజ్ (సా. 21) | ఆడియోరిలీజ్ (వి.క. 21) |
| 3. banner | బ్యానర్ (ఈ. 21) | బ్యానర్ (ప్ర. 21) |
| 4. prerelease | ప్రీరిలీజ్ (ఈ. 20) | ప్రీరిలీజ్ (వి.క. 21, 22) |
| 5. production | ప్రొడక్షన్ (సా. 20) | ప్రొడక్షన్ (వి. 20) |
| 6. six pack | సిక్స్ప్యాక్ (సా. 20) | సిక్స్ప్యాక్ (ప్ర. 21) |
| 7. rating | రేటింగ్ (సా. 20) | రేటింగ్ (ప్ర. 21) |
| 8. multi star | మల్టీస్టారర్ (ఈ. 20) | మల్టీస్టారర్ (ప్ర. 21) |
| 9. hit | హిట్ (ఈ. 21) | హిట్ (ప్ర. 21) |
| 10. flap | ఫ్లాప్ (సా. 20) | ఫ్లాప్ (వి. 20) |

**విజ్ఞానరంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. online | ఆన్లైన్ (సా. 21) | ఆన్లైన్ (వి. 21) |
| 2. video | వీడియో (ఆ. 22) | వీడియో (వి.క. 21) |
| 3. smartphone | స్మార్ట్ఫోన్ (ఈ. 22) | స్మార్ట్ఫోన్ (వి. 20) |
| 4. laptop | ల్యాప్ టాప్ (సా. 21) | ల్యాప్ టాప్ (ప్ర. 22) |
| 5. data | డేటా (సా. 21) | డేటా (ప్ర. 20) |
| 6. storage | స్టోరేజ్ (ఆ. 20) | స్టోరేజ్ (వి. 20) |
| 7. battery | బ్యాటరీ (ఆ. 20) | బ్యాటరీ (వి. 20) |
| 8. camera | కెమెరా (సా. 21) | కెమెరా (వి. 22) |
| 9. bluetooth | బ్లూటూత్ (ఈ. 21) | బ్లూటూత్ (ప్ర. 22) |
| 10. wi-fi-network | వై-ఫైనెట్ వర్క్ (సా. 21) | వై-ఫైనెట్ వర్క్ (వి. 21) |

**క్రీడారంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. pitch | పిచ్ (సా. 21) | పిచ్ (వి. 21) |
| 2. premier league | ప్రిమియర్ లీగ్ (సా. 21) | ప్రిమియర్ లీగ్ (వి. 21) |
| 3. Innings | ఇన్నింగ్స్ (ఆ. 20) | ఇన్నింగ్స్ (వి. 20) |
| 4. all-out | ఆలౌట్ (ఆ. 20) | ఆలౌట్ (వి.క. 20) |
| 5. final | ఫైనల్ (ఆ. 20) | ఫైనల్ (వి.క. 21) |
| 6. quarter final | క్వార్టర్ ఫైనల్ (ఆ. 20) | క్వార్టర్ ఫైనల్ (వి. 20) |
| 7. leg spinner | లెగ్ స్పిన్నర్ (ఈ. 20) | లెగ్ స్పిన్నర్ (వి. 20) |
| 8. batting | బ్యాటింగ్ (ఈ. 20) | బ్యాటింగ్ (ప్ర. 20) |
| 9. tourney | టోర్నీ (ఈ. 20) | టోర్నీ (ప్ర. 20) |
| 10. hat trick | హాట్రిక్ (సా. 21) | హాట్రిక్ (వి. 21) |
| 11. duck out | డకౌట్ (సా. 21) | డకౌట్ (వి. 21) |
| 12. coach | కోచ్ (ఈ. 20) | కోచ్ (వి. 20) |

**ఇతరపదాలు:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. cholesterol | కొలెస్ట్రాల్ (ఈ. 20) | కొలెస్ట్రాల్ (ప్ర. 20) |
| 2. pilot | పైలట్ (సా. 20) | పైలట్ (వి.క. 21) |
| 3. rally | ర్యాలీ (ఆ. 20) | ర్యాలీ (వి.క. 20) |
| 4. rank | ర్యాంకు (సా. 20) | ర్యాంకు (ప్ర. 20) |
| 1. cyber | సైబర్ (ఆ. 21) | సైబర్ (ప్ర. 21) |

పత్రికలు భాషా వినిమయానికి ప్రధాన సాధనాలు. ప్రజలు మాట్లాడుకునే భాషనే దినపత్రికల్లో, పాఠ్యపుస్తకాల్లో, సాహిత్యంలో ఉపయోగిస్తేనే ప్రజల భాష బతుకుతుంది. ఈ విషయంలో మేధావులు, భాషాశాస్త్రవేత్తలు, పత్రికాధిపతులు, పత్రికల సంపాదకులు ఆలోచించాలి. ఆంగ్ల భాషలోని వార్తలనూ, కథనాలనూ తెలుగు పత్రికలలో ప్రచురించటంలో ఆంగ్లభాషా ప్రభావం ఎక్కువగా కన్పిస్తోంది. మౌఖిక భాషలో లేని ప్రయోగాలూ వాక్య విన్యాసాలూ పత్రికలలో కన్పిస్తుంటాయి. దీనిని బట్టి సామాజిక, సాంస్కృతిక, రాజకీయాది ప్రభావాలు పత్రికా భాషపై ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే ఒరవడిలో ఆంగ్ల భాషనుండి కేవలం పదాలే కాక ఆంగ్లంలోని నుడికారాలు కూడా తెలుగులోనికి ప్రవేశించాయి. ఉదా. రెడ్హాండెడ్గా పట్టుకొను (ఆ. 21), రెడ్అలర్ట్ ప్రకటించు (సా. 20), బ్లాక్మెయిల్ చేయు (సా. 20), బ్లాక్లిస్టులో పెట్టు (సా. 22), మొదలైనవి. ఇచ్చిపుచ్చుకొనే ఏ రెండు భాషా సమూహాల మధ్యనైనా కొంతకాలానికి వారి సంస్కృతీ, సాంప్రదాయాలూ, జీవన విధానంలో ఉన్న కొన్ని భేదాలు తగ్గి ఎంతోకొంత సామ్యం కనబడటం మొదలౌతుంది. అలాంటిదే భారతీయభాషలూ ఆంగ్లభాషల మధ్యనున్న సంబంధం. ఆంగ్లభాషాప్రభావంతో తెలుగులోకి ఇంచుమించు సమానార్థకాలుగా ప్రవేశించిన కొన్ని ప్రయోగాలు కన్పిస్తాయి. అనువాదాలను అన్వేషిస్తే ఇటువంటి నుడికారాలూ కుప్పలుతెప్పలుగా దొరుకుతాయి. కొన్ని ఆంగ్లభావాలకు అనుగుణంగా తెలుగులో నూతన పదాలను సృష్టించుకొని తెలుగులో వాడడం కన్పిస్తుంది. ఉదా. కుంటిసాకులు చెప్పు (ఆ. 22), నగ్నసత్యం (ఆ. 20), శ్వేతపత్రం (సా. 20), బాల్చీతన్నివేయు (సా. 20) మొదలైనవి. ఎన్నో విరామ చిహ్నాలు కూడా ఆంగ్లం నుండే తెలుగుభాషలో ప్రవేశించాయి. ఈ ఆంగ్లభాష ప్రభావాన్ని నూతన దేశి పదాల రూపకల్పన ద్వారా తగ్గించుకోవడానికి ప్రయత్నాలు జరగాలి.

తెలుగు దినపత్రికలలో కొన్ని తత్సమాలుగా ఉంటే అవే పదాలు కన్నడ దినపత్రికలలో తద్భవాలుగా మార్పుచెందాయి.

**క్రీడారంగం:**

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. college | కాలేజి (సా. 22)/కళాశాల(ఈ.20) | కాలేజు (ప్ర. 22) |
| 2. mobile phone | మొబైల్ ఫోన్(సా.20)/ చరవాణి(ఈ.21) | మొబైల్ ఫోన్ (వి.క.22) |

తెలుగు దినపత్రికలలో తత్సమ, తద్భవ మరియు దేశ్య సంస్కృతాలుగా ఉండి కన్నడలో మాత్రం దేశ్య సంస్కృతాలుగా వాడారు.

| ఆంగ్లం | తెలుగు | కన్నడం |
|---|---|---|
| 1. heart attack | హార్ట్ఎటాక్/గుండెపోటు(సా.20,ఈ.22) | హృదయాఘాత (వి.22) |
| 2. office | ఆఫీస్/ కార్యాలయం(ఆ.20,ఈ.21) | కార్యాలయ/కఛేరి(వి.20, వి.క.20) |
| 3. judge | జడ్జీ/ న్యాయవాది (ఈ. 22) | న్యాయాధీశ (వి.21) |
| 4. post-mortem | పోస్టుమార్టమ్ (సా. 20)/శవపరీక్ష(ఈ.21) | శవపరీక్షె (ప్ర.21) |




5. university యూనివర్సిటీ/విశ్వవిద్యాలయం(ఈ.20) విశ్వవిద్యాలయ (ప్ర.20)
6. notification నోటిఫికేషన్ (సా.20,ఈ.21) అధిసూచనె (వి. 20)

పత్రికా భాష పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే అవి ఎప్పటికప్పుడు మార్పు చెందుతూ వచ్చినట్లు కనిపిస్తుంది. దినపత్రికలలో ప్రయోగించే పదాల విషయంలో పాత్రికేయులు, పండితులు, ఆయా రంగాలలో నిపుణులు ఎంతో పరిశ్రమించవలసిన అవసరం ఎంతైన ఉంది. ఎక్కువగా వ్యాప్తిలోకి వస్తున్న ఆంగ్ల పదాలకు అడ్డుకట్టవేసే విధానంలో జాగ్రత్తపడాలి. వారు ఆయా వస్తువుల స్వరూపాన్ని బట్టి సహజంగా సులభంగా మూలానికి దగ్గరగా ఉండే పదాలను గుర్తించి వ్యవహారంలోకి తెచ్చేప్రయత్నం చేయాలి. ఒక పదాన్ని దేశీయతకు దగ్గరగా తెనిగించగలిగితే అది తప్పకుండా సర్వజనామోదాన్ని పొందుతుంది. పూర్వకాలంలో తెలుగు విజాతీయ భాషలని ఎదుర్కొన్నప్పుడు విదేశీ మాటలలో సరితూగే సరికొత్త పదాలను అదే భాషా పదాలలో రూపొందించేవారు లేదా తద్భవ రూపంలో ప్రవేశపెట్టేవారు. అందుకు ఉదాహరణ పూర్వం మాంసాన్ని వండడానికి మిరియాలనే వాడేవారు, ఆ మిరియాలు భారతదేశంలోనే దొరికేవి. ఒకానొక సందర్భంలో తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్ని ఆక్రమించుకున్నప్పుడు పాశ్చాత్యులు భారతదేశానికి వచ్చే దారి మూతబడింది. దానితో సముద్రపు దారి కనుక్కుందామనే ప్రయత్నంలో, దారి తప్పి అమెరికాలో పడ్డారు. అక్కడ పచ్చగా, ఎర్రగా, కారంగా ఉండే కాయలని చూసి మిరియాలను ఇంగ్లీషులో 'పెప్పర్' అనడం వలన అవే లక్షణాలు ఉన్న ఎర్రటి, పొడుగాటి కాయలని 'పెప్పర్ కార్న్' అని అమెరికాలో పిలవటం మొదలెట్టారు. ఆ మొక్కలని మన దేశంలోకి తీసుకువచ్చారు. అది మనం కనీవిని ఎరుగని కొత్త మొక్క కనుక దానికి మనవాళ్ళు 'మిరియపు కాయ' అని పేరు పెట్టారు. అదే తరువాత మిరపకాయగా మారింది.

నేటి దినపత్రికలలో ప్రపంచీకరణ మరియు సాంకేతికత అనే నెపంతో అనేక రంగాలలో ఇంగ్లీష్ తత్సమాలను ఆహ్వానించటం సరైన పద్ధతి కాదు. కొద్దో గొప్పో కన్నడ దినపత్రికలు వాటి మాతృభాషకి ప్రాముఖ్యం ఇచ్చినా, విజ్ఞాన రంగం, క్రీడారంగం మరియు సినిమారంగాలలో తన ఉనికిని చాలానే కోల్పోతున్నది అని చెప్పవచ్చు. ఈ విషయంలో తెలుగు దినపత్రికలు మరో ముందడుగు వేసి వాటి ఉనికికే హాని కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నాయని పై ఉదాహరణలతో మనకి స్పష్టంగా అర్థమవుతున్నది. వీలున్నవాటికి దేశ్యపదాలను, కుదరకపోతే తద్భవ రూపాలనైనా మనం ఏర్పాటుచేసుకోవాలి. ఇటువంటి ప్రణాళికలు రూపొందించుకోకపోతే, మన భాషాభివృద్ధికి దర్పణంలాగా ఉన్న దినపత్రికలపై ఆంగ్లభాషా ప్రభావం పడి మాతృభాష ఉనికిని దెబ్బతీస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు.

సంక్షిప్తాలు: ఈ.= ఈనాడు, ఆ.= ఆంధ్రజ్యోతి, సా.= సాక్షి, వి. = విజయవాణి, వి.క. = విజయ కర్నాటక, ప్ర. = ప్రజావాణి 20, 21, 22 అంటే 20-02-2022, 21-02-2022, 22-02-2022.

– వ్యాసరచయిత సీనియర్ రిసోర్సు పర్సన్
ఎస్.పి.పి.ఈ.ఎల్, సి.ఐ.ఐ.ఎల్ మైసూరు

తెలిదేవర భానుమూర్తి
99591 50491

# నిజాయితీ + నిబద్ధత = చుక్కారామయ్య



*"ఉద్యమలక్ష్యం వైపే మనం ముందుకు సాగాలి": డా॥ చుక్కా రామయ్య 2013 ఫిబ్రవరి 21న హైదరాబాదులో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమ దీక్షాదినం సందర్భంగా జరిగిన సభలో ప్రారంభోపన్యాసంలో..*

**ఉ**పాధ్యాయులలో ఉత్తమ ఉపాధ్యాయులుంటారు. పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లుగా ఉత్తమ ఉపాధ్యాయులలో ఉత్తమోత్తమ ఉపాధ్యాయులు వేరు. అలాంటి అరుదైన ఉత్తమోత్తమ ఉపాధ్యాయుల్లో చుక్కారామయ్య ఒకరు. ఆయన కేవలం లెక్కల పంతులే కాదు- సామాజిక శాస్త్రవేత్త. స్వాతంత్ర్య సమరయోధుడు. రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆయన పోరాటం జరిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని రెండేళ్లపాటు జైలు శిక్షననుభవించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకొని జై తెలంగాణ అంటూ నినదించారు.

రామయ్య అందరి మేలు కోసం పాటుపడ్డారు. తను నమ్మిన సిద్ధాంతానికి ఆయన కట్టుబడి ఉన్నారు. దేనికీ రాజీపడని ప్రశ్నించే తత్వం ఆయనది. పద్మశ్రీ వంటి బిరుదుల కోసమూ, నామినేటెడ్ పదవుల కోసమూ ఆయనెప్పుడూ వెంపర్లాడలేదు. చేదు నిజాల్ని చెప్పక మానలేదు. 30 సంవత్సరాల పాటు ఆయన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. ఉపాధ్యాయ, అధ్యాపక నాయకుడిగా పనిచేశారు. అధ్యాపక నాయకుడిగా ఉన్నప్పుడు కూడా ఆయన తరగతి గతిని వదిలి తిరగలేదు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. ఎన్నో పుస్తకాల్ని రాశారు.

ఈ మధ్యనే 97వ పుట్టిన రోజు జరుపుకొన్న రామయ్య ఐఐటికి పర్యాయపదం. ఆయన దగ్గర ఐఐటిలో శిక్షణ పొందిన విద్యార్థులతోనే అమెరికాలోని సిలికాన్ వ్యాలీ ఏర్పడిందనడంలో అతిశయోక్తి లేదు. చుక్కా రామయ్యను ప్రభావితం చేసిన వారిలో మా నాన్న తెలిదేవర వెంకటరావు కూడా ఉన్నారు. 'రామయ్య జ్ఞాపకాలు' మా నాన్న మీద రాసిన పుస్తకమే. Ramayya's Memories పేరు మీద అది ఆంగ్లంలోకి అనువదించబడింది. ఈ పుస్తకం ఉపాధ్యాయులకు మార్గదర్శిగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

"మీరు ఏ పొలిటికల్ సైన్సో, ఫిలాసఫియో చదవకుండా గణితం వైపుకెందుకెళ్లారు" అని ఓసారి ఆయననడిగాను. "నేను ఉర్దూ మీడియంలో చదువుకున్నాను. లెక్కలైతే ఉర్దూ తక్కువగా ఉంటుంది. గణితంలో అక్షరాలు తక్కువ. అంకెలెక్కువ. ఆకారణంగా నేను లెక్కల వైపు దృష్టిపెట్టాను. లెక్కల పంతులుగా నా ప్రస్థానం భువనగిరి నుంచి మొదలైంది. అప్పుడు నాకు ఇరవైఏళ్లు. మా స్కూల్‌లో వెంకటరావు సీనియర్ లెక్కల టీచర్. ఆయన టెన్త్‌క్లాస్ ఎ సెక్షన్‌కు వెళితే నేను బి సెక్షన్‌కు వెళ్లేవాడిని"

"ఆయన మీతో ఎలా ఉండేవారు".

"నన్ను ఆయన సొంత కొడుకులా చూసేవారు. గణితంలో ఆయన నా మార్గదర్శి. 'గణితం ఓ విలక్షణమైన సబ్జెక్టు. చాలా మంది అనుకునేటట్లు అది అంకెల గారడీకాదు. ఒక ఆలోచనా విధానం. తెలుగు, హిందీ, వంటి సబ్జెక్టులలో అక్షరాలు వాడతారు. ఒక్కో భాష ఒక్కో విధంగా ఉంటుంది. అలాగే గణితానికి ప్రత్యేక భాష ఉంది. అక్షరాలనూ అంకెలనూ ఉపయోగించి ఆ భాషను తయారు చేశారు. విషయాన్ని అతి సంక్షిప్తంగా, హేతుబద్ధంగా చెప్పడంలో గణితానికి గణితమే సాటి. ఒక ఆలోచన ఒక ఫలితాన్ని స్తుంది. మిగతా విషయాల్లో ఆ ఫలితాన్ని రాబట్టటానికి భౌతిక ప్రక్రియలుంటాయి. గణితంలో మానసిక ప్రక్రియే ప్రధానం. హేతుబద్ధమైన ఆలోచన వల్ల ఒక ఫలితాన్ని కచ్చితంగా ఊహించగలుగుతాం. ఆ లక్షణమే నూతన ఆవిష్కరణలకు మూలమైంది. 'మేథ్స్ ఈజ్ లాంగ్వేజ్ ఆఫ్ లాజిక్' అని వెంకటరావు సార్ నాకు చెప్పారు. భువనగిరిలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు సీనియర్ ఉపాధ్యాయుడైన వెంకటరావు నుంచి ఎన్నో బోధనా మెళకువలు నేర్చుకొన్నాను. విద్యార్థికి ఎప్పుడు చేయి అందించాలో, ఎప్పుడు వెనక్కి తీసుకోవాలో అర్థం చేసుకొన్నాను. విద్యార్థులతో కలిసి జ్ఞానసాగరాన్ని ఈదటంలో గల మాధుర్యాన్ని రుచి చూపించిన వెంకటరావు గారిని నేనెన్నటికీ మరవలేను".

రామయ్యకు సమాజమే తరగతి గది. గణితం మూలంగా ఆయనకు హేతువాద దృక్పథం అలవడింది. 1950 ప్రాంతంలో ఆయన భువనగిరిలో లెక్కల పంతులుగా పనిచేశారు. అప్పటికి నేను పుట్టలేదు. మా నాన్న వెంకటరావు గురించి నాకు పెద్దగా తెలియదు. రామయ్య సార్ రాసిన 'రామయ్య జ్ఞాపకాలు' మూలంగానే మా నాన్న గురించి తెలుసుకోగలిగాను. తన స్వశక్తి వల్లే గణితంలో నిష్ణాతుడైనట్లు ఒకవేళ రామయ్య చెప్పుకొన్నా ఆయనను ఎవరూ ప్రశ్నించే సాహసం చేసేవారు కాదు. చిన్ననాటి ఉపాధ్యాయుడు ఆర్తి నమ్మాళ్వార్ స్వామి తనకు స్ఫూర్తి అనీ, బోధనా మెలకువలను వెంకటరావు నుంచి నేర్చుకొన్నాననీ నిజాయితీగా ఆయన చెప్పారు.

పట్టణాల్లో ఎక్కడ ఏ మాత్రం ఖాళీ స్థలం దొరికినా అక్కడో



కీ.శే. తెలిదేవర వెంకటరావు

అపార్ట్‌మెంట్ కట్టినట్లుగా విద్యార్థులకు ఏ కాస్త ఖాళీ సమయం దొరికినా, సెలవులొచ్చినా వారు సేదతీరేందుకు గానీ, తరగతి గదిలో చెప్పిన విషయం వారి మనసులో నాటుకునేందుకుగానీ, స్వతహాగా ఆలోచించేందుకు గానీ అవకాశమివ్వకుండా స్పెషల్ క్లాసులేర్పాటు చేయడం ఇప్పుడు రివాజుగా మారింది. ఆశ్చర్యకరంగా తల్లిదండ్రులూ నోరు మెదపడంలేదు. విద్యా యంత్రాంగమూ పట్టించుకోవడంలేదు. వెరసి నేటి విద్యావిధానం విద్యార్థుల సృజనాత్మక శక్తికి దారులు మూసేస్తున్నదని రామయ్య అభిప్రాయపడ్డారు.

వెంకటరావు గారు ఖాదీ బట్టకట్టేవారు. పైన కోటు వేసుకొనేవారు. టోపీ పెట్టుకునేవారు. నా అంత రంగు ఉండేవారు కాదు. ముఖం ముద్దగా ఉండేది. నా పైన బలమైన ముద్రలు వేసి ఒక ఉపాధ్యాయ వృత్తికే కాక మొత్తం సామాజిక మార్పులో ఎలా భాగస్వామిని కావాలన్న విషయంపై కూడా ఆయన నాకు పనిముట్లు అందించిపోయారని రామయ్య అన్నారు.

కొన్నేళ్ల క్రితం 'రామయ్య జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ వెంకటరావు, రామయ్యలను ప్లేటో, అరిస్టాటిల్‌లతో పోల్చారు. రామయ్య ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నించాల్సిన అవసరాన్ని సమాజానికి బోధించిన సామాజికవేత్త. బడిపాఠాలకే పరిమితం కాకుండా దేశం కోసం ఆలోచించిన వ్యక్తి. నేటి ఉపాధ్యాయులకు స్ఫూర్తి. అ

**రాయసీమ దళిత కథలకు ఆహ్వానం**

దేశం పురోగమిస్తుందని ఊకదంపుడు ప్రసంగాలు నాయకులు చేస్తున్నప్పటికీ అసమానతలు అంతం కాలేదు. వివక్ష దేశమంతా వ్యాపించింది. దళితులపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయి. కొన్ని వర్తమాన సమాజానికి తెలుస్తున్నా కొన్ని వెలుగు చూడకుండానే కాలగర్భంలో కలసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దళిత సమాజాన్ని సంఘటితపరచి చైతన్య పరచాల్సిన అవసరం వుంది. దేశవ్యాప్తంగా ఆ ప్రయత్నాలు చేస్తున్నా కవులుగా కథకులుగా మనపాత్ర కూడా పోషించాల్సిన అవసరముంది. అందుకే దళితకథల సంకలనం తీసుకురావాలని భావిస్తున్నాము. ఈ క్రింది సూచనల ప్రకారం కథలు అందించాలి.

1.దళిత కథకులే కథ రాయాలి 2.కథకు వస్తువు దళిత వివక్ష, అసమానతలు, అవమానాలు, అంటరానితనం ఇలా ఏదైనా దళిత జీవితంతో ముడిపడినదై వుండాలి. 3. రాయలసీమకు చెందిన కథకులు మాత్రమే కథలు పంపాలి 4.కథ నిడివి ఏ4సైజులో 8పేజీలు తెలుగు డిటిపి అనూ7లో 14-16 ఫాంటులో 5పేజీలకు మించరాదు. 5.కథలు పంపడానికి 31.12.2022నాటికి కథకుడి వివరాలు మరియు కథకుడి ఫోటోతోపాటు కథను డిటిపి చేయించి kengaramohan@gmail.comకు పంపాలి. 6. కథలపై 2023 జనవరిలో కథారచయితలతో వర్క్ షాప్ నిర్వహించబడును. ఆ వర్క్ షాపులో మనం రాసిన కథలన్నింటిపై లబ్ధప్రతిష్టులైన కథకులు చర్చించి కథానిర్మాణంపై తగు సూచనలిస్తారు. తదనుగుణంగా కథను మార్చవలసి వుంటుంది. తద్వారా నాణ్యమైన కథలు వస్తాయి. 7.కథను ఈ సంకలనం కోసమే రాయాలి.గతంలో రాసినవి, ఇతరపత్రికల్లో ప్రచురించినవి, సామాజిక మాధ్యమాల్లో పెట్టినవి తిరస్కరించబడతాయి. 8.కథల సంకలనం డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్-2023లో ఆవిష్కరించబడతాయి.

**- కెంగారమోహన్,** 9493375447/9000730403

కవిత

## ...నేను మళ్ళీ జన్మిస్తా...

**కు**లం కులం అంటూ
కులవ్యవస్థలో కళ్ళుమూసుకు
నిద్రిస్తున్న మానవుడా
లే.. మేలుకో... లే.. మేలుకో...
ఈ కులవ్యవస్థ
బానిససంకెళ్ల నుంచి విముక్తి కా!

నాడు అడివిలో పుట్టిన
ఆదిమానవునికి
తెలియలేదు తన మతమేదో?
నేడు ఆసుపత్రిలో
పుట్టిన ఆధునిక మానవునికి
తెలుస్తుంది తన మతమేదో?

తరతరాలుగా
అభివృద్ధి చెందుతున్న
మనదేశంలో
కుల మత జాతి వర్గీకరణలో
అన్ని దేశాల కంటే
అభివృద్ధి పథంలో
నడుస్తూంది మాదేశం!

ఏ గోడకేసి చూసినా
ఏ రోడ్డుకేసి చూసినా
మా కులం..మా మతం
వర్ధిల్లాలి అంటూ
పిచ్చిరాతలు చూస్తున్నాం
మన మందరం
మనుషులమన్న మాట
మరుస్తున్నాం

కుళ్ళిపోయిన పండు వలే
నేడు సమాజంలో కులం
దుర్వాసన వేస్తుంటే
ఆ దుర్వాసనను భరించలేక
నేను మరణిస్తున్నా
నేను మరణిస్తున్నా

మరో జన్మనైనా
ఈ కుల మత జాతి
వర్గీకరణను అడ్డుకోవడానికి
నేను మళ్ళీ జన్మిస్తా!
నేను మళ్ళీ జన్మిస్తా!!

లక్ష్మి శ్రీనివాస్
9676601192

ముఖ చిత్రం-2

# కులవివక్ష లేని సమాజాన్ని సాధిద్దాం
## సామాజిక సమరసతా సమ్మేళనం పిలుపు

**"కులవివక్ష లేని సమరసతా సమాజాన్ని సాధించటం సాధ్యమే... కదలిరండి. దేశభవిష్యత్ కోసం కలిసి సాధిద్దాం...." అని- ఈ నవంబరు 6న విజయవాడలో రాష్ట్రస్థాయిలో జరిగిన విస్తృత సమరసతా సమ్మేళనం పిలుపు నిచ్చింది.**



**భు**వనేశ్వరీ పీఠాధిపతి శ్రీ కమలానంద భారతీస్వామి, భారత ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖా మంత్రి నారాయణస్వామి, మాజీమంత్రి శ్రీ డొక్కామాణిక్య వరప్రసాద్, మాజీ రాష్ట్ర మంత్రి, శాసనసభ పూర్వ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు, ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, రాష్ట్ర సమరసతా వేదిక అధ్యక్షులు శ్రీ తాళ్ళూరి విష్ణు, రాష్ట్ర సామాజిక సమరసత మహిళా కన్వీనర్ శ్రీమతి కోడూరు జయప్రద తదితరులు ప్రసంగించారు.

1917 నవంబరులో ఇదే విజయవాడలో సామాజిక సమత కోసం తొలి 'ఆది ఆంధ్ర మహాసభ' జరిగింది. హైదరాబాద్ నుంచి ఆది ఆంధ్ర ఉద్యమ నాయకుడు శ్రీ భాగ్యరెడ్డి వర్మ కూడా అందులో పాల్గొన్నారు. ఆ ప్రయత్నానికి 105 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఇప్పుడు సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగిన సమరసత సమ్మేళనంలో పలువురు తమ తమ ప్రసంగాల్లో కులాలకు అతీతంగా ప్రతి హిందువుని ఆలోచింపజేసేలా ప్రసంగించారు. కొన్ని కొన్ని భావాలైతే శ్రోతల గుండెలోతుల్లోకి భావోద్వేగాల భరితంగా చొచ్చుకుపోయాయి.

**అతిథులు తమ తమ ప్రసంగాలలో వ్యక్తం చేసిన ముఖ్యాంశాలు:**

"కుక్కని ముద్దు పెట్టుకుంటాం. దళితుడంటే దూరం పెడతాం..... కాని, దళితులు ఎంత శక్తిమంతులు, దేశభక్తులు అంటే – రెండవ ప్రపంచయుద్ధంలో వీరోచితంగా పోరాడిన దళితయోధుల 'జాటవ్ బెటాలియన్' మూడు పతకాలు గెల్చుకున్నది... ఆత్మపరిశీలన చేసుకుందాం. మన చరిత్రలో 'అంటరానితనం' అనే రుగ్మత ఆయా వర్గాల్ని తీవ్రంగా బాధించింది. వారి మనసుల్ని గాయపరిచింది... అంగీకరించాలి."

"కాని, ఒకప్పుడు కేరళలో నారాయణగురు వంటి మహాపురుషులు, గురువులు ఈ 'అస్పృశ్యులు' అని ముద్రవేయబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా సంస్కరణలు తీసుకువచ్చారు.... సామాజిక సంస్కరణల కోసం పోరాడిన విప్లవాత్మక సంస్కర్త డాక్టర్ అంబేద్కర్ సారథ్యంలో మనం రాజ్యాంగం నిర్మించుకున్నాం. ప్రపంచంలోని ఏ దేశానికీ – ఇలా 'వివక్షకి గురి అయిన వర్గం' నుంచి ఒక మేథావిని రాజ్యాంగ రచన కోసం ఎంపిక చేసిన చరిత్ర లేదు... అంతేకాదు, మన దేశంలో వివిధ ప్రాంతాల్లో నారాయణగురు వంటి సాధు సంతులు ఈ వివక్ష నిర్మూలనకు తామే ఆద్యులుగా నిలిచి ప్రచారం చేస్తూ వచ్చారు...."

"ఇలాంటి వివక్షరహితమైన సమాజం ఎలా సాధ్యం?– అని ప్రశ్నించే వాళ్లకి సమాధానంగా డాక్టర్ హెడ్గేవార్ 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్ నిలబడింది. డాక్టర్ అంబేద్కర్, మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీలు సయితం సంఘ్ శిబిరాలను సందర్శించి, ఆ శిబిరాల్లో 'కులం ప్రస్తావన లేని సమరసతా స్ఫూర్తి'ని చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. సంఘ్‌లో ప్రవేశించిన ఏ ఒక్కర్నీ ఎవ్వరూ ఎప్పుడూ 'నీ కులం ఏమిటి?' అని అడగరు. ఎందుకంటే సమరసతా స్ఫూర్తితో పనిచేయడమే సంఘ్ ప్రాథమిక నియమాలలో ఒకటి....

"మన సమాజంలో వివక్ష ఉండేదని, లేదా ఇంకా ఉందనీ, మతం

మారితే వివక్ష ఉండదనీ భ్రమిస్తూ, కొందరు ఇతర మతాల్లోకి వెళ్తున్నారు. కాని, అక్కడ వివక్ష ఇక్కడ లేనంత ప్రస్ఫుటంగా, బలంగా ఉంది. ఇస్లామిక్ దేశాలు ఇస్లాంలోని శాఖా భేదాలతో నిత్యం ఘర్షణల్లో మునిగితేలుతున్నాయి. క్రైస్తవ పాశ్చాత్య దేశాలని వర్ణవివక్ష భయంకరంగా వెంటాడుతోంది.... అందుకే మన సమాజంలో ఇంకా సామాజిక వివక్ష ఉంటే, దాన్ని బయటి దేశాల, ఇతర మతాల వాళ్లెవరూ పరిష్కరించలేరు. మనమే పరిష్కరించుకోవాలి. సామాజిక సమరసతని ఎలా సాధించుకోవచ్చునో మనమే కూర్చొని మాట్లాడుకోవాలి...."

"కులం సామాజిక హెచ్చుతగ్గుల వివక్షకు కొలబద్ద కాదు" అన్న భావనని సమాజంలో తీసుకురావాలి. సమతా ఉద్యమ స్ఫూర్తి ఇదే. ఈ స్ఫూర్తితో కలిసి పనిచేస్తే వివక్షరహిత సమాజం సాధ్యమే....

## రెండు పుస్తకాల విడుదల







1905లో మంగిపూడి వెంకటేశ్వర శర్మ "అంటరానితనం ధర్మ సమ్మతం కాదు...' అని చాటిచెప్పే పద్యకవితను 'నిరుద్ధ భారతం' పేరుతో రాశారు. దానిని ఇప్పుడు సరళమైన తెలుగులో ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు రాయగా, ఈ వేదిక పై దాన్ని ఆవిష్కరించారు. 'నిరుద్ధ భారతం' పుస్తకాన్ని సామాన్య ప్రజలకు అందరికీ అర్థమయ్యే రీతిలో 'వచన నిరుద్ధ భారతం' పేరుతో ఆచార్య పులికొండ సుబ్బాచారి రచించిన పుస్తకాన్ని కూడా ఈ సభలో ఆవిష్కరించారు. ఏ జంతువుకీ లేని కుల వివక్ష రుగ్మత మనుషులకే ఉండటాన్ని ప్రశ్నిస్తూ రాసిన ఈ పుస్తకం అప్పట్లో ఓ సంచలనం అంటూ ఆ పుస్తకం గురించి ఆచార్య పులికొండ సుబ్బాచారి వివరించారు. 'కృష్ణానదీ తీరాన సమతా ఉద్యమాలు' పేరుతో డాక్టర్ దుగ్గరాజు శ్రీనివాసరావు రాసిన పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు.

నాగేశ్వరరావు పంతులుగారి దళిత సేవలకు కృతజ్ఞతా సూచకంగా ఆయన ముని మనుమరాలు శ్రీమతి రాధికని, ఆనాటి సమతా ఉద్యమానికి అగ్రేసరులుగా పనిచేసిన శ్రీ సుంద్రు వెంకయ్యగారి మనుమడు రామాచారిని, వేముల కూర్మయ్యగారి కుమారుడు డా. రామలింగేశ్వరరావుని ఈ వేదిక సత్కరించింది.

## మండలి బుద్ధ ప్రసాద్, మాజీ మంత్రి, పూర్వ శాసనసభ ఉపసభాపతి:

దేశంలో తొలి అస్పృశ్యతా పోరాటం ఆంధ్రాలోనే మొదలైంది. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు కృష్ణాజిల్లాలో ఎకరం భూమి కొని, 45 దళిత కుటుంబాలకు ఇళ్ళు కట్టించి ఇచ్చారు. ఆయన పెట్టిన స్కూలులో చదివిన వేముల కూర్మయ్య రాష్ట్రంలో తొలి దళిత మంత్రి అయ్యారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి (దామోదరం సంజీవయ్య) ఎంపిక ఆంధ్రప్రదేశ్‌లోనే సాధ్యమయింది... 1914లో వేమూరి రాంజీ పంతులుగారు మచిలీపట్నంలో యస్.సి.ల కోసం వృత్తి శిక్షణా హైస్కూలును ప్రారంభించారు. . . .ఇలాంటి చరిత్ర ఈ రాష్ట్రానిది. సమాజంలో సమతా భావాలు పెంపొందించటం ప్రతి పౌరుడి బాధ్యత...

## డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ రాష్ట్ర మంత్రి:

సమరసతా ఉద్యమాలు ఏ రూపంలో జరిగినా విజయాన్ని సాధిస్తున్నాయి. ఒక చర్మకారుడి కుటుంబంలో పుట్టిన నేను ఈ రోజు ఇంతమంది పెద్దల సరసన ఈ వేదిక నుంచి మాట్లాడుతుండటం కూడా విజయమే. మన దళితుల్లోనూ వివక్ష ఉంది. దాన్ని మనం అధిగమించాలి. ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల చట్టం పదునైన ఆయుధం. దాన్ని విచక్షణతో వాడాలి తప్ప దుర్వినియోగం చేయకూడదు... ప్రేమపెళ్లిళ్లు, పరువు హత్యలు - లేదంటే ఘర్షణలు... అన్నింటికీ పరిష్కారం కులాన్ని ఒక సంస్కృతిగా మాత్రమే చూసే తత్వాన్ని అలవర్చుకోవటం. భగవద్గీత చదవండి. ఇంతకన్నా గొప్ప గ్రంథం ప్రపంచంలో లేదు. అదే నిజమైన సంస్కారాన్ని ఇస్తుంది.

## ఐ.వై.ఆర్. కృష్ణారావు, ఐ.ఏ.ఎస్ (రిటైర్డ్), ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి:

1947కి పూర్వం క్రైస్తవ ప్రచారకులు చెప్పుకునేవారు- 'బ్రాహ్మణులనైనా మార్చవచ్చు గాని, మాలదాసరులను మతం మార్చలేం' అని. రామానుజాచార్య ప్రభావం అంత గొప్పది... దళితుల్ని దూరంగా ఉంచి సూక్తులు చెప్పటం కాదు ఇప్పుడు కావలసింది. గతంలో వారి పట్ల జరిగిన అవమానాలకు ఇప్పుడు మనం ప్రాయశ్చిత్తం చేసుకుందాం. కలుపుకు పోదాం. వాళ్లకి తెలియాలి - బయటకు (ఇతర మతాల్లోకి) పోతే, కులం మాయమైపోతుందన్నది భ్రమ మాత్రమే. అక్కడ వివక్ష భయంకరం అని వాళ్లకి అర్థం కావాలి.. మన దేవాలయాల్లో అర్చకుడి పాత్రను శక్తిమంతం చేయాలి. ధర్మ పరిరక్షణ కేంద్రాలుగా దేవాలయాలను పటిష్ఠపరచాలి. అ

**మాతృభాషతోనే మనుగడ... అమ్మనుడితోనే అందలం**

డా॥ సుంకర గోపాలయ్య
9492638547

# బి.సి. అస్తిత్వ సాహిత్యం-ప్రపంచీకరణ

పరిచయం :

నా చిన్నతనం అంటే ఓ 30 సం॥ల క్రితం వరకు మా ఊరు నా కంటికి అద్భుతంగా కనిపించేది. చెర్లో చాకలివాళ్ళు బట్టలు ఉతుకుతూ శబ్దాలు చేస్తూ ఉండేవారు. ఊరి మొదట్లోనే కమ్మరి 'నాగయ్య' కొలిమి దగ్గర నుండి సమ్మెటపోట్లు వినిపించేవి. కొలిమిలో నిప్పులసెగ తాకుతూ ఉండేది. ఇంకా ముందుకు వస్తే కంసాలి బలరామయ్య నాగలికి మేడి చెక్కుతూనో, ఎద్దుల బండికి కాడి చెక్కుతూనో కనిపించేవాడు. గొర్రెల్ని, మేకల్ని తోలుకుపోతూ సుంకర కృష్ణయ్య కనిపించేవాడు. క్షౌరం చేస్తూ మంగలి శీనయ్య కనిపించేవాడు. ఇప్పుడు ఈ దృశ్యాలు ఎక్కడా అక్కడ లేవు. వాస్తవానికి ప్రపంచీకరణ కంటే ముందు వచ్చిన పారిశ్రామికీకరణ ఈ అస్తిత్వ మూలాలపై దెబ్బ కొట్టింది. కొందరు భూములు కోల్పోయారు. పరిశ్రమలు పెరిగాయి. విదేశీయ ఉత్పత్తులు పెరిగాయి. అక్షరాస్యత, పట్టణీకరణ, రవాణా కారణంగా ఒక మధ్యతరగతి వర్గం సృష్టించబడింది.

సాంఘిక వెనుకబాటుతనం, ఆర్థిక వెనుకబాటుతనం అనేది వృత్తివిద్యలో విద్యను కోల్పోయిన చేతిపనివాళ్ళు చాలా కిందకి వెళ్ళిపోయారు. వారికి ఆ వృత్తిలో నైపుణ్యం తప్ప వేరే అవకాశాలు లేవు.

'ప్రపంచీకరణ' చాలా అందమైన పదం. సుఖవంతమైన పంజరం. చాలా ఆరోగ్యకరంగా కనిపిస్తూనే అనారోగ్యకర జీవితాలను ప్రసాదిస్తుంది. అన్నింటిని దగ్గరగా చేస్తూనే చాలా దూరాలకు నెట్టేయడం ప్రపంచీకరణ చేసే అతిముఖ్యమైన చర్య.

ఈ సమాజంలో గొల్లలు, ముదిరాజులు, పద్మశాలీలు, కమ్మర, కుమ్మర, గౌండ్ల, వడ్డెరులు, రజకులు, నాయి బ్రాహ్మణులు, జోగినులు, మేదరి, దాసరి, దొమ్మరి, గంగిరెద్దు, జాలర్లు, జంగంవారు..ఇలా అనేక బి.సి. కులాలు నేడు అస్థిత్వాన్ని కోల్పోయాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో కమ్మరి కుండలు ఫెటిల్లున పగిలిపోయాయి. ఆట, పాట రూపం మార్చుకున్నాక కళాకారుల జీవితాలు చిన్నాభిన్నమైపోయాయి.

ఆధునిక సాహిత్యంలో బి.సి. అస్తిత్వాన్ని కోల్పోవడం గురించి, ఆ సంస్కృతి, సంప్రదాయాలకు దూరం కావడం గురించి రచయితలు వేదన చెందారు. కానీ పరిష్కార మార్గాల గురించి పెద్దగా ఆలోచనలు చేయలేదు.

ముందుగా ఈ వ్యాసంలో బి.సి. అస్తిత్వాన్ని గురించి వచ్చిన వచన కవితల్లో 'ప్రపంచీకరణ' నేపథ్యంలో వచ్చిన రచనల్ని పరిశీలిద్దాం.

**చేనేత కులం**

భారతదేశంలో చేనేతరంగం చాలా పెద్ద కుటీర పరిశ్రమ. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 10 లక్షలకు పైగా చేనేత కుటుంబాలున్నాయి. ఈ చేనేత కుటుంబాల్లో బతుకు దారాలు పుటుక్కున తెగిపోతున్నాయి. మగ్గం గుంటలు మరణ స్థలాలుగా మారుతున్నాయి. 'భగ్వాన్' కవిత చూద్దాం -

*ఉరికొయ్యో / పురుగుమందో/ ప్రపంచీకరణ మహమ్మారి ఊపిరాడని బలవంతపు కౌగిట్లో/ ఏదైతేనేం / వాడు గిలగిలా కొట్టుకొని చనిపోయాడు/ వాడు నేసిన తెల్లని వస్త్రం / వాడి శవం మీదే కప్పడం పెద్ద విషాదం/ ఇప్పుడు నాకు బట్టలు కుట్టుకున్న ప్రతిమనిషీ / వాడి శవాన్ని మోస్తున్న ఉరికొయ్యలా కనిపిస్తున్నాడు*

(బల్లకట్టు - పుట - 88-90)

మాస్టర్ వీవర్ల సంస్కృతి చేనేత కార్మికులను బాగా దగా చేసింది. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా వచ్చిన వాణిజ్య సడలింపులు ఎగుమతులకు దారితీశాయి. ముడిసరుకుల ధరలు పెరిగిపోయాయి. మాస్టర్ వీవర్లు ఉత్పత్తి నిలిపేశారు. ఆకలి కేకలు పెరిగి చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విషయాన్ని పి.విద్యాసాగర్ అనే కవి 'చావుల్ని నేస్తున్న మగ్గాలు' అనే కవితలో చెప్పారు.

*నగ్న దేహాన్ని ఇంద్రధనుస్సులతో అలంకరించిన ఆ రెండు చేతులు*
*ఆ రెండు చేతులే వస్త్రాలకు బదులు*
*ఉరితాళ్ళని ఆకలి చావుల్ని నేస్తున్నాయి*
*వాళ్ళ శవాల మీదనే కప్పే మాస్టర్ వీవర్ సంస్కృతి*
*అకాల మృత్యువుకు స్వాగతం చెప్పే చోట*
*మనం మాట్లాడుకుంటే అర్థాంతపు ఆకలి చావుల*
*గురించే మాట్లాడుకోవాలి*

(గాలికట్ట, పుట -36)

చేనేత పరిశ్రమ దెబ్బతినడం, ఆత్మహత్యలు నేపథ్యంలో కొన్ని వందల కవితలు వచ్చాయి. చేనేతకు సంబంధించిన పదజాలం కవితల్లో కనిపిస్తుంది. పడుగు పేక, ఆసు, కండె రాట్నం, లడీలు, నాడి, సుంచు ఇలాంటివి చూడొచ్చు. ప్రసాదమూర్తి రాసిన 'తాతకో నూలుపోగు' కవిత కూడా చాలా ప్రసిద్ధి పొందినదిగా చెప్పొచ్చు. డా॥ పత్తిపాక మోహన్ పవర్‌లూమ్‌లు, బిగ్‌నంబర్ నూలు ఎలా మోసం చేశాయో ఓ కవితలో ఇలా అంటారు.

*పవర్ లూం పస్తులు తప్పిస్తుందని / బిగ్‌నంబర్ నూలు కడుపు నింపుతుందని / పాలిస్టర్ ఆదుకుంటుందని / కన్న కలలన్నీ / కళ్ళెదుటే నాశనమయ్యాయి / నిన్న కబళించిన మిల్లు / ఇవాళ కాటేసిన కరెంట్*

-పత్తిపాక మోహన్

ముడిసరుకులు, పెట్టుబడి, మార్కెట్ ఈ సమస్యలు ప్రపంచీకరణ తెచ్చినవే. వీటిని సామాజిక సాంకేతిక పరిశోధనలతో ఎదుర్కోగలిగితే చేనేత అస్తిత్వం నిలబడుతుంది.

ప్రపంచీకరణ - ప్రైవేటీకరణ - సరళీకరణ. ఈ మూడు ఆర్థిక విధానాలు వృత్తులను విధ్వంసం చేస్తున్నాయి. వారు ఉపాధి కోల్పోయి వలసల బాట పడుతున్నారు. కులవృత్తిని నమ్ముకున్నవారి చిరునామా

గల్లంతు అవుతోంది. 'కులవృత్తికి సాటి లేదు గువ్వల చెన్నా' అనే మాట ఈ కాలంలో పనికి రాకుండా పోయింది.

### రజకులు

గ్రామాల్లో రజకుల అస్తిత్వం సామాన్యమైనది కాదు. దేవుడి పక్కన చమురు దివిటీలుగా / ఇస్త్రీ మడతలుగా, పెళ్ళిళ్ళకి, చావులకి వారి ప్రాధాన్యం గొప్పగా ఉండేది. వన్నెరోడా, చాకలోడా, మడేలోడా అని పిలిచిన భక్తితో సేవలందించేవాళ్ళు. సమాజంలో ఇంత సేవ చేసినా సాంఘిక వివక్షకు గురయ్యేవారు. కుల వివక్షకు గురయ్యేవారు. కె.గీత 'ద్రవభాష'లో

*పేరులో పెన్నిది లేని అతడు ఏ వూరు వెళ్ళినా చాకలే / బట్టలకు కొదువ లేని/ అతనికెప్పుడూ మిగిలేవి మాసిన గుడ్డలే / ఊరందరి దుర్గంధాన్ని పిండే/ సజీవ ఉతుకు యంత్రం అతడు*

వాషింగ్ మెషీన్లు, కరెంట్ ఐరన్ బాక్సులు వచ్చాక ఈ వృత్తి కూడా చిన్నచూపుకు గురైంది. ఈ పని మాత్రమే వచ్చిన వాళ్ళ జీవితాలు అగమ్యగోచరంగా ఉన్నాయి.

*సవర్తలూ స్నాతకాలూ అన్నప్రాసనలూ / అక్షరాభ్యాసాలు, శోభనాలూ సీమంతాలూ / వాళ్ళు లేకపోతే తోరణం లేని పందిళ్ళై చిన్నబోతాయి /*

అంటూ రజకుల అస్తిత్వాన్ని గురించి కవి సుధేరా మన ముందుంచారు.

ఎరికిసెట్టి రజక్, మెట్టా నాగేశ్వరరావు, కె.గీత, లకుమ జూపల్లి, ప్రేంచంద్ మొదలైనవారు రజకుల జీవితాల గురించి కవితలు రాశారు.

### కుమ్మరి

మట్టి నుండి మురిపెంగా కుండలు తయారుచేసే వాళ్ళను 'కుమ్మర్లు' గా పిలుస్తాం. సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర్లలో 'కుండ' పాత్ర ఉంది. ఎండాకాలం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం. కానీ మట్టిపాత్రల వినియోగం క్రమంగా తగ్గిపోతూ ఉంది. కోలపూడి ప్రసాద్ అనే కవి 'కరి మింగిన వెలపండు'లో ఈ పరిస్థితిని తెలిపాడు.

కుండల్ని నమ్ముకుని బతికిండు మా తాత / అమ్ముకుని బతికిండు మా నాయన / అమ్ముకుందామన్నా / నమ్ముకుందామన్నా / కుండే కరువైపోయింది నాకు

(పదునెక్కిన పాట, పుట-95)

ప్లాస్టిక్, స్టీలు, ఇత్తడి లాంటి పాత్రలు ప్రవేశించాక మట్టిపాత్రల్ని వాడేవాళ్ళు లేరు. ఒకప్పుడు కళకళలాడిన ఈ వృత్తిపని ఇవాళ 'మృత్కళ' అయ్యింది. నందిని సిధారెడ్డి కవితలో -

అతని చేతుల్తో / ఎన్ని ఇళ్ళల్లో దీపాలు వెలిగించిండు/ ఇప్పుడు తన దీపంలో నూనె ఇంకిపోయింది / ఎండలో నడిసొచ్చిన ఎందరి గొంతులో / చల్లటి నీళ్ళు జారినయి / ఎందరి ఇండ్లల్లో అన్నం ఉడికింది/ అతని కుండలో ఇప్పుడన్నం లేదు

(నాలుగు దశాబ్దాల నందిని సిధారెడ్డి కవిత్వం. పుట -327)

ప్రపంచీకరణ నేపథ్యంలో కుదేలైన 'కుమ్మరి' వృత్తి గురించి అన్నవరం దేవేందర్, వడ్కాపురం కృష్ణ, బాణాల శ్రీనివాస్, పి.విద్యాసాగర్ మొదలైనవారు రాశారు.

### మత్స్యకారులు

ప్రపంచీకరణ ప్రభావంతో యాంత్రీకరణ వేగం పెరిగిపోయింది. విదేశీ టెక్నాలజీతో మన సముద్ర జలాల్లోకి 'ట్రాలర్లు' ప్రవేశిస్తున్నాయి. అపారమైన మత్స్యసంపదను కొల్లగొడుతున్నాయి. సముద్రంపై పెట్టుబడిదార్ల చూపు పడింది. 'కోస్టల్ కారిడార్' మూలంగా తీరం వెంబడి మత్స్యకార్ల గ్రామాలు ఖాళీ చేయాల్సిన స్థితి. సిరికి స్వామినాయుడు 'సముద్రం మీద చందమామ' కవిత ద్వారా ఈ దుస్థితిని తెలిపారు.

*యిపుడీ వెన్నెల దీపాలారిపోతున్నాయి/ ఆశలు, బొమ్మిడాల్లా జారిపోతున్నాయి/ పాపం ! ఇన్నేళ్ళూ ఈ నీలి తెరల ఆకాశం/ వాళ్ళదే అనుకున్నారు కదూ !/ బతుకు హాయిగా సాగే పడవనుకున్నారు కదూ!/ రాబందుల రెక్కల చప్పుళ్ళకు/ దిక్కులేని సముద్రం మీద తీవ్ర వాయుగుండ మేర్పడిరది/ ఇక్కడి బతుకుల్ని దూరంగా విసిరిగొట్టడానికి/ తీరం మీద కల్లోల కెరటాలెగిసిపడుతున్నాయి*

-----

తీరం..యిపుడో తడారని శోకం

(మట్టిరంగు బొమ్మలు. పుట - 68)

జాలర్ల జీవితాలు సముద్రం మీద ఆధారపడ్డాయి. ప్రాజెక్టులు, అణువిద్యుత్ కేంద్రాలు మొదలైనవాటి పేరు మీద మత్స్యకార్ల జీవితాలు మునిగిపోతున్నాయి. వాళ్ళకి వేరే ఆధారం లేదు. సముద్రం వాళ్ళకి కూటి కుండ. పెరుగు రామకృష్ణ 'జాలరి' అనే కవితలో -

జాలరి / జలరహస్యం తెలిసిన రోబో / వల విసరడం వొక్కటే చేతనైన సముద్ర కూలీ

-----

*ఉప్పుటేరై సముద్రంలో తేలే మరబొమ్మకి / భూమి రాగమేం తెలుస్తుంది / బ్రతుకు భారం తప్ప/ మందుపాతర్ల కథలేం తెలుస్తాయి/ రొయ్యరాజుల రహస్యాలు తప్ప/ జలకాలుష్యంలో సర్వం కోల్పోయి/ స్వరం మరిచిన కోకిలలు వీళ్ళు/ జల దోపిడిలో దగాపడ్డ కేకలు వీళ్ళు*

(పూలమ్మిన ఊరు. పుట - 90)

మత్స్యకార్ల జీవన అస్తిత్వ గాథలు అనేకమంది కవులు వినిపించారు. విలపించారు. హెచ్చరించారు.

| | | |
|---|---|---|
| ఇంకా తీరం దాటలేదు | - | పాయల మురళీకృష్ణ |
| బలిపీఠం | - | సుంకర గోపాల్ |
| ఎన | - | ఎం.వెంకట్ |

చొక్కర తాతారావు, నునారవు రామచంద్రరావు, కె.ఆంజనేయకుమార్, డా॥ ఎండ్లూరి సుధాకర్, పెళ్ళూరు సునీల్ మొ॥న వారి కవితలు కూడా గుర్తించదగినవి.

### కమ్మరి

వ్యవసాయం ప్రధాన వృత్తి అయిన ఈ దేశంలో సమూహంలో ఒకరిపై ఒకరు ఆధారపడే పరిస్థితి. సజీవ సామూహిక జీవన సంస్కృతి. కొలిమి రైతన్నకు చెలిమి. పనిముట్లకు బలిమి. ఇప్పుడు కొలిమి నిప్పులు ఆరిపోతున్న దుస్థితి. యంత్ర సంస్కృతి ముప్పేట దాడి చేశాక కమ్మరి, స్వర్ణకారులు దయనీయ స్థితిలోకి వెళ్ళిపోయారు. గాల్లోకి సమ్మెట ఎత్తి కొట్టేవారు. నిప్పుల మీద కాలి ఎరుపెక్కిన కొడవళ్ళకు పదును

పెట్టేవాళ్ళు. నాగటికర్రుకు తప్పు వదిలించేవాళ్ళు. 'వర్ఖుల శివకుమార్' కొలిమి కార్మికుల దుస్థితిని ఇలా చెబుతారు–

*ఆ దిమ్మె మీద దెబ్బ దెబ్బకీ/ ఆత్మల్ని శుద్ధి చేసుకుంటాయి పనిముట్లు/ వాళ్ళకి వారసత్వం కొలిమి/ వాళ్ళకి సర్వస్వం కొలిమి/ ఓటర్ల లిస్టు మరణాల జాబితాలో/సజీవంగా మూల్గుతున్న/ కదిలే శవాల ప్రతినిధులు వాళ్ళు/ సౌకర్యాల సంక్షేమ పథకాలూ అంటని/ అనామక అవశేషాలు వాళ్ళు*

–వర్ఖుల శివకుమార్

వాళ్ళు పల్లెలో బతుకుతారు. కొలిమిలో కాగే లోహాలవాళ్ళు. వారి ఉనికి కూడా తీవ్ర సంక్షోభంలో ఉంది. ప్రత్యామ్నాయ అవకాశాలు లేవు. ఆడెపు లక్ష్మణ గారి మాటల్లో –

*మేము పల్లెవాసులం/ కొలిమి రాజెయ్యడం/సుత్తి దెబ్బలు కొట్టడం/ సానపెట్టడం/ అన్నీ పాతకాలపు జ్ఞాపకాలై/ కాడను పురుగు తొలిచినట్లైతది/ పాతకాలపు పద్ధతులు మారి/ ఆధునిక పరికరాలొచ్చి/ మా ఊపిర్ల ఉసురు తీస్తున్నాయ్/ చేతినిండ పనిలేక/ కడుపు నింద తిండి లేక/ తల్లడం మల్లడవుతున్నాం*

కొలిమి (కుమ్మరి) నేపథ్యంలో వారి పరిస్థితిని చిత్రీకరిస్తూ చాలా కవితలు వచ్చాయి. అద్దంకి శ్రీనివాస్, హరగోపాల్, సిద్దెంకి యాదగిరి, దెంచనాల విజయకుమారి, పెరుగు రామకృష్ణ రాసిన కవితలు పేర్కొనదగినవి. స్వర్ణకారుల వృత్తి అస్తిత్వాన్ని తెలుపుతూ బాణాల శ్రీనివాస్ వ్రాసిన 'కుంపటి' చాలా ప్రసిద్ధమైన కవిత. మందరపు హైమావతి రాసిన 'జ్యుయలరీ షాపు' కవిత ద్వారా మార్కెట్‌లోకి యంత్రాలు ప్రవేశించాక 'జ్యుయలరీ షాపు ముందు' స్వర్ణకారులు కూలీలుగా మారిన విధానం మనకు కనిపిస్తుంది.

*మార్కెట్లో ప్రవేశించిన/ కొత్త కొత్త యంత్రాలు/ పనివాళ్ళ చేతివేళ్ళ కత్తెరలు/ కప్పను మింగే సర్పంలా/ కాలం పరిణమించిన వేళ/ ప్రపంచీకరణ నేపథ్యంలో/ కులవృత్తుల కోటగోడలు/ కుప్పకూలుతున్న విషాద దృశ్యం*

స్వర్ణకార వృత్తి అస్తిత్వ నేపథ్యంలో పి.విద్యాసాగర్, శిలాలోలిత రాసిన కవితలు కూడా ప్రసిద్ధమైనవి.

## దూదేకులు

దూదిని ఏకి, ఆ దూదితో సుతిమెత్తని పరుపులు, దిండ్లు చేసేవాళ్ళు దూదేకులు. కమాను భుజం మీద పెట్టుకొని వీధుల్లో తిరుగుతూ ఈ వృత్తి ద్వారా పొట్టను పోషించుకునేవారు.

మార్కెట్ మాయాజాలంలో కొత్త కొత్త మోడల్స్, హోదా పేరు మీద 'పరుపుల వ్యాపారం' ఆధునికమైంది. వ్యాపార ప్రకటనలు వల వేసి మరీ పరుపుల పట్ల ఆకర్షితుల్ని చేస్తున్నారు. కురలాన్, రిలాక్స్ ఆన్, స్లీప్‌వెల్, సెంచురీ మాట్రిసెస్...ఇలా పేర్లు పెట్టుకొని మరీ పడక గదుల్లోకి వాలిపోతున్నారు. వేలాదిమంది దూదేకుల కులస్తులు ఉపాధి కోల్పోయారు. ఇలాంటి పరిస్థితిని ఆవిష్కరిస్తూ ఖాజా 'నరం తెగిన కవాను' అనే కవిత రాశారు.

సెంచురీ నా కంచం లోంచి/ అన్నం ముద్దని తన్నుకుపోయింది/ పాలిష్డ్ స్పాంజ్ పిల్లో/ నా గొంతు మీద/ తన సుతిమెత్తని చేతులుంచి/ నులుముతుంది

-----

నైపుణ్యం నిండిన నా చేతి వేళ్ళ మీద/ ఒక విదేశీ ఫోమ్ పాదం/ నాడా బూట్లతో నృత్యం చేస్తోంది

(ఫత్వా – ఖాజా)

## మంగలి

'నాయీ బ్రాహ్మణులు' మన భారతీయ సంస్కృతిలో విడదీయరాని బంధం వీరిది. క్షౌరవృత్తి, పెళ్ళి, దేవుళ్ళ ఊరేగింపుల్లో సంగీత వాయిద్యాలు వీరి సేవ. పెట్టుబడి పెట్టగలిగిన ధనికవర్గం మార్కెట్ సంస్కృతిలో దుకాణాలు పెడుతున్నారు. గ్రామాల్లో పని దొరక్క వీరు దినకూలీలుగా మారుతున్నారు. ఈ వృత్తిలో 'బ్యూటీపార్లర్' పేరుతో పెట్టుబడిదారీవర్గం చొచ్చుకుపోయింది. కట్టా వరదయ్య అనే కవి క్షౌరవృత్తిదారుల స్థితిగతులను 'కలను సానబెట్టుకుంటూ' అనే కవితలో తెలిపాడు.

మీ రోడ్లు ఒళ్ళు విరుచుకుని పక్కకి చేతులు చాపితే/ కూలిపోయ్యేది నా షాపులే/ మీ విదేశీ యంత్రాలు విజిలేసి రంగంలోకి దూకితే/ విరిగి పడేది నా కత్తెర్లు గోరుగల్లులే/ కత్తెర చేతికిచ్చి నన్ను శాశ్వతంగా/ అడకత్తెరలో బిగించిన లోకమా/ నా వృత్తే నన్ను వేలంపాటలో నిలబెడుతుందని తెలుసు.

బ్రాండెడ్ ఎయిర్ సెలూన్ షాపులు ప్రవేశించాయి. ఇందులో క్షౌరవృత్తిదార్లు కూలీలుగా మిగులుతున్నారు. తమ పనిముట్ల స్థానంలో విదేశీ పరికరాలు ప్రవేశించాయి. ఇలాంటి విపరీత పోకడలను నిలదీస్తూ వనపట్ల సుబ్బయ్య 'రా ! అంబానీ రా' అనే కవితలో –

సెలూన్ వచ్చినప్పుడే / మా నాన్న అశిపె పోయింది

----

ఊరు పొమ్మంటే/ ఎగబడి వచ్చినవాళ్ళు / నగరం నడిబొడ్డుకు చేరుకున్నవాళ్ళు/ అనుపములు, అనూష్‌లు/నడమంత్రపు దొరసానిత్వాని/ నా మంగలిపని ఎంగిలయ్యింది

(కుర్చీ. పుట–129)

ప్రభుత్వాలు కార్పొరేట్ క్షౌరశాలల్ని నియంత్రించాలి. దేవాలయాల కళ్యాణకట్టల్లో ఉద్యోగ భద్రత కల్పించాలి. నగరాల్లో మంగలివారికి స్థలాలు కేటాయించి, ఆదుకోవాలి. లేదంటే వీరి సంక్షేమం గాలిలో పెట్టిన దీపం అవుతుంది.

## గౌండ్ల అస్తిత్వ కవిత్వం – ప్రపంచీకరణ

ప్రపంచీకరణ పురుగు ఈ కులవృత్తి పాదులను కూడా నాశనం చేసింది. కల్లుగీత పరిశ్రమను దెబ్బతీస్తూ ప్రభుత్వాలే రకరకాల బ్రాండ్ల మద్యాలను అమ్ముతున్నాయి. డా॥ ప్రసాదమూర్తి రాసిన నాన్న చెట్టు, కొంపల్లి వెంకట్ రాసిన 'ముస్తాదులు కదులుతున్నాయి', ఈ.రాఘవేంద్ర రాసిన 'కల్లంచల బువ్వ' లాంటి కవితలు గీతకార్మికుల నేపథ్యాలను, కష్టాలను తెలుపుతాయి.

గీతకార్మికుడు తాటివనంలో ఊగే మొక్కలాంటివాడు. చెట్టు ఎక్కి దిగడం దినదినగండం. వీపు నిండా 'మోపు' వాతల చారికలు ఉంటాయి. అలాంటివాడికి

అప్పుడప్పుడు / ప్రపంచీకరణే నేపథ్యంగా/ కల్లుకుండల కావడి బద్ద / రామబాణమై వీపున దిగుతుంది

----

*కష్టాల కడలిలో దుఃఖ కెరటమై విరిగిపోతాడు/ బతకడానికి కులవృత్తిని నమ్ముకున్న వాడిని / అటో…ఇటో…తేల్చేది ప్రపంచీకరణే*

– ఆడెపు లక్ష్మణ్

అగపాటి అరుణ్ గౌడ కులవృత్తి మీద ప్రపంచీకరణ చూపిన తీవ్ర ప్రభావాన్ని గురించి కలత చెందాడు. మొగురం మొగులును తాకుతున్నా అదరవు

*గుజిని కాళ్ళకు/మోకు జబ్బలకేసుకొని/తాటిని తన్నే మొనగాడా/ నీ తలనే తన్నే మోసం రా గీ ప్రపంచీకరణ*

(సమూహం. పుట – 55)

చితికిపోతున్న గ్రామీణ జీవితం, నలిగిపోతున్న కులవృత్తుల సామాజిక సంఘర్షణలతో రగులుతూ ఉంది. కులవృత్తులు ఇవాళ కాలసర్పాలై కాటేస్తున్నాయి.

*పల్లెబతుకు మాది పాడుగాను/ ఎక్కవలయు తాడు ఎండవానలకోర్చి / రాత బాగలేదు గీత పనికి / అమృతమ్మునిచ్చి అగుచుంటి మృతుడను/పల్లెబతుకు మాది పాడుగాను*

– ఏనుగు నరసింహారెడ్డి

ఈ అస్తిత్వ వేదనలు పలికిన వాక్యాల్లో కుల పునాదులకు సంబంధించిన పదజాలం కవులు వాడారు. ఈ పదాలు కూడా త్వరలోనే చిరునామా లేకుండా పోయే ప్రమాదం కూడా ఉంది.

### బి.సి. కథ – ప్రపంచీకరణ

సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ ఈ భావజాలంతో ప్రపంచీరణ శరవేగంతో ప్రవేశించింది. బి.సి. సేవాకులాలు చిన్నాభిన్నమైపోయాయి. బహుళజాతి కంపెనీలు విస్తరించాయి. మార్కెట్ మనుషులను సైతం సరుకుగా చూడటం మొదలుపెట్టింది. కులవృత్తులు ఆదరణ లేకుండా పోయాయి.

### చేనేత అస్తిత్వం – ప్రపంచీకరణ

చేనేత చాలా ప్రాచీనమైన వృత్తి. చేనేత వృత్తి ఎంత నిరాదరణకు గురయ్యిందో, వారి జీవితాలు ఎంత ధ్వంసం అయ్యాయో బి.ఎస్.రాములు రాసిన కథ 'ప్రశాంతం'. బతుకు పయనం కథా సంపుటిలో ఉంది. 'ఎల్లయ్య' పాత్ర పడే సంఘర్షణ నుంచి కథ నడుస్తుంది. మిల్లు బట్టలు, రెడీమేడ్ బట్టలు ఇతర దేశాల నుంచి ఇక్కడికి వచ్చి చేనేత బట్టలకు పోటీగా నిలబడ్డాయి. జనం వాటి మీద మోజు పడ్డారు. ఈ పరిస్థితుల్లో చేనేత కార్మికులు ఆత్మహత్యల బాట పట్టడం తీవ్ర విషాదం.

ఆడెపు లక్ష్మీపతి రాసిన 'త్రిభుజపు నాలుగో కోణం' కథ ప్రపంచీకరణ నేపథ్యంలో చేనేత బతుకులు చిద్రమైపోవటాన్ని చెప్పిన కథ. ఇందులో బతుకులు చిద్రం కావడంలో వలసబాట పట్టిన వారి జీవితాల్లో ఆర్థిక దుస్థితి ప్రవేశిస్తుంది. డబ్బు కోసం దూరప్రాంతాలకు వెళ్ళినవారి జీవితాల్లో అనుబంధాలు దెబ్బతింటాయి. మానసిక దూరం పెరుగుతుంది. చేనేత కార్మికుల ఆర్థిక దుస్థితి నాలుగో కోణంగా కనిపిస్తుంది. అలాగే బి.వి.ఎన్. స్వామి రాసిన 'కుంతనం' కథ మరమగ్గాల వల్ల నేత మగ్గాలు ఎంత ఘోరంగా ధ్వంసం అయ్యాయో చెబుతూనే వారి వంశచరిత్రను కూడా చెబుతాడు. ఇంకా –

| | |
|---|---|
| కొక్కుల భాస్కర్ | – తెగిన పోగు |
| సరయు శేఖర్ | – బొమ్మల చొక్కా |
| దార్ల రామచంద్ర | – బతుకుధార |
| జూకంటి జగన్నాథం | – వైపని |
| జాతశ్రీ | – చిరునామా |
| వెల్దండి శ్రీధర్ | – మరణ మృదంగం |
| వెతా చంద్రయ్య | – చిలకపచ్చ చీర |

మొ॥న కథల్ని చూడొచ్చు.

### విశ్వకర్మల అస్తిత్వం – ప్రపంచీకరణ

బండి చక్రాలతో చరిత్రను నడిపిన శక్తి వీరి సొంతం. ఇంటికి తలుపులు, దర్వాజాలు ప్రసాదించిన కులం ఇది. ఇప్పటి యాంత్రీకరణ కొట్టిన దెబ్బకు ఈ మనుషులు కుదేలైపోయారు. కూలీలుగా మిగిలారు. కమ్మరి, వడ్రంగి, శిల్పి, కంసాలి వీరంతా ఇందులో ఉపకులాలు.

సుంకోజి దేవేంద్రాచారి అన్నంగుడ్డ, జాతశ్రీ కుట్ర, ఆ గౌరునాయుడు రాసిన ఆసరసాల మొదలైన కథలు వృత్తుల విధ్వంసం ప్రపంచీకరణ విశ్వరూపంతో ఎలా జరిగిందో ఈ కథల్లో చూడొచ్చు. ఆసరసాల కథ ఉత్తరాంధ్ర మాండలికంలో ఉంటుంది. ఒక తరం పోయాక, తరువాతి తరం సాంస్కృతిక విధ్వంసానికి ఎలా గురైందో ఈ కథలో చూడొచ్చు. ఈ కథలో వీరాచారనే వడ్రంగి జీవితం ప్రపంచీకరణ కారణంగా ఎలా విధ్వంసానికి గురి కాబడుతుందో తెలుసుకోవచ్చు.

సుంకోజి దేవేంద్రాచారి కథ 'అన్నం గుడ్డ' వడ్రంగుల కుల మూలాల్ని స్పృశించిన కథ. గ్రామాల్లోకి ట్రాక్టర్లు, పైరుకోత మిషన్లు లాంటి యంత్రాలు ప్రవేశించాక వడ్రంగి వృత్తి ఎలా ధ్వంసం అయ్యిందో ఈ కథ తెలుపుతుంది. కథ చివరిలో అన్నంగుడ్డ ఎగిరిపోవడాన్ని రచయిత ప్రతీకగా వాడుకున్నాడు. ప్రపంచీకరణ తెచ్చిన యంత్రాలు కారణంగా వృత్తిపనులు, అస్తిత్వ మూలాలు ఎగిరిపోవడాన్ని రచయిత చిత్రీకరించారు. అలాగే,

| | |
|---|---|
| కుద్ర | – జాతశ్రీ |
| కులకశ్పి | – నందిని సిధారెడ్డి |
| కొలిమి | – వి.ఆర్.రాసాని |
| నేలమీది జాబిలి | – శిరంశెట్టి కాంతారావు |
| గూడు చెదిరిపోయింది | – దిలావర్ |

### గౌడ కుల అస్తిత్వం – ప్రపంచీకరణ

1991లో ప్రవేశించిన ప్రపంచీకరణ గీతకార్మికుల జీవితాల్లో తీవ్ర ప్రభావం చూపుతుంది. గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా ప్రభుత్వ చర్యలు వుండేవి. ఆర్థిక సరళీకృత విధానాలు తెచ్చిన ముప్పు వీరి అస్థిత్వాన్ని దెబ్బకొట్టింది. 'జాతశ్రీ' రచించిన కథ 'అంతర్ముఖం' కథ ఈ పరిస్థితుల్ని మన కళ్ళముందు వుంచుతుంది. విదేశాల నుంచి వచ్చిన మద్యం కల్లుగీత కార్మికుల జీవితాలను నాశనం చేసింది. నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ రాసిన 'కుట్ర' కథలో లిక్కర్ తాగి బలియైన కల్లుగీత కార్మికుడి జీవితం కనిపిస్తుంది. నెరెల్ల శ్రీనివాస్ గౌడ్ రాసిన 'కాలసర్పం' కథలో 'సుధాకర్' అనే గీత కార్మికుడు వలస వెళ్ళి, అక్కడ మోసపోయి ఆర్థిక భారంతో తిరిగివచ్చి మళ్ళీ గీత గీయడం ప్రారంభిస్తాడు. విదేశీ మద్యం మోజులో కల్లు తాగే వారి సంఖ్య తగ్గి, సుధాకర్ కల్లును

క్రింద పారబోస్తాడు. ఒకరోజు తాటిచెట్టు నుంచి జారి కాలు పోగొట్టుకుంటాడు. అలాగే కూతురు రాంరెడ్డి రాసిన 'వంకతాడు' కథ గీతకార్మికుల కుటుంబాల్లోని ఆచార, వ్యవహారాలను తెలియజేస్తూనే, ప్రపంచీకరణ కల్లుగీత కార్మికుల జీవితాలతో ఎలా ఆట ఆడిందో చూపుతుంది.

వ్యాసం నిడివిని దృష్టిలో ఉంచుకొని, మరికొన్ని కథలు రచయితల పేర్లు మాత్రం ఉదహరిస్తాను. ఇవి ప్రపంచీకరణ నేపథ్యంలో వృత్తి జీవిత విధ్వంసాన్ని చెప్పే కథలు

**(1) నాయీబ్రాహ్మణ వృత్తి :**

1. సజీవం - జిల్లేళ్ళ బాలాజి
2. ఓడోలుడు - డా॥ ఎ.రవీంద్రబాబు
3. శ్రీకనకమహాలక్ష్మి ఎయిర్ కటింగ్ సెలూన్ -అల్లం శేషగిరిరావు

**(2) రజక వృత్తి కథలు - ప్రపంచీకరణ :**

1. అమెరికా రాజయ్య - నక్కా విజయరామరాజు
2. బలం - సదానంద్ శారద
3. ఉసుల్లు - కె.వి.నరేందర్
4. కర్రావు - కాట్రగడ్డ దయానంద్
5. మడేలయ్య మనసు - కాలువ మల్లయ్య
6. కాలిన గూడు - జి.వెంకటకృష్ణ
7. పరవ - వింజమూరి మస్తాన్ బాబు

**(3) మత్స్యకార వృత్తి :**

1. ఉమ్మెత్తపూలు - శిరంశెట్టి కాంతారావు
2. సిమేన్ - అద్దేపల్లి ప్రభు
3. సిన్నాన్న మన మేటి సైలేమా - అద్దేపల్లి ప్రభు

**(4) కుమ్మరి కథలు :**

1. ఇత్తడి కథలు - నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్
2. కాగుబొత్త - పెద్దింటి అశోక్ కుమార్
3. మట్టి మనిషి - యెన్నం ఉపేందర్

**(5) బి.సి. సాహిత్యం - నవల - ప్రపంచీకరణ :**

చేనేత కార్మికుల కష్టాల్ని, తీరుతెన్నుల్ని వివరిస్తూ, ప్రపంచీకరణ మూలంగా బడుగుజీవుల జీవన విధ్వంసాలను ఎన్నింటినో సంఘటనాత్మకంగా చూపిన నవల 'చిలకలంచు జరీ కోక'. దీనిని యర్రమిల్లి విజయలక్ష్మి రచించారు. చేనేత కార్మికుల కుటుంబాల అస్తిత్వాన్ని తెలుపుతూ, శ్రామికుల జీవితాల్లోని చీకటి కోణాల్ని, కులవృత్తిని నమ్ముకుని ఆర్థిక విధ్వంసాల మధ్య జీవితాలను భారంగా వెళ్ళబుచ్చుతున్న నేత కార్మికుల వెతలను చక్కగా ఈ నవల ఆవిష్కరిస్తుంది. డా॥ కాలువ మల్లయ్య రచించిన 'గువ్వలచెన్న' నవల కూడా ఈ కోవలోకే వస్తుంది.

గౌడల జీవనాన్ని, ప్రపంచీకరణ ఫలితంగా వారి మూలాల్లో వచ్చిన మార్పుల్ని చెప్పిన నవలలను రాసినవారు నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్. ఆయన రాసిన బతుకుతాడు, దుల్దుమ్మ, కల్తీబతుకులు నవలల్లో ఈ సందర్భాలను గమనించవచ్చు.

అలాగే డా॥ వి.ఆర్.రాసాని గారు రచించిన 'పరస' నవల ప్రపంచీకరణ ఫలితంగా కనుమరుగైపోతున్న కులవృత్తులు, వాటి అస్తిత్వాల గురించి, కళాకారుల ఇబ్బందులను గురించి తెలియజేస్తుంది.

గంగిరెద్దుల్ని పల్లెల్లో ఆడించే విధానం, వాళ్ళ వేషభాషలు, నమ్మకాలు, పశువుల గడ్డి కోసం పడే అగచాట్లు, కనుమరుగౌతున్న గంగిరెద్దుల ఆట మొదలైన సాంస్కృతిక, జీవన పోరాట దృశ్యాలను ఇందులో చిత్రీకరించారు. అలాగే 'బతుకాట' నవలలో కూడా వి.ఆర్.రాసాని కళాకారుల జీవితాలను గురించి చర్చించారు. టీవీలు, సినిమాలు ప్రభావంతో వీధి నాటకాలు ఆడేవారి జీవితాలు ధ్వంసం కావడం గురించి రాసిన నవల 'బతుకాట'.

పి. నాసరయ్య రాసిన ఉతికేసిన బతుకులు నవల 'రజకుల' అస్తిత్వ మూలాలతో వచ్చిన రచన. పూర్వం గ్రామాలలో ప్రధానమైన పాత్ర పోషించిన చాకలివారు కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల క్రమంగా కనుమరుగయ్యారు. వారి జీవితాలను ఇతివృత్తంగా తీసుకొని రాసిన నవల 'ఉతికేసిన బతుకులు'. అలాగే జి.ఎస్.చలం రాసిన 'రేవు' నవల కూడా రజకుల అస్తిత్వం గురించి తెలిపిన నవల.

ప్రపంచీకరణ ప్రభావానికంటే ముందే (1975లో) కుమ్మరి వృత్తి నేపథ్యంలో రాసిన నవల 'సుషుప్తి'. దీనిని మాదిరెడ్డి సులోచన గారు రచించారు. గ్రామీణ కులవృత్తుల అస్తిత్వాలు ఛిద్రం కావడం గురించి ఇందులో వుంది.

అత్యంత ప్రాచీనమైన 'తోలుబొమ్మలాట' ఆడే కళాకారుల పునాదులు కదిలిపోయి, శిథిలమైన పరిస్థితిని చూపిన నవల 'తోలుబొమ్మలాటలు'. దీని రచయిత సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి. తమ కళను పల్లెల దరికి రాకుండా చేసింది టీవీలే అని ఈ నవలలో ఒక పాత్ర వాపోతుంది. తోలుబొమ్మలాట నిరాదరణకి గురి కావడానికి గల కారణాలను రచయిత సప్రమాణంగా చిత్రీకరించారు. 'సంకెళ్ళు తెగాయి' అనే నవల సుజాత రెడ్డి గారు రచించారు. ఇందులో నాయీ బ్రాహ్మణుల వృత్తి జీవిత చిత్రణ, ఆటుపోట్లు కనిపిస్తాయి.

ఇంకా కొన్ని నవలలు వచ్చినప్పటికీ అవి వృత్తి జీవితాలను కుల అస్తిత్వాలను చెప్పాయి. 'ప్రపంచీకరణ' మూలంగా దెబ్బతిన్న కుల అస్తిత్వాలను గురించి చర్చించిన నవలలను పేర్కొనడం జరిగింది.

**ఆధార గ్రంథాలు :**

1. వచన కవిత్వం - ప్రపంచీకరణ ప్రతికూలనం -అముద్రిత పరిశోధనా గ్రంథం
2. బల్లకట్టు (కవితా సంపుటి) - భగ్వాన్
3. కథ (1990-2014 సం॥) - వాసిరెడ్డి నవీన్
4. గాలికట్ట (కవితా సంపుటి) - పి.విద్యాసాగర్
5. సిమేన్ (కథా సంకలనం) - ఎ.ప్రభు
6. కవిత్వం - ఒక సామాజిక చైతన్యం - డా. రాధేయ
7. తెలుగు సాహిత్యంలో వృత్తిచైతన్యం - డా. లంకా వెంకటేశ్వర్లు
8. నీలి గోరింట - మందరపు హైమావతి

తెలుగు శాఖాధిపతి,
డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం

గోవిందు సురేంద్ర
9866008662

# ఆధునిక తెలుగు సాహిత్యంలోని నాటకాలు-నాటక కర్తలు-చారిత్రక దృక్పథం

**ఆ**ధునిక సాహిత్య పోకడలలో నాటకం బాగా ప్రసిద్ధి చెందిన రూపం. నాటకాన్ని మనం అవగాహన చేసుకునే ముందు దీని ఆవిర్భావం ప్రాచీన సాహిత్యంలోనే రూపాంతరం చెందినదిగా చెప్పవచ్చు. ప్రాచీన సాహిత్యంలోని సంస్కృత నాటకంతో ఆధునిక సాహిత్య తెలుగు నాటకాన్ని పోల్చిచూస్తే చారిత్రకకళ అయిన నాటకరంగం ఎంతో నిరాదరణకు గురైనదని చెప్పవచ్చు. అయినా నాటకరంగ రచయితలు అనేక నాటకాలను రచించి తెలుగు ఆధునిక నాటకానికి సాహిత్య ప్రక్రియలో విశేషమైన స్థానాన్ని కల్పించడం జరిగింది. ఆధునిక తెలుగుసాహిత్య ఆరంభంలో స్వదేశీ అభిమానంతో బాగా ప్రచారంలో ఉన్న ముఖ్యమైన నాటకంగా యక్షగానం లేదా వీధినాటకాన్ని పేర్కొనవచ్చును. ఈ నాటకంలో మనం పద్య, గాన నృత్యరూపక విశేషాలను గమనించవచ్చు. దక్షిణ ప్రాంత నాటకశైలిలో ఇలాంటి సాహిత్యాన్ని మనం చూడవచ్చు. ఈ నాటక సాంప్రదాయ గమనాన్ని ప్రస్తుతం కూచిపూడి భాగవతంలో కూడా చూడవచ్చు. సంస్కృత నాటకాలలో ఈ స్వదేశీ నాటకరచనను మనం చూడలేదు.

ఆధునిక తెలుగు సాహిత్య ఆవిర్భావాన్ని పరిశీలిస్తే, తెలుగు నాటకరంగంపై షేక్స్పియర్ ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది. ఆధునిక తెలుగు నాటక ఆవిర్భావాన్ని మూడు రకాలుగా విభజించవచ్చును. అవి.

1) అనుకరణ లేదా అనువాదం (సంస్కృతం, ఆంగ్ల భాషల నుండి)
2) చారిత్రక నాటకాలు.
3) సాంఘిక నాటకాలు మరియు పౌరాణిక నాటకాలు

**అనుకరణ లేదా అనువాద నాటకాలు (సంస్కృతం):**

మొట్టమొదటి సంస్కృత అనువాద నాటకంగా కాళిదాసు సంస్కృతంలో రచించిన 'అభిజ్ఞాన శాకుంతలము'ను చేప్పవచ్చు. దీనిని ఎం. శేషాచార్య తెలుగులోకి అనువదించి క్రీ.శ. 1870 సంవత్సరంలో ప్రచురించారు. క్రీ.శ.1872 లో 'నరకాసుర విజయ వ్యాయోగం' అనే నాటకాన్ని కొక్కొండ వెంకటరత్నం పంతులు తెలుగులోకి అనువదించి ప్రచురించారు. ఇదే కాలంలో సుమారు క్రీ.శ. 1875లో కాళిదాసు శాకుంతలం సంస్కృత నాటకాన్ని పరవస్తు రంగాచారి అసంపూర్తిగా అనువదించి ప్రచురించారు. వీరేశలింగం పంతులు కూడా శాకుంతలాన్ని అనువదించి వివేకవర్ధిని అనే తన పత్రికలో ప్రచురించారు. తరువాత చివరిగా దీనిని ప్రత్యేకమైన పుస్తకంగా అచ్చువేయించడం జరిగింది. తరువాత కాలంలో నాటకరంగానికి సంబంధించి చాలా అనువాదాలు వచ్చాయి. వీటిలో వడ్డాది సుబ్బారాయుడు క్రీ.శ.1886 సంవత్సరంలో 'వేణీ సంహారము', వావిలాల వాసుదేవశాస్త్రి గారు క్రీ.శ.1889లో 'ఉత్తర రామచరిత్ర', సుసర్ల అనంతరావుగారు క్రీ.శ.1890లో 'ముద్రా రాక్షసం', తిరుపతి వేంకట కవులు క్రీ.శ.1889లో 'మృచ్ఛకటికం' మరియు 'బాలరామాయణం', దాసు శ్రీరాములుగారు క్రీ.శ.1902లో 'మహావీరచరిత్ర' మరియు 'మాలతీమాధవం' అనే సంస్కృత నాటకాలను తెలుగులోకి అనువదించారు. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో అనువాదంపై ఎంతో మక్కువతో ఒకే గ్రంధనాటకాన్ని పలువురు వారి వారి ప్రక్రియలలో అనువదించేవారు. ఒక్క కాళిదాసు శాకుంతలం నాటకాన్ని సుమారు పదిమంది సాహిత్యకారులు తెలుగులోకి అనువదించారు. ఈ సంస్కృత నాటకాలలో తెలుగులోకి అనువదించిన 'శాకుంతలం', 'వేణీ సంహారం' మరియు 'మృచ్ఛకటికం' వంటి నాటకాలు ప్రజాదరణను పొందాయి. క్రీ.శ. 1912లో టి.గణపతిశాస్త్రి గారు భాషా నాటకాలను కనిపెట్టారు. ఇతను చాలా నాటకాలను తెలుగులోకి అనువదించారు. ఈ అనువాద ప్రక్రియలో మానవల్లి రామకృష్ణ కవి మరియు చిలకమర్తి లక్ష్మీ నరసింహం ముఖ్యులు.

**అనువాద నాటకాలు (ఇంగ్లీష్ ):**

క్రీ.శ.19వ శతాబ్దం నుండి మన ఆధునిక తెలుగు నాటక రచయితలు ఇంగ్లీష్ భాషలోని నాటకాలను తెలుగులోనికి అనువదించడం ప్రారంభించారు. షేక్స్పియర్ ఆంగ్లంలో రచించిన 'జూలియస్ సీజర్' అనే నాటకాన్ని వావిలాలగారు క్రీ.శ.1875లో మొదటగా తెలుగులోకి అనువదించారు. గురజాడ శ్రీరామమూర్తి మరియు కందుకూరి వీరేశలింగం 'మర్చంట్ ఆఫ్ వెనీస్' అనే ఇంగ్లీష్ నాటకాన్ని తెలుగులోనికి అనువదించారు. క్రీ.శ. 1890లో 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' అనే ఇంగ్లీష్ నాటకాన్ని 'చమత్కార రత్నావళి' అనే పేరుతో కందుకూరి వీరేశలింగం రాజమండ్రిలో వేదిక నాటకంగా తెలుగులోకి మొదటగా అనువదించారు గనుక, బహుశా ఇదే తెలుగులో అనువదించిన వేదిక నాటకం. తర్వాత పానుగంటి షేక్స్పియర్ 'ట్వెల్త్ నైట్' ను తెలుగులోకి అనువదించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆంగ్లం నుండి తెలుగులోకి చాలా అనువాద ప్రక్రియలు జరిగాయి.

**చారిత్రక నాటకాలు:**

కె. శ్రీనివాసరావు చారిత్రకనాటకం పాత్రధారులలో నాయకుడిగా, నాటకకర్తగా బాగా గుర్తింపు పొందారు. 'పృధ్వీరాజ్' మరియు 'విజయనగర సామ్రాజ్యపట్టతనము' అనేవి బాగా ప్రసిద్ధిచెందిన నాటకాలు. ఈ రెండు కూడా మంచి విషాదగాధలతో కూడిన నాటకాలు. ప్రాచీన సాహిత్య నాటకాలతో పోలిస్తే ఇవి చాలా క్రొత్తగా ఉంటాయి. మిగతా చారిత్రక నాటకాలలో కె. సుబ్బారావు 'రోషనార'

నాటకం, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి 'బొబ్బిలి యుద్ధం' నాటకం, ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ 'రసపుత్ర విజయము', గుండిమేడ వేంకట సుబ్బారావు 'ఖిల్జీ రాజ్య పతనము' అను నాటకాలు ముఖ్యమైనవి.

**పౌరాణిక నాటకాలు మరియు సాంఘిక నాటకాలు :**

భారతీయ పురాణాలు తెలుగుసాహిత్య రచయితలకు తరగని సంపదవలె నాటకాలను అందించాయి. పురాణాలలోని కథలను ఆధారం చేసుకొని నాటక రచయితలు అనువాద ప్రక్రియ ద్వారా స్వంత రచనలను చేపట్టారు. ధర్మవరము కృష్ణమాచార్యులు పురాణ నాటకాలను రచించే వారిలో ముఖ్యులు. 'చిత్రనిలయం' 'విషాద సారంగధర', 'ప్రహ్లాద', మరియు పాదుకాపట్టాభిషేకం' వంటివి ముఖ్యమైన పౌరాణికనాటకాలు. సాహిత్య ప్రక్రియలో వేదం వేంకటరాయశాస్త్రి గారు తెలుగు నాటకకర్తలలో అందరిలోకెల్లా ముఖ్యులు. తిరుపతి వేంకటకవులు పౌరాణిక నాటక రచనలో ఆరితేరినవారు. మహాభారతాన్ని ఆధారం చేసుకొని ఎన్నో విలువైన నాటకాలను రచించారు. చిలకమర్తివారి 'గయోపాఖ్యానము', పానుగంటి వారి 'రాధాకృష్ణ', బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి 'సత్యహరిశ్చంద్ర', ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ గారి 'రసపుత్ర విజయము' ఇంకా మరికొన్ని ముఖ్యమైన పౌరాణిక నాటకాలు ఆంధ్రదేశంలో పేరెన్నిక గలిగినవి.

గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' తెలుగులో వెలువడిన మొదటి సాంఘిక నాటకం. ఈ నాటకంలో యువతులను కొనుగోలు చేసి వారిని వృద్ధులకు ఇచ్చి వివాహం చేసే విధానాన్ని అపహాస్యం చేయడం, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించడం లాంటి నాటకాలు ఆనాటి ప్రజలను విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఇదే కోవలో వీరేశలింగం గారి 'బ్రహ్మ వివాహము' మరియు పానుగంటి లక్ష్మీ నరసింహంగారి 'కాంతాభరణం' చెప్పుకోదగ్గ నాటకాలు. తరువాత కాలంలో ఏక పాత్రాభినయ నాటకాలలో, దృశ్యరూపక నాటకాలు కూడా ఎంతో ఆదరణ పొందాయి. ముద్దు కృష్ణ 'అశోకం' నాటకం, గుడిపాటి వేంకటాచలం 'హరిశ్చంద్రుడు', 'శశాంక', 'చిత్రాంగి', నాటకాలు, ఆమంచర్ల గోపాలరావు 'హిరణ్యకశిపుడు' నాటకం, త్రిపురనేని రామస్వామి 'సాంబకుడు' నాటకం, ఆత్రేయ 'గాలివేడలు', అనిశెట్టిసుబ్బారావు 'మా వూరు' నాటకం, డి.వి. నరసరాజు 'నాటకం', అవసరాల వేంకటనరుసు రచించిన 'జ్యోతిర్మయి' నాటకం, కొర్లపాటి శ్రీరామమూర్తి 'సమత' మరియు 'నటన' అను నాటకాలు, అవసరాల సూర్యారావు 'పంజరము' గోపీచంద్ 'తత్వమసి' ముఖ్యమైనవి. నార్ల వెంకటేశ్వర రావు ఏకపాత్రాభినయంతో రచించిన నాటకాలలో ఆంధ్రుల ఆచార సాంప్రదాయాలు ఎన్నో మిళితమైవున్నాయి. మల్లాది విశ్వనాథ కవి గారి హాస్యం మరియు వ్యంగ్యం నాటకాలుగా 'దొంగనాటకము' మరియు 'వారసులు' చాలా ప్రసిద్ది పొందాయి. ఆంధ్రదేశంలోని ఆధునిక తెలుగు నాటకాలు క్రీ.శ. 1928 నుండి 1958 వరకు సుమారు రెండు వేల నాటకాలను వివిధ ఆధునిక కవులు రచించి తెలుగు భాషానాటక రంగానికి విశిష్ట సేవలు అందించారు.

వ్యాస రచయిత చరిత్ర సహాయ ఆచార్యులు
ఎస్.కె.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల గూడూరు

కవిత

# మారాము

"అమెరికాలో వీధులు
బహు శుభ్రంగా వుంటాయి" అన్నాడతడు
"అంటే" అన్నాను
"మట్టీ ధూళీ అసలే వుండవు" అన్నాడు
"మరి నన్నెందుకు రమ్మంటున్నావు
అవి లేకుండా నేను బతకలేనే".

"జన సమ్మర్థం ఉండదు
తొక్కిసలాట సున్నా"
"అరె జనం లేకుండా
నాకు ఊపిరాడదే"

"ఇరుగు పొరుగుల బెడద వుండదు
ఇండ్లు దూర దూరంగా వుంటాయి"
"అయ్యో! పలకరించే వాళ్ళు లేకపోతే
ప్రాణాలు నిలువవు నాకు"

"కార్లలో రోడ్ మ్యాపులుంటాయి
తప్పిపోయే ఆస్కారం లేదు"
"అట్లనా లెఫ్టు రైట్‌ల మధ్య
దృశ్య చలన సౌభాగ్యం వుండదన్నమాట
అదేం ప్రయాణం!
వినిర్మిత దేశం కదా అది
మరి రోడ్డు ప్రమాదాలు అంతగా ఎందుకు?
నేనైతే ఇప్పటికీ సుల్తాన్ బజార్‌లో
స్కూటర్ నడిపి క్షేమంగా బయట పడ్తాను"

"వాషింగ్టన్‌లో లైట్ హౌస్
ధవళ సుందరంగా ఉండొచ్చు గాని
అది తీసుకునే నల్ల నల్లని నిర్ణయాల్లో
మానవాళి శ్రేయస్సు ఉంటుందంటావా?"

"వీకెండ్‌లో
నయాగరాకు వెళ్లి రావచ్చు
బాగుంటుంది"
"కుంటాల జలపాతాన్ని
కంటిలో బంధించిన నాకు
అదో ఆకర్షణా!"

"అంతర్జాతీయ, గ్లోబల్ లాంటి పదాలు
నీ మనసుకు పట్టవా!"
"భూమికి చెవిని ఆనించి విను
ఎక్కడో యుద్ధ రావాలు వినిపిస్తున్నై
నువ్వు చెప్పే ప్రశాంతతను ఏం జేసుకోను
గర్భితంగా భీభత్స రసం చిప్పిల్లుతుంటే"

"నాయనా!
నువ్వు పిలుస్తుంటే
నా అస్తిత్వాన్ని మింగేసే
ప్రక్రియలన్నీ
అక్కడే వున్నట్టు అనిపిస్తుంది"

"మన రక్త బంధంలో
ఆత్మీయతకు లోటు లేదు
అదొక్కటే పరమ సత్యం
ఏమీ అనుకోకు
నన్నిక్కడే ఉండనియ్యి"

డా॥ ఎన్. గోపి
9391028496

డాక్టర్ వెంగళరావు పచ్చవ
9493516224

# ఆన్లైన్ విద్యా విధానంలో సవాళ్లు

**యూ**నివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారు నూతనవిద్యా విధానం-2020 అమలుపరచడంలో భాగంగా క్రొత్త విద్యావిధానాలను ప్రోత్సహిస్తున్నారు. ఉన్నత విద్య అనేటువంటిది చాలామందికి ఈనాటికి అందని ద్రాక్ష వలె ఉంది. దానికి కారణం పరిమిత విద్యాలయాలు, అందరికీ అందుబాటులో లేనటువంటి కోర్సులు మరియు సంకుచితంగా ఉన్నటువంటి విద్యా విధానాలు. ప్రపంచంలో ఉన్నటువంటి చాలా దేశాలువాటి యొక్క విద్యా విధానాన్ని ఆధునిక ఆవిష్కరణలకు అనుగుణంగా మార్చుకుంటూ మెరుగైనటువంటి విద్యను విద్యార్థులకు అందించడం జరుగుతుంది. కానీ మనదేశంలో విద్యావిధానాల యొక్క మార్పు అనేటువంటిది కొన్ని సంవత్సరాల సుదీర్ఘమైనటువంటి ప్రక్రియ. దీనివల్లఆధునిక ప్రపంచంలో జరుగుతున్నటువంటి మార్పులను మన విద్యావిధానంలో పొందుపరిచి విద్యార్థులకుత్వరితగతిన అందించలేకపోతున్నాం. భారతదేశంలో గత రెండు దశాబ్దాల నుంచి జరుగుతున్నటువంటిశాస్త్ర సాంకేతిక మౌళిక వసతుల అభివృద్ధి వల్ల దేశంలోని పౌరులు చాలామంది మొబైల్ టెక్నాలజీని విస్తృతంగా వినియోగించడం జరుగుతుంది. దీనికి తోడుగా మన దేశీయ కంపెనీలుపోటీతత్వం తోటి ఈ మొబైల్ సేవలను చాలా తక్కువ ధరకు అందరికీ అందించడం వల్ల చాలామంది ఈ రోజున మొబైల్ టెక్నాలజీ తోటి వారికి కావలసినటువంటి సమాచారాన్ని వేగవంతంగా శోధించడం, పొందుపరచడం, ఇతరులతో పంచుకోవడం జరుగుతుంది. అదేవిధంగా ఈ శాస్త్ర సాంకేతిక అభివృద్ధి మన విద్యావిధానంలో చాలా గణనీయమైనటువంటి మార్పులు తీసుకువచ్చింది. ఉదాహరణకి విద్యార్థులకి అర్థం కానటువంటి పాఠ్యాంశాలను యూట్యూబ్, అంతర్జాలంలో సులువుగా పొందగలుగుతున్నారు. దీనిద్వారా వారి యొక్క విజ్ఞానాన్ని త్వరితగతిన పెంపొందించుకోగలుగుతున్నారు.

'ఆన్లైన్విద్యా విధానం' అనే పద్ధతిని 2008వ సంవత్సరంలో దేవ్ కార్ నియర్ అనే విద్యావేత్త మొట్టమొదటిసారిగా కెనడా దేశంలో ప్రవేశపెట్టారు. ఈ విద్యా విధానం ద్వారా వారు విద్యార్థులకు అంతర్జాలం ద్వారా పాఠాలను బోధించేవారు. తరువాతి కాలంలో ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఈ ఆన్లైన్విద్యా విధానాన్ని అవలంబించాయి. భారతదేశంలో ఈ విద్యా విధానాన్ని ప్రైవేటు, గవర్నమెంట్ సంస్థలు నిర్దేశిత రుసుముతో విద్యార్థులకు అందిస్తున్నాయి. కరోనా మహమ్మారి రాకమునుపు ఈ విద్యా విధానానికి అంతగా ఆదరణ లేదు కానీ కరోనా వల్లప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా ఈ విద్యా విధానానికి అందరూ మారడం జరిగింది. అదేవిధంగామనదేశంలో ఉన్నటువంటి ప్రాథమిక, ఉన్నత విద్యాలయాలు అన్ని ఆన్లైన్ బోధననే ఎంచుకోవడం తప్ప వేరే మార్గం లేకపోయింది. ఇందులో భాగంగా చాలా ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం చేసుకొని సంయుక్తంగా కోర్సులను విద్యార్థులకు అందించడం జరిగింది. ఈ విధానంలో ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండే సాంకేతిక కోర్సులు మాత్రమే ఉన్నాయి. భారత ప్రభుత్వం యొక్క ఆధ్వర్యంలో ఏర్పాటు అయినటువంటి స్వయం అనే వ్యవస్థ ద్వారా ఆన్లైన్ కోర్సులను ఉచితంగా/నామమాత్ర ఫీజుతో విద్యార్థులకు అందించడం జరిగింది. కానీ ఈ విధానం ద్వారా కోర్సులను పూర్తిచేసినటువంటి విద్యార్థులకు ఆ ధ్రువపత్రాలు కేవలం అదనపు అర్హతగా ఉపయోగపడింది.

నూతన విద్యా విధానం 2020 లో భాగంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఆన్లైన్ కోర్సులు మీద నూతన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆన్లైన్ విద్య ద్వారా గుర్తింపు పొందినటువంటి సంస్థల నుండి ఎవరైనా కోర్సులు చేసినప్పుడు, ఆకోర్స్ యొక్క ధ్రువీకరణ పత్రాలు సాధారణంగా ఆఫ్లైన్లో కోర్సు చేసినటువంటి ధ్రువీకరణపత్రాలకు సమానంగా విలువ ఇవ్వడం జరిగింది. అందువల్ల సమీప భవిష్యత్తులో చాలామంది విద్యార్థులు, వృత్తి నిపుణులు వారికి కావలసినటువంటి కోర్సులను ఆన్లైన్ ద్వారా లేదా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ లో పూర్తిచేసుకునే అవకాశం ఉంది. అయితే ఈ సందర్భంగా ఈ ఆన్లైన్ విద్యా విధానంలో ఉండేటువంటి సమస్యలను సరిగా అవగాహన చేసుకుంటే తప్పితే దాని ఉద్దేశం నెరవేరదు. ఈ మధ్యకాలంలో జరిగినటువంటి కొన్ని పరిశోధనలు ఆన్లైన్ విద్యా విధానంలో ఉన్నటువంటి లోపాల్ని స్పష్టంగా గుర్తించడం జరిగింది. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా బోధన జరుగుతున్నటువంటి కోర్సులలో ప్రధానంగా ఉపాధ్యాయుని వీడియో- ఆడియో క్వాలిటీ సరిగా ఉండకపోవడం వలన విద్యార్థులు వీటి మీద ఆసక్తి కనపరచడం లేదు. దీనికి కారణం అధ్యాపకుల దగ్గర సరైనటువంటి మౌళిక సదుపాయాలు ఉండకపోవడం. దీనిని అధిగమించడానికి ఆయా సంస్థలు సరైన మౌళికసదుపాయాలైన కంప్యూటర్, నిరంతర విద్యుత్, నాణ్యమైన ఇంటర్నెట్లను అధ్యాపకులకు కల్పించాలి. ఆన్లైన్ బోధన చేస్తున్నటువంటి అధ్యాపకులకు టెక్నాలజీ మీద సరైనటువంటి అవగాహన లేకపోవడం వలన వారు ఆ యొక్క కోర్సును ఉత్తమంగా డెలివరీ చేయలేకపోవడం జరుగుతుంది. దీనిని అధికమించడానికి ఆయా సంస్థలు ఉపాధ్యాయులకు ఆ టెక్నాలజీస్ మీద సరైనటువంటి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించాలి. అలాగే కోర్సులు యొక్క స్వరూపాన్ని ముఖ్యంగా ఆన్లైన్ విద్యావిధానానికి అనుగుణంగా మార్చవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఆన్లైన్ విద్యా విధానంలో విద్యార్థులయొక్క భాగస్వామ్యం (ఇన్వాల్వ్మెంట్) సరిగా ఉండకపోవడంతో అధ్యాపకులు తక్కువ సమయంలోఎక్కువ టాపిక్లను/ సబ్జెక్టుని చెప్పడం జరుగుతుంది. ఈ ఆన్లైన్ విద్యా విధానం మీద కొన్ని పరిశోధనలు ఆసక్తికర విషయాలను కనుగొనబడ్డాయి. వాటిలో ముఖ్యంగా విద్యార్థులకు వారి యొక్క ప్రశ్నలను నివృత్తి చేసుకోవడానికి

**తరువాయి 41వ పుటలో....**

టి.వి.రామకృష్ణ
99514 41131

# తెలుగు బాలసాహిత్యంలో మనం ఎక్కడ ఉన్నాం?

**కథలు, గేయాలు, నాటికలు, ఆటలు పిల్లల భావి జీవితంపై ఎంతో ప్రభావం చూపిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని రుజువు పరిచాయి. కథలు, గేయాలు పిల్లలకు అత్యంత ఇష్టమైన అంశాలు. పిల్లల మానసిక వికాసానికి, ఆలోచన శక్తికి, ఊహాశక్తికి, సృజనాత్మకతకు కథలు, గేయాలు ఎంతో ఉపకరిస్తాయి. అలాగే శాస్త్ర సాంకేతిక అంశాలు, గొప్పవాళ్ళు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు పిల్లల మీద ఎంతో ప్రభావాన్ని చూపుతాయి.**

పుస్తక పఠనంవల్ల పిల్లలకు పదఉచ్చారణ, సృజనాత్మకత, ఊహాశక్తి పెరుగుతుంది. అంతేకాదు పుస్తకాలు చదవటం వల్ల కొత్త ఆలోచనలు రావటం, భాషాపరమైన నైపుణ్యాలు పెరగటం జరుగుతుంది. అంతేకాదు పిల్లల భావి జీవితానికి, ప్రాణాళికలకు పుస్తకాలు ఒక మార్గం చూపుతాయి. ఈ అనుభూతులన్నీ పిల్లలకు టీ వి లేదా సెల్ ఫోన్ వంటి దృశ్య శ్రవణ సాధనాల్లో చూసినపుడు కలగదు. పుస్తక పఠనం పిల్లలకు, పెద్దలకూ అందరికీ ఒక సరదా, సంతోషాన్ని కలుగజేస్తుంది. ఇది మన విలువైన సమయాన్ని వినియోగించుకునే ఒక మంచి వినిమయ సాధనం కూడా!

కానీ తల్లిదండ్రులు గాని, ఉపాధ్యాయులు గాని , విద్యా సంస్థల యాజమాన్యాలుగాని, గ్రంధాలయ సమన్వయ కర్తలు గాని, రచయితలు గాని, ప్రచురణ కర్తలు గాని యిది అత్యంత అవశ్యకమైన విషయమని ఆలోచించటం లేదు. పిల్లలు మానసికంగా ఎదగటానికి బాల సాహిత్యం ఎంతో ఉపకరిస్తుంది. పిల్లలు మంచి పౌరులుగా ఎదగడానికి కథలు, గేయాలు, నాటికలు, నవలలు, ఆటలు, పాటలు, జీవిత చరిత్రలు, వైజ్ఞానిక పుస్తకాలు దోహదం చేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదనే విషయం మనకు ఎన్నో సందర్భాలలో ఋజువయ్యింది.

ఇక అసలు విషయానికి వస్తే, ఇన్ని ప్రభావాల మధ్య మన తెలుగు బాల సాహిత్యం కూడా ఎక్కడవేసిన గొంగళి అక్కడనే ఉందని చెప్పాలి. మన పిల్లల పుస్తకాల భాండాగారంలో అనేక కథారూపాలు చెలామణి అవుతూ వస్తున్నాయి. ఐతిహాసిక కథలు, పౌరాణిక కథలు, జానపద కథలు, పిట్ట కథలు (నీతి కథలు), పంచతంత్ర కథలు, కాశీ మజిలీ కథలు, భట్టి విక్రమార్క కథలు, బేతాళ కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, తెనాలి రామలింగ కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, పొడుపు కథలు ఇలా దాదాపు అర్ధశతాబ్దం వరకు మన పిల్లల కథల పుస్తకాల మీద ప్రభావాన్ని చూపాయి. ఇంకా అనేక అనువాద రూపాలు అయిన అరేబియన్ నైట్స్ కథలు, ఈసపు కథలు, సింధ్ బాద్ సాహస కథలు, అక్బర్ బీర్బల్ కథలు, గలివర్ యాత్రా కథలు మన పంచన చేరాయి.

పంచతంత్ర కూడా మన బాల సాహిత్యంలో ప్రముఖ పాత్ర వహించింది. అయితే ఇతర దేశాలలో పంచతంత్ర స్ఫూర్తితో అనేక వైవిధ్యమైన రచనలు వెలువడ్డాయి. "మోగ్లీ" (జంగిల్ బుక్) కథ రాయటానికి తనకు పంచతంత్ర ప్రేరణ అని దాని రచయిత "రుడ్యార్డ్ కిప్లింగ్" ( నోబెల్ బహుమతి గ్రహీత) ఒక సందర్భంలో చెప్పాడు. అయితే మనం మాత్రం అక్కడే నిలిచిపోయాం. అలాగే మన జానపద కథల స్ఫూర్తితో ఎన్నో వైవిధ్యమైన కథలు వెలువడ్డాయి.

అలాగే రష్యా కథల పుస్తకాలు మన తెలుగు బాల సాహిత్యం మీద ప్రభావాన్ని చూపాయి. అలాగే చందమామ, బాలమిత్ర, బాలజ్యోతి లాంటి అనేక పత్రికలు కేవలం జానపద కథలు, నీతి కథలను మాత్రమే ప్రచురిస్తూ బాల సాహిత్యం మీద చాలా ప్రభావాన్ని చూపాయి. అసలు పిల్లల కథలు అంటే జానపద కథలు, నీతి కథలు అన్నంత ప్రభావాన్ని చూపాయి. ఇవి పెద్దలకు ఇష్టమైన కథలు కాబట్టి, పిల్లలకు నీతిని బోధించాలనే యావలో పిల్లలకు కూడా ఇవే కథలు ప్రసారమయ్యాయి.

ఆ జానపద కథలు, భేతాళ కథలు, నీతి కథల ప్రభావవననుంచి ఇప్పటికీ చాలా మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా బాల సాహిత్య రచయితలు బయటకు రాలేకున్నారు. బాల సాహిత్యమంటే నీతి కథలు, జానపద కథలు మాత్రమే అనే భావనలోను, భ్రమలోనూ ఉన్నారు. మనం గమనిస్తే మన తెలుగు దిన పత్రికలలో, వార పత్రికలలో ఇలాంటి రచనలతో నిండిపోతున్నాయి. ప్రచురణ కర్తలు ప్రచురిస్తున్నారు కాబట్టి అవే ప్రమాణీకమని బాల సాహిత్య రచయితలు అదే మూస విధానంలో కుప్పలు తెప్పలుగా కథలను రాస్తున్నారు. సమకాలీన రచలనలకు అసలు ప్రాధాన్యత ఇవ్వటం లేదు. పిల్లల కోసం కేటాయిస్తున్న ఈ పేజీలను ఎంతమంది పిల్లలు చదువుతున్నారో అనే విషయం మీద అసలు అధ్యయనం లేదు.

సంస్కృతి, సాంప్రదాయాలు, నీతి పేరుతో మన తెలుగు బాలసాహిత్యాన్ని కొన్ని పరిమితులతోనే ఉంచేశాం! పెద్దలకు సంబందించిన, పెద్దలకు ఇష్టమైన అనేక కథారూపాలను పిల్లల మీద రుద్దేశాం. ఆఖరకు తల్లులు పాడుకునే లాలి పాటలు బాలసాహిత్యం క్రింద జమకట్టేశాం. దీనికి ముఖ్య కారణం బాలసాహిత్యానికి సరైన నిర్వచనాన్ని ఇచ్చుకోకపోవటమే. ఏ రకమైన సాహిత్యం లేదా సాహిత్య ప్రక్రియ అయినా పిల్లల మనో వికాసానికి, ఆనందానికి సరైనవి అనే సమగ్ర పరిశీలన, పరిశోధనలు ఇప్పటికీ జరగలేదనేది వాస్తవం. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే పిల్లల వయసును బట్టి, మానసిక వికాసాన్ని బట్టి, సమకాలీన వాస్తవిక పరిస్తులనుబట్టి, సాంఘీక పరిస్తులనుబట్టి పిల్లలకు బాలసాహిత్యాన్ని ఎలా, ఏరూపంలో అందించాలనే విషయం మీద సరైన అవగాహన

లేకపోవటం, అధ్యయనాలు చెయ్యక పోవటం, ఈ పరిజ్ఞానాన్ని అందిచే పుస్తకాలు తెలుగులో లేకపోవడం ముఖ్య కారణం అవుతున్నది.

మన తెలుగు బాలసాహిత్యం ఎక్కువగా అనువాదాల మీద ఆధారపడి ఉంది. అనేక ప్రచురణ కర్తలు బాల్యసాహిత్యాన్ని అనువాదాలకే పరిమితం చేశారు. అనువాదాలు అవసరమే. కానీ ఇక్కడ సమస్య అనువాదాలు మక్కీకి మక్కీ ఉండడం, శైలి సరిగా ఉండకపోవటం, పేర్లు, ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు లేకపోవడం వల్ల పిల్లలు వాటి పట్ల నిరాసక్తత ఉందని మనం గమనించుకోవాలి. అనేకమంది ప్రచురణ కర్తలు ఎటువంటి ప్రమాణాలు లేకుండా, పరిశోధన, పరిశీలన లేకుండా బాలసాహిత్యం పేరుతో అనేక పుస్తకాలను ప్రచురిస్తున్నారు.

ఈ సందర్భంగా మనం "తానా - మంచి పుస్తకం" వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఒక మంచి కార్యక్రమాన్ని మనం అభినందించాల్సిందే! తెలుగు బాల సాహిత్య రచయితలను ఆహ్వానించి 10 సంవత్సరాలలోపు పిల్లలకు బొమ్మల కథలు, 10 సంవత్సరాల పై బడ్డ పిల్లలకు చిన్న నవలలను ఆహ్వానించి, వాటిలో ఎంపిక చేసిన వాటికి 10,000/- బహుమతిని ప్రకటిస్తున్నారు. చిత్రకారులకు కూడా నగదు బహుమతిని ఇస్తున్నారు. అయితే ఇక్కడ కూడా మనకు కొంత నిరాశే కలుగుతున్నది. మన బాల్యసాహిత్య రచయితలు పాత ప్రమాణాలతోనే రచనలు చేస్తునందువల్ల మనకు అత్యంత ప్రామాణికమైన రచన ప్రక్రియలు ఇక్కడ కూడా రావటం లేదనేది వాస్తవం.

పిల్లలతో మమేకమై, వారిని పరిశీలిస్తూ, వారి ఆశక్తులను, మనోభావాలను తెలుసుకుంటూ, వారి పఠనాశక్తులను గమనిస్తూ, ఇతర భాషల బాల సాహిత్య ప్రమాణాలను గమనిస్తున్నప్పుడు మాత్రమే మనం బాల సాహిత్య రాచయితలుగా మంచి ప్రమాణాలున్న బాలసాహిత్యాన్ని అందించగలుగుతాం. మన తెలుగు బాల సాహిత్య రచయితలు ఎక్కువమంది పెద్దల సాహిత్యం రాసేవారే. పూర్తిస్తాయి బాలసాహిత్యం మీద అంకితమై ఉన్న రచయితలు మన తెలుగుబాల్యసాహిత్యంలో తక్కువే అని చెప్పాలి. ఇతర భాషా రచయితలు, ఇతర దేశాల రచయితలు ఈ ప్రమాణాలు పాటిస్తారు. ఇలాంటి వాతావరణం, సంప్రదాయం మన తెలుగు రచయితలలో కొరవడిందనే విషయం వాస్తవం.

అమెరికా, రష్యా, అనేక యూరప్ దేశాలలో బాలసాహిత్యంమీద ఎన్నో విశ్లేషాత్మకమైన, విమర్శనాత్మకమైన పరిశోధనలు జరిగాయి. అనేక గ్రంధాలు, మోనోగ్రాఫ్ లు వెలువడ్డాయి. బాల సాహిత్యానికి సంబందించి ఖచ్చితమైన ప్రమాణాలనువాళ్ళు నిర్దేశించుకున్నారు. ఆ ప్రామాణికాలను అనుసరించి లైబ్రేరియన్ గాని, ఉపాధ్యాయులు గాని బాల సాహిత్యాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. మనకు జాతియ స్థాయిలో "నేషనల్ బుక్ ట్రస్ట్", "నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసర్చ్" , కేంద్ర సాహిత్య అకాడమీ లాంటి సంస్థల నుంచి గాని, మన తెలుగు రాష్ట్రాలకు సంభందించిన తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థలు నుంచి గాని బాల సాహిత్యం మీద సమగ్రమైన పరిశోధనలు గాని, దానికి సంబందించిన ప్రామాణిక గ్రంధాలు గాని వెలువడలేదనేది వాస్తవం.

మన తెలుగు విషయానికి వస్తే, గిజుభాయి గుజరాతీ భాషలో రాసిన పుస్తకానికి అనువాదం ""కథా కథన విధానం" అనే పుస్తకం ఇప్పటికీ బాల సాహిత్యానికి సమగ్రమైన సూచీకా గ్రంధమని చెప్పాలి. 30-40దశకంలోనే గిజుభాయి ఈ రచనను చేశారు. ఈ కథా కథన శాస్త్ర గ్రంధంలో కథలు ఎలా ఉండాలి, పిల్లలకు ఎలాంటి కథలను ఎంపిక చేయాలి, ఎలాంటి కథలను చెప్పాలి, ఎలాంటి కథలను చెప్పకూడదు లాంటి అనేక ప్రామాణిక, శాస్త్రీయ విషయాలను తన అనుభవంతో వివరిస్తారు. ప్రతీ బాలసాహితి రచయిత ఈ పుస్తకాన్ని చదవవలసిన అవసరసం ఉంది.

పిల్లల అనుభూతులు, భావనలు వేరుగా ఉంటాయి. 3-6 సం. లోపు పిల్లలు బొమ్మలుండే పుస్తకాలను ఇష్టపడతారు. 6-8 సం. పిల్లలు నిడివి కొద్దిగా పెద్దవిగా ఉండే బొమ్మల కథలను, చిన్న, చిన్న కథలను వినటానికి, చదవటానికి ఇష్టపడతారు. ఈ వయసు పిల్లలు గేయాలను, పాటలను ఇష్టపడతారు. 8-12 సం. వయసు పిల్లలు నిజ జీవిత కథలను ఇష్టపడతారు. 13 సం. ఆపై వయసు పిల్లలు నిజ జీవిత కథలు, సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, చిన్న నవలలు, జీవిత చరిత్రలు, సైన్స్, టెక్నాలజీకి సంభవియించిన పుస్తకాలను ఇష్టపడతారు. ఈ వయసుకు సంబంధించిన పుస్తకాలు తెలుగులో చాలా తక్కువ వున్నాయి. రచయితలుగా మనకు దీనిపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ఏ వయసు వారికి రాస్తున్నాం, చిన్న బొమ్మల కథ, పెద్ద బొమ్మలకథ, చిన్న కథ, పెద్ద కథ, నవల, నాటకం, గేయాలు ఇలా ఎంచుకున్నప్పుడు మనకు కథాంశం ఎంచుకోవటం వల్ల రచనా శైలి, భాష వంటి అనేక విషయాలు సులభమౌతాయి.

అలాగే గేయాల విషయానికి వచ్చినపుడు, మన తెలుగు బాల సాహిత్యం చాలా వెనుకబడి ఉంది. బాలసాహిత్యంలో గేయాలకు ప్రముఖపాత్ర ఉందనడంలో ఎటువంటి సందేహంలేదు. ఇంగ్లీషులో మనం చెప్పుకునే "నర్సరీ రైమ్స్," "మదర్ గూస్," లనే "బాలగేయాలు" గా చెప్పుకుంటాం. అయితే మనం తెలుగులో బాలగేయాలకు కూడా సరైన నిర్వచనాన్ని ఇచ్చుకోలేదు. ఎందుకంటే తల్లులు పాడుకునే "లాలి పాటలు," బావా మరదళ్ళ హాస్య గేయాలు, పొడుపు కథలు, ప్రబోధాత్మక గేయాలు, భక్తి గేయాలు, పిల్లలను వర్ణిస్తూ రాసిన గేయాలు - పాటలు, శతకాలు, జాతీయ గీతాలు, ప్రార్థనా గేయాలు, పండగలు సందర్భంగా పాడుకునే పాటలు, ఎగతాళి పాటలు, గేయాలు ఇలా పాత రోజులలో పెద్దలు అనేక సందర్భాలలో పాడుకునే గేయాలను, పాటలను బాలగేయాల క్రింద చేర్చేశారు. ఇవన్నీ పిల్లలకోసం రాసినవి కావు. "సరళమైన భాషలో, చక్కటి ప్రాస, లయలతో, భావయుక్తంగా, భావాలను వ్యక్త పరిచే విధంగా పిల్లలు పాడుకోగలిగినవి" బాలాగేయాలు అని చెప్పవచ్చు. ఇంకొక నిర్వచనం-"పిల్లలు సంతోషంగా, ఆనందంగా ఆస్వాదించ గలిగినవి, సులభంగా చెప్పగలిగినవి లేదా పాడుకోగలిగినవి" అని చెప్పవచ్చు. ఈ సందర్భంగా మనం జై సీతారామ్ గారిని ఒకసారి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉంది. ఆయన రాసిన 150 గేయాలు సరళంగా, భావయుక్తంగా, పిల్లలు ఆనందించేవిగా ఉంటాయి. పాతతరం గేయాలు, వీటిని కలుపుకున్నా 200-300 వందలకు మించి మన తెలుగు గేయాలు ఉండవు. ఇంగ్లీషు రైమ్స్ మనకు వేలల్లో కనిపిస్తాయి. మనకు తెలుగులో బాల గేయాలకు కూడా కరువే. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మధ్య నేను కూడా "బుడుగో,బుడుగో.." అనే పేరుతో 62

బాలాగేయాలు రాయటం జరిగింది. వాటిని విజ్ఞాన ప్రచురణలు వారు ప్రచురించారు.

ఇలా మన తెలుగు బాలసాహిత్యాన్ని పరిశీలించినపుడు అనేక సమస్యలతో జోగుతున్నది. పిల్లల్లో పఠనాశక్తి తగ్గిందని మనం పిల్లలను నిందిస్తున్నాం. కానీ పిల్లలకు పెద్దలుగా మనం వారికి ఆ అవకాశాన్ని కల్పిస్తున్నామా అని ప్రశ్నించుకోవాలి. పిల్లలు పాఠ్యపుస్తకాలు, సిలబస్సు, మార్కులు, రాంకుల ప్రక్రియలతో సతమతం అవుతున్నారు. తల్లిదండ్రులు వేలకు వేలు బట్టలకు, ఇతర వ్యాపకాలకు ఖర్చు పెడతారు గాని పిల్లలకోసం పుస్తకాలు కొని వారికంటూ ఇంట్లో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయరు. ఇక పాఠశాలల విషయానికి వస్తే గ్రంథాలయాలు ఉండవు, ఉన్నా పిల్లలకు అందుబాటులో ఉండవు, దానికోసం సమయం కేటాయించడం ఉండదు. మనకు ప్రత్యేకంగా బాలల గ్రంథాలయాలు లేవు. బాల సాహిత్య రచనలకు ఆదరణ లేదనేది రచయితల వాదన, బాలసాహిత్యానికి సరైన మార్కెట్ లేదనేది ప్రచురణకర్తల వాదన. ఇలా తెలుగు బాలసాహిత్యం అనేక సమస్యలతో సతమతం అవుతున్నది.

**రాయప్రోలు సుబ్బారావు గారు ఒక సందర్భంలో "కొత్త నీరు తొల్కరియై పొర్లిపార, పాతనీరు తొలంగుట అబ్బురమ్ము కాదు" అన్నారు. కాబట్టి బాలసాహిత్యం కూడా పాత తరాన్నుంచి, కొత్త తరానికి తప్పక మారాల్సిందే. కాబట్టి మన బాల సాహిత్య రచయితలు కూడా బాలసాహిత్యాన్ని పరిశోధించాలి, పరిశీలించాలి, చర్చించాల్సిన అవసరం ఉంది. గుడ్డెద్దు చేలో పడ్డట్లు మనం పోయినట్లైతే బాల సాహిత్యానికి అన్యాయం చేసిన వాళ్ళం అవుతాము.**

–వ్యాస రచయిత బాలసాహిత్యవేత్త

**38వ పుట తరువాయి...**

## ఆన్లైన్ విద్యా విధానంలో సవాళ్లు

సరైనటువంటి అవకాశం లేకపోవడం, వారికి రీడింగ్/రిఫరెన్స్ మెటీరియల్ అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. దీనితోపాటుగా ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్లైన్లో పరీక్షలు నిర్వహించడం, సృజనతో కూడినటువంటి లక్ష్యాలను విద్యార్థులకు నిర్దేశించడం, క్లుప్తమైనటువంటి మెటీరియల్ని ఆన్లైన్లో అందుబాటులో ఉంచడం, మూక్స్ ప్లాట్ఫారం ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థుల యొక్క పనితీరు పరిశీలించడం మరియు వారి యొక్క ప్రశ్నలకు సమాధానం అందించడం చేయవచ్చు.

**ఈ నూతన విద్యా విధానం 2020 యొక్క లక్ష్యాలను ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలు అందుకోవాలి అంటే పైన విశ్లేషించిన సమస్యల మీద సరైన అవగాహనతో కోర్సులను డిజైన్ చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా ఆన్లైన్ విద్యా విధానం యొక్క సవాళ్లను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ఆ పరిమితులను దాటడానికి చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

–వ్యాస రచయిత సహాయ ఆచార్యుడు,
నర్సిమొంజి డీమ్డ్ విశ్వవిద్యాలయం,జడ్చర్ల,మహబూబ్నగర్ జిల్లా

## కొలకలూరి పురస్కారాలు-2023

కొలకలూరి సాహిత్య పురస్కారాలు 15 సంవత్సరాలుగా వివిధ ప్రక్రియలకు ప్రదానం చేయటం జరుగుతూ ఉంది. ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియా గ్రంథాలకు మూడు పురస్కారాలు ప్రకటించగలగటం ముదావహం. ఈ పురస్కారాలకు తెలుగు సాహిత్యస్రష్టలు ప్రపంచంలో ఎక్కడున్నా అర్హులు.

1. కొలకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారం 2023.-15,000
2. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం 2023.-15,000
3. కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం 2023 - రూ. 15,000

ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు పంపండి. ముగ్గురు సాహితీవేత్తల సంఘాలు మూడు వీటిని పరిశీలించి, పురస్కార గ్రంథాలు నిర్ణయిస్తాయి.

ఈ గ్రంథాలు 1-1-2020 తర్వాత ముద్రితమై ఉండాలి. రచయితలైనా, ప్రచురణకర్తలైనా తమ గ్రంథాలను 15-12-2022 లోగా చేరేటట్లుగా పంపండి. పురస్కార ప్రకటన 15.1.2023న వెలువడుతుంది. 26.2.2023న హైదరాబాదులో జరిగే సభలో పురస్కారం ప్రదానం చేస్తారు. కవిత్వం ఒక్క కవి కావ్యం / కవితల సంకలనం. నాటకం : ఒక్క నాటకకర్త నాటకం / నాటికల సంకలనం. పరిశోధన: ఒక్క పరిశోధకుడి పరిశోధన గ్రంథం / పరిశోధన వ్యాస సంకలనం. ఒక్కొక్క పురస్కారానికి నగుదు రూ.15,000/-, జ్ఞాపిక, శాలువా చొప్పున మూడు పురస్కారాలు ప్రదానం చేయబడతాయి.

**గ్రంథాలు పంపవలసిన చిరునామాలు:**

**కవిత్వం, నాటకం :** ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (సెల్:94419 23172) తెలుగు శాఖాధ్యక్షులు & పరీక్ష విభాగం డీన్ శ్రీ పద్మావతి మహిళావిశ్వవిద్యాలయం తిరుపతి-517502.

**పరిశోధన గ్రంథాలు :** ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (సెల్: 9963564664) ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి - 517 502.

పత్రికా సంపాదక మహాశయులకు విజ్ఞప్తిఈ పురస్కార వార్త ప్రచురించి, సాహిత్య ప్రోత్సాహం కలిగింపగోరుతున్నాము.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ఆచార్య కొలకలూరి సుమకిరణ్
10.11.2022


**అందరికీ ఆనందంతో పాటు విజ్ఞానాన్ని పెంచే సాధనం**




పదానందం

అక్షరాలతో ఆట

కూర్పు: సుధామ

పుటలు:116 వెల:రూ.125

ప్రతులకు:

హాస్యానందం-98496 30637

కె.వి.వి.సత్యనారాయణ-
96764 44548

పుస్తకాల పరిచయం

# తెలంగాణ ఉమ్మడి పదిజిల్లాల పెద్దలు రాసిన పిల్లల కథలు

**పి**ల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆటబొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం. ఇవాళ కంప్యూటర్, ఇంటర్నెట్, ఆన్‌లైన్ గేమ్స్ చిన్నారుల జీవితాలను ఊహించని స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయి. అసలైన బాల్యపు మధురానుభూతులను వారికి దూరం చేస్తున్నాయి.

పిల్లలలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు. ఈ బాధ్యతను నెరవేర్చే క్రమంలో 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' నిష్ణాతులతో ఎన్నో సమావేశాలు, సదస్సులు, చర్చలు, బాల చెలిమి ముచ్చట్లు నిర్వహించింది. ఎనిమిది కథా సంపుటాలు గాడిద తెలివి, అంతరిక్ష దొంగలు, గుల్లేరు బాలుడు, టంగ్ యంగ్, నెల్ సెండా, చిత్రప్రసాద్ కథలు, పాలపిట్ట ప్రచురించింది. వీటికి విద్యార్థుల, అధ్యాపకుల, రచయితల ఆదరాభిమానాలు లభించాయి.

పిల్లల రచనలకు ప్రాచుర్యం కల్పించడం, ప్రచురించడం, పంపిణీ చేయడం, మార్కెటింగ్ లాంటి సమస్యలూ ఉన్నాయి. ఇలాంటి అంశాలపై 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' దృష్టిసారించింది. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బడిపిల్లలు రాసిన 'బడి పిల్లల కథలు' పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. ఇవి రెండు తెలుగు రాష్ట్రాలలోను విశేష ఆదరణ పొందాయి. బాల రచయితలకు, బాల సాహితీకారులకు, బాలసాహిత్య ప్రచురణ కర్తలకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

అలాగే పిల్లల కోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన 'పెద్దలు రాసిన పిల్లల కథలు' పది సంకలనాలను అందమైన బొమ్మలతో ఇప్పుడు వెలువరిస్తున్నది.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, శ్రీ మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడిన ఈ 10 పుస్తకాల సెట్
ధర రూ.330- తగ్గింపు ధర రూ.300






























పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# దున్నబోతే దూడల్లోకి- మేయబోతే ఎద్దుల్లోకి

## వలస పాలననుండి జాతీయ స్థాయిలో సామాజిక విద్యా రంగాలలో కొనసాగుతున్న దుర్దశ.

**జాతీయ** పాఠ్య ప్రణాళికా చట్రం మీద చర్చ జరుగుతున్న తరుణంలో, వలస పాలననుండి క్రమంగా జాతీయ స్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలను విశ్రాంత NCERT (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) సంచాలకుడు కృష్ణకుమార్ ఇలా బట్టబయలు చేశారు.

'సంప్రదాయం' 'ఆధునికత' అనే శక్తులు, పేరుకు మాత్రమే పరస్పర వ్యతిరేకతను ప్రకటిస్తున్న సందర్భంలో, పునరుద్ధరణ వాద శక్తుల పునఃప్రవేశం, తీవ్రమైన ప్రమాదాన్ని సూచిస్తుంది'(విద్య. కృష్ణకుమార్ Political agenda of educationకు(1991, 2004) అనువాదం. ఎమెస్కో. పుట 229).'




హక్కులు పొందగలిగిన వ్యక్తులు సంపన్న వర్గాలకు చెందిన అల్ప సంఖ్యాకులు. మరొక పక్కన బాధ్యతలకు నియమాలకు కట్టుపడాల్సిన అధిక సంఖ్యాకుల జీవనోపాధి మార్గాలన్నీ ధ్వంసమైపోయాయి. పొలాల మీద, అడవుల మీద వాళ్ళకున్న హక్కులు దురాక్రమణకు గురయ్యాయి. ఐనా ఎదురుతిరిగేందుకు ప్రశ్నిచేందుకు వారికి ఎలాంటి హక్కులు లేవు.ఎందుకంటే సామ్రాజ్య నిర్మాణమనే పవిత్ర కార్యానికి ఆటంకం కలగటాన్ని ఉపయోగితావాదస్వప్నం అనుమతించదు కనుక.(పుట 224)' భారతీయ సమాజంలోని కిందికులాల జీవన విధానంతో వృత్తి విద్యలకున్న సంబధం విడదీయరానిది. కానీ, వలస విద్యావిధానంలో అక్షరాస్యత, గణితం, సాహిత్యపరిజ్ఞానం వంటి అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఉన్నది. ఈ నైపుణ్యాలు, జ్ఞానమూ, అగ్రవర్ణాల భౌతిక సాంస్కృతిక ప్రయోజనాలు నేరవేర్చేవి మాత్రమే.(203)

ఇటువంటి చదువులు రుద్దేవాళ్ళు, చదివేవాళ్ళ ఉద్దేశ్యాలను వివరిస్తూ, 1.విద్యలో సమానావకాశాలు, 2. అస్తిత్వం కోసం అన్వేషణ, విదేశీప్రభావం నుండి బయట పడటం పేరిట, సంస్కృత సంప్రదాయానికి చెందిన భాషగా హిందీని రూపొందించి జాతీయ భాషగా రుద్దటం 3.సంపన్నులకు, వారి సౌకర్యవంతమైన భద్ర జీవనానికి అనుకూలంగా రూపొందటం (పరిచయంలో పుట 15). ఈ దుర్దశ నుండి బయట పడటానికి గాంధీ, అంబేద్కర్ వంటి స్థాయిగల కొత్తనాయకులు పోరాటం చేపట్టే వరకు ఈ చీకటి కుహరంలో పడివుండక తప్పదు' అని కృష్ణకుమార్ తన పుస్తకం నిరాశతో ముగిస్తారు.

**దున్నబోతే దూడల్లోకి-మేయబోతేఎద్దుల్లోకి**

స్వతంత్రం వచ్చిన నాటినుండి సామాజిక సాహిత్యరంగాల్లో మన రాష్ట్రంలో కొనసాగుతున్న పరిణామాలు.

తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన కొందరు, తరువాత చట్ట సభలకు ఎన్నికైనారు. కాని ఆ పోరాటాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగించటానికి బదులు, నియోజకవర్గాల అభివృద్ధికి పరిమితమైనారు. అడవులు పట్టినవారు, మావో దారిలో బేర్ ఫూట్ కార్యకర్తలను తయారు చేయలేకపోయారు. రైతు- కూలీ పోరాటాలద్వారానే విముక్తి అని నమ్మిన వాళ్ళు, ఉద్యోగసంఘాల నాయకులైనారు. వేతనాలపెంపు లెక్కలలో మునిగి పోయారేకాని జనసామాన్యానికి కావలసిన భూమి అడవి కూలి లెక్కలు నేర్పలేక పోయారు. కొందరు ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజక వర్గాల శాసన మండలి సభ్యులైనారు. ఒక పక్క భూసంస్కరణలు అని పాలకవర్గాలు జనాన్ని మభ్యపెడుతుంటే, కరణం వ్యవస్థను రద్దు చేస్తుంటే, మిత్ర పక్షాలై ఉండికూడా, ఈ ఉత్పత్తి సాధనాల లెక్కలు చదువులో పెట్టాలని పిలుపు నివ్వలేకపోయారు. అడవి ఆదివాసులదే అని రచనలు చేసిన వీళ్ళు, తీరా చట్టంవస్తే, ఉమ్మడి వాడుకల గుర్తింపు పక్కన పెట్టి, ఒకటి అరా ఎకరాలకు పోడుపట్టాలు ఇస్తే చాలని సరిపెట్టుకుంటున్నారు. విశ్వవిద్యాలయాలకు పరిమితమైన ఆచార్యులు నేషనల్ కర్రిక్యులం ఫ్రేం వర్క్ మీద చేసే చర్చలు , డొల్లతీర్మానాలు 'ఆలూ లేని సమోసా'లుగా తయారైనాయి. జీవధారలు బీల తంపర భూములు,

పరిశ్రమలవల్ల కలుషితం కాకుండా, జీవ వైవిధ్యచట్టం అడ్డుకుంటే, ఉద్యమ స్థాయిలో ఆ వనరులు గుర్తించి జీవ వైవిధ్య పట్టికలో నమోదు చేయించేది బదులు, ఆ పోరాటం కథలు కథలుగా రాసి సినిమా తీసేవాళ్ళకోసం ఎదురుచూస్తున్నారు. మా తాతలు ఉద్యమాలు చేశారు.. మా మూతులు వాసన చూడండని డబ్బా కొట్టుకుంటున్నారు. జనాన్ని ఆశల పల్లకిలో ఊరేగిస్తున్నారు. శిల్పపు తడిగుడ్డలతో గ్రామీణుల, గిరిజనుల గొంతులు కోస్తున్నారు. వేతనరంగంలో గానుగెద్దులా బతికే బుద్ధి జీవులు సాహిత్యం, విశ్లేషణతో పోద్దుపుచ్చటం తప్ప కార్యరంగంలోకి దిగే సాహసం చేయలేరు. వారి ఉద్యోగపు పరిమిత దృక్పథపు చూరులోంచే సూర్యకాంతి వంటి సమాజాన్ని చూస్తారు. గుడ్డి వాళ్ళు ఏనుగును వర్ణించినట్లు తము తడిమిందే చూపిస్తారు. వాళ్ళ చేతిలో చోదక శక్తి కావలసిన చదువులు, సాహిత్యాలు; ఆలోచనను హరించే మాదక ద్రవ్యంగా, కుతి/ తీట తీర్చుకునే వ్యసనం వ్యాపకంగా మారాయి. 'తీటే దేవేంద్రపదవి సిద్ధము సుమతీ"

షేక్స్పియర్ నాటకం 'టెంపెస్ట్' లో రాజవంశానికి చెందిన ప్రాస్పరోకు ద్వీపాంతర శిక్ష విధిస్తారు. తన శిక్ష తీరి వెళ్లి పోయేటప్పుడు, ఆ ద్వీపం పాలన అప్పగిస్తానని అతడు కొందరిని చేరదీస్తాడు. ఎదిరించిన కాలిబాన్‌ను జైల్లోకి తోస్తాడు. ప్రాస్పరో విద్యలు, కొలువులు వంటబట్టించుకున్నవాళ్ళు అతడు వెళ్ళాక పదవులలోకి వచ్చారు. తమ వాళ్ళైన కాలిబాన్‌లను మరింతగా హింసిస్తున్నారు. ప్రసిద్ధమైన ఈ కథను తమ పరిస్థితులకు అనువుగా మలుచుకుని ఆఫ్రికన్ రచయితలు కాలిబాన్ లాంటి జనసామాన్యాన్ని చైతన్య పరుస్తుంటే. మనదేశంలో మాత్రం, ఇంకా ఆ నాటకంలో స్వారస్యాన్ని అనువదిస్తూ కావ్యామృత రసాస్వాదనలో ఓలలాడుతున్నారు.

ఇటువంటి పరిస్థితులలో నేలవిడిచిన సాములుగా మారిన మన చదువులు, ఎదిగేతరాన్ని ఎలాకుంగదీస్తున్నాయో ప్రముఖవిద్యావేత్త డి.యస్.కొఠారి, నాడే గమనించి హెచ్చరించారు. 'చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్రవిజ్ఞానంలోని ప్రాథమిక భావన బీజాలుంటాయి. విద్యార్థి క్లాస్ రూమ్ బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు,క్లాసు రూమ్‌లో పరాయి భాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక సమన్వయం కుదరక, అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదే కాక చదువు మీదే ఆసక్తి తగ్గుతుంది' ( కొఠారి కమిషన్ నివేదిక 1964-66. తెలుగులో శాస్త్ర పరిభాష తెలుగు అకాదమి 2013)).

క్లాస్ రూమ్‌లో చెప్పే శాస్త్రాలకు, సమాజంలో శాస్త్ర బావనలమధ్య సమన్వయం కుదర్చటానికే మాండలిక వృత్తి పదకోశాలు తయారు చేసి జానపద సాహిత్యం సేకరించి, అవి ముడిసరుకుగానే వదిలేసారు. మాతృభాష బోధనా భాషగా ఉండాలని ఘోషించే వారుకూడా, ఈ కృషి/అమ్మనుడి పునాదిఅయితే తప్ప బోధనా భాష బలపడదదని గుర్తించటంలేదు.గుర్తించినా కృషి చేసింది లేదు. రంగు, రుచి, వాసన లేకపోయినా ఫరవాలేదు, భాష బతికి ఉంటే చాలునని, అటువంటి నిర్జీవమైన భాషను తమ లక్ష్యాలకు తగ్గట్టు మలుచుకోవచ్చని శిష్టులు/ పాలకులు భావిస్తున్నారు.

అయితే కొఠారి హెచ్చరిక వృధా కాలేదు. ఆవేదన గలవాళ్ళు ఈ దిశలో కృషి చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వాన్ని కదిలిస్తూనే ఉన్నారు.తత్ఫలితంగా, మూడు-ఏడు తరగతుల పిల్లలకు సాంఘిక,జీవ శాస్త్రాలతో కలిపి గిరిజన సంస్కృతి బోధించటానికి ప్రధానోపాధ్యాయుల కరదీపిక 2018 లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ తయారు చేయించింది.

ఈ కరదీపిక 'చీమలు దూరే చిట్టడవులు' వంటి తెలుగువారి అడవుల వర్గీకరణలో శాస్త్రీయత, ఆ జంతువులకు




నెలవైన తోములు, మట్టలు, కంపలు, పొదలు, లాగలు. వేనం, జౌక, లొద్ది, గొంది, గండి, పనుకు, లంక, బయలు; సెల, గుండం, పడియ, కట్టువ, కురవ, సారవ, బరక, కనుమ మొదలైన భూగోళ విశేషాలు, తిరిగే జంతువులు, వేటాడే విల్లమ్ములు, వలలు వంటి సాధన సామగ్రి, వాయిద్యాలు, మందులు మాకులు, జ్వరం-వరుస జ్వరం, చలిజ్వరం, వేళజ్వరం, వేదిజ్వరం, ఉడుకులు,మశూచికం, పొంగు, సర్ది, వాంతులు, విరేచనాలు; అయారుతువులలో వచ్చే తేనెలు- పెర, తొడిది, మొసరు, జుంటి, కన్నెగుల్ల: పెరిగే గడ్డి జాతులు, చెలరేగే ఉసిళ్ళు; కురిసే మంచు రకాలు-గాందు, ముడిమంచు, బుగ్గిమంచు, పొగమంచు; ఈ ఋతువులలో పండే పంటలు, చేసుకునే పండుగలు, వంటకాలు; చెప్పుకునే స్థలపురాణాల సందేశాలు, పురాగాథలు; నుడికారం, సామెతలు, కథలు, పొడుపు కథల రూపంలో తరతరాలకు జ్ఞానాన్ని ముందుతరాలకు అందించే పద్ధతులు; ఆధునిక శాస్త్రాలపదజాలంతో సమన్వయం చేస్తూ తెచ్చిన ఈ వాచకం బోధించటంలో

కృషిలో ఉపాధ్యాయుడి పాత్ర, జాతి నిర్మాణంలో కీలకమైనదిగా నొక్కి చెపుతుంది. 'గిరిజనులను అధ్యయనం

**తరువాయి 47వ పుటలో....**

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
9848123655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద (20)

**లో**కంలో మనుషుల మనస్తత్వాలు ఒకే రకంగా ఉంటాయి. స్థాయి భేదాలు తప్ప. అన్ని దేశాల వాళ్ళు తరతమ భేదం లేకుండా మనదేశంలో మనల్నే బానిసలుగా చేసి బానిస వ్యాపారం కూడా చేశారు. మనల్ని పరిపాలించిన వాళ్ళు స్వార్థమే చూసుకుని దొరికినంత వరకు దోచుకోవడమే చేశారన్నది జగమెరిగిన వాస్తవం. ఐతే వాళ్ళలో తులసి మొక్కలు లాంటి వాళ్ళూ ఉన్నారు. వాళ్ళలో సర్ విలియం జోన్స్ (1746-1794) లాంటి వాళ్ళు భారతీయుల పక్షాన నిలబడి, భారతీయులకు అండగా నిలిచారు. 1784 జనవరి 15 వతేదీన ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్ స్థాపించి అధ్యక్షుడిగా వ్యవహరించాడు విలియం జోన్స్ సంస్కృతంలో పండితుడు. ఈయన సంస్కృతంలోని అభిజ్ఞాన శాకుంతలం ఇంగ్లీషులోనికి అనువాదం చేశాడు. పార్శీ భాషా వ్యాకరణము రాశాడు. ఈయన కంపెనీ ఉద్యోగుల విచ్చల విడి రాహిత్యం ఖండించాడు. పాశ్చాత్యుల అనైతిక జీవితాలను ఎదిరించాడు. జోన్స్‌లాగే చార్లెస్ విల్కిన్స్ (1750-1836) హెన్రీ తామస్ కోల్ బ్రూక్ (1765-1837) లాంటి వాళ్ళు భారతీయుల పద్ధతులు, అలవాట్లు, భక్తి విశ్వాసాలను గౌరవించారు. అదే వారన్ హేస్టింగ్స్ పరిపాలనలో మార్పులు తెచ్చి బానిస వ్యాపారం మాన్పించే చట్టం తెచ్చింది. పైగా భారతీయుల మత విశ్వాసాలను, సంప్రదాయాలను గౌరవించే విధంగా ప్రవర్తించారు. దీనివల్ల పాశ్చాత్య అధికారుల్లో, ఉద్యోగుల్లో కొంతమార్పు వచ్చింది. ఈ నేపథ్యంలో సి.పి.బ్రౌన్ తండ్రి రెవరెండ్ డేవిడ్ బ్రౌన్ (1762-1812) లాంటి వాళ్ళు కలకత్తా పరిసర ప్రాంతాల్లోని భారతీయులకు విద్య, వైద్య రంగాల్లో సేవ చేసి ప్రజల మన్నన పొందారు. పాశ్చాత్యులు భారతీయులకు సేవచేసే పరిస్థితుల్లో వాళ్ళ అధికారుల ఆగ్రహానికి గురికావలసి వచ్చింది. పైగా ధర్మబడుల స్థాపన, విద్యా సంస్థల శరణాలయాల అభివృద్ధిలో చురుకుగా పనిచేశారు. భారతీయులకు విద్యను నేర్పించారు. అన్ని వర్గాల ప్రజలకు చదువును అందుబాటులోకి తెచ్చారు. భారతీయ భాషల గ్రంథాల ముద్రణ, పరిష్కరణ, శుద్ధ ప్రతుల తయారి లాంటి పనులతో పాటు కోశ వ్యాకరణాలు తయారు చేశారు. భారతదేశంలో తొలిగా బైబిల్ సొసైటీని స్థాపించిన ఖ్యాతి డేవిడ్ బ్రౌన్‌కే దక్కుతుంది. ఆయన ప్రొవోస్ట్‌గా పనిచేసిన రోజుల్లో హిబ్రూ, గ్రీకు, లాటిన్, పర్షియన్ భాషలు భారతీయులకు నేర్పించాడు. ఆయన ఇల్లు ఒక అతిథి గృహంలా ఉండేది. పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన వాళ్ళు నెలల తరబడి ఈయన బంగ్లాలోనే ఉండేవాళ్లు. వాళ్ళతో బహుభాషా చర్చలు, భారతీయ సంప్రదాయ ఔన్నత్యము గూర్చిన కబుర్లు నడిచేవి. డేవిడ్ బ్రౌన్ కలకత్తాలో పాతికేళ్ళకు పైగా ఉన్నాడు. భారతీయ సంప్రదాయాలను గౌరవించి భారతీయుకుల స్నేహ పాత్రుడయ్యాడు. చివరికి వ్యాధి పీడితుడై 1812 జూన్ 14వతేదీన మరణించాడు. ఆయన మరణించే నాటికి భార్య చేతిలో డబ్బు చాల తక్కువగా ఉంది. చిన్న పిల్లలతో లండన్ తిరిగి వెళ్ళటానికి డబ్బు లేదు. మిత్రుల సాయంతో డేవిడ్ బ్రౌన్ జీవితం ఆయన సేవా పరిచర్యను పుస్తక రూపంలో మెమోరియల్ స్కెచెస్ అనే పేర 1816లో ముద్రించారు. ముద్రించిన వాటిలో 193 ప్రతులు స్నేహితులు కొని 19,300 సిక్కా రూపాయలు వసూలు చేశారు. అదీ చాలక మరికొంత అప్పుచేసి లండన్ వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. వాళ్ళు తీసుకున్న అప్పు బ్రౌన్ తన సోదరునితో తిరిగి భారత దేశం సివిల్ సర్వెంట్లుగా వచ్చి బాకీ పూర్తిగా తీర్చారు.

సి.పి. బ్రౌన్ భారదేశానికి సివిల్ సర్వెంట్‌గా 1817లో మద్రాసుకు వచ్చాడు. తన సోదరుడు బెంగాల్‌లో సివిల్ సర్వెంట్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఏయే ప్రాంతాల్లో ఉద్యోగంలో చేరారో ఆయా ప్రాంతీయ భాషలు తప్పక నేర్చుకోవాలనే నియమం ఉంది. బ్రౌన్ 1817 ఆగస్టు 13న మద్రాసు కాలేజిలో చేరాడు. వెలగపూడి కోదండరాం దగ్గర తెలుగు నేర్చుకున్నాడు. అప్పుడే తెలుగు భాష ఒకటున్నదని తెలిసింది. పోలీసు శాఖలో హెడ్ అమీన్‌గా తొలి ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం చేస్తూనే తెలుగు భాషను అధ్యయనం చేశాడు. చివరి పరీక్షలో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆయా బాషల్లో ఉత్తీర్ణత సాధించిన వారినుద్దేశించి ఒక సభ ఏర్పాటు చేసేవారు. ఆ సభకు మద్రాసు గవర్నర్‌గా ఉన్న తామస్ మన్రో(1761-1827) సివిల్ సర్వీస్ ఉద్యోగులనుద్దేశించి దేశభాషల్లో ప్రావీణ్యం సంపాదించి, ప్రజల ఆచారాలను సానుకూలంగా పరిశీలించి సహకరించాలని ప్రసంగించాడు. దేశభాషల్లో ప్రావీణ్యం సంపాదించాలనే మాట బ్రౌన్ మనస్సుకు బాగా నాటుకుంది. మన్రో రాయలసీమ ప్రజలతో మమేకమై ప్రీతి పాత్రుడయాడనే విషయం ఆనాటికి అందరికీ తెలుసు. మన్రో ప్రసంగంలోకూడా ప్రజలకు ప్రీతి పాత్రుడు కావాలంటే ప్రాంతీయ భాషలు బాగా అధ్యయనం చేయాలనే మాట కూడా బ్రౌన్ మనసులో బహుగా నాటుకుంది. పైగా తన తొలి ఉద్యోగం కూడా హన్బరీ (Hunbury) అనే అతని కింద పనిచేశాడు. హన్బరీ తెలుగులో బాగా మాట్లాడేవాడు. అదికూడా బ్రౌన్‌కి తెలుగు భాషపై మక్కువ ఏర్పడడానికి ఒక కారణం అయింది. ఆ ప్రభావంతో రెండేళ్ళలో తెలుగు బాగానే నేర్చుకున్నాడు. కేవలం పుస్తకాల భాషకాకుండా కోర్టులోని వాదులు, ప్రతివాదులు, నేరస్థులు, సేవకులతో కలిసి మాట్లాడినందువల్ల భాషలో మెలుకువలు, సామెతలు, జాతీయాలు బాగా అలవడ్డాయి. పాశ్చాత్య ఉద్యోగులందరి కన్నా బాగా తెలుగు భాషపై పట్టు సాధించాడు. తెలుగు భాషపై మంచి అధికారికత సంపాదించేసరికి మన్రో దొర బ్రౌన్‌ని 1820లో కడపకు బదిలీ చేశాడు. అనంతరం 1822లో మచిలీపట్నం అసిస్టెంట్ జడ్జిగా నియమించాడు. ఈ కాలంలోనే తెలుగు గ్రంథాలు చదవడం ప్రారంభించాడు. ఫ్రెంచ్ కాతలిక్ మతగురువు అబెదుబె రాసిన హిందూ మేనర్స్ కస్టమ్స్ అండ్ సెర్మనీస్ అనే పుస్తకంలో వేమన



175 ఏళ్ల క్రితం కడప కలెక్టర్‌గా ఉన్న సి.పి.బ్రౌన్, గుట్టుంకొండ పర్యటనకు వచ్చిన సందర్భంలో తీసిన ఫొటో. బ్రౌన్ ఎలా ఉంటారన్న సందేహాన్ని పటాపంచలు చేసిన చారిత్రక ఆధారం ఇది. దీనిని సేకరించి తిరుమల-తిరుపతి దేవస్థానం వారికి అందించిన ఘనత భూమన్ గారికి దక్కుతుంది. వాల్మీకిపురంకు చెందిన సాలిగ్రామ శ్రీనివాసాచార్యులుగారి నుండి భూమన్ దీనిని సేకరించారు.

గూర్చిన వివరాలు తెలుసుకున్నాడు. అనంతరం వేమన శతక సాహిత్య ప్రతులన్నీ వివిధ ప్రాంతాల్లో లభ్యమయిన వాటిని డబ్బు వెచ్చించి కొన్నాడు. 2500 పద్యాలకు పైచిలుకు ఉన్న వాటిని పరిష్కరించి 693 పద్యాలను ఎంపికచేసి పరిష్కరించి వర్సెస్ ఆఫ్ వేమన పేరుతో 1829లో అచ్చు వేశాడు. 1834లోగా బ్రౌన్ కడప, మచిలీపట్నం, రాజమహేంద్ర వరం, తిరుచునాపల్లి, మద్రాసు, గుంటూరు చిత్తూరు మెదలయిన ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశాడు. ఈకాలంలో తెలుగు పుస్తకాలు (తాళపత్రగ్రంథాలు) కొనడానికి ఎన్నో అప్పులు చేశాడు. తెలుగు పుస్తకాల కోసం చేసిన అప్పులు విషయం అయోధ్యాపురం కృష్ణారెడ్డి 1829 మే 13వ తేదిన రాసిన లేఖలో స్పష్టంగా ఉంది తెలుగు తాళపత్ర గ్రంథాల కోసం అప్పులు చేసి తిప్పలు పడిన బ్రౌన్ పేదవాళ్ళకి సాయం చేయడంలో ఎప్పుడూ వెనుకంజ వేయలేదు. తనకులేకపోయినా పేదలను, దీనులను, ఆదరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

పేదలకు న్యాయం చేయడంలో తీర్పు తీర్చే సందర్భాల్లో ప్రజల పక్షంగా తీర్పు తీర్చినందుకు 1834లో ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడు. న్యాయాధిపతిగా ప్రజల పక్షం వహించినందుకు బ్రిటీష్ ప్రభుత్వం బ్రౌన్‌ని ముప్పు తిప్పలు పెట్టింది. రాజమండ్రిలోనూ, మచిలీపట్నంలోనూ బ్రౌన్ చేసిన తీర్పుకు సస్పెన్షన్ అయినట్టు 1834 నవంబర్ 24 తేదీ ఆటోబయోగ్రఫీలో స్పష్టంగా ఉంది.

బ్రౌన్ సస్పెన్షన్‌లో ఉన్నా తెలుగు వ్యాకరణ రచన, తెలుగు-ఇంగ్లీషు-తెలుగు నిఘంటు రచన మానలేదు. స్వదేశం వెళ్ళే ప్రయాణం లోనూ, సెలవుకాలంలోనూ ఇంగ్లండ్‌లో తెలుగు సాహిత్య రచనా ప్రక్రియ కొనసాగించాడు. తిరుగు ప్రయాణంలో 1837 ఆగష్టు 30వ తేదీ లండన్ నుంచి ఇండియాకు వచ్చేటప్పుడు బిషప్ కాల్డ్వెల్ (1814-1891)తో పరిచయం ఏర్పడింది. కాల్డ్వెల్ బ్రౌన్ కన్నా చాలా చిన్నవాడు. కాల్డ్వెల్ మద్రాసులో స్థిరపడి ద్రవిడ భాషల తులనాత్మక వ్యాకరణము రచించాడు. కాల్డ్వెల్ ఇడయంగుడి ప్రాంతంలో స్థిరపడి, అక్కడ రోడ్లు వేయించి, ఇళ్ళు కట్టించి, ప్రజలకు అన్ని విధాలుగా సహాయం చేశాడు. బిషప్ కాల్డ్వెల్‌ని బాగా ప్రభావితం చేసిన వాడు బ్రౌన్. బిషప్ కాల్డ్వెల్ తమిళ ప్రాంతంలో తమిళ ప్రజలతో మమేకమయ్యాడు. ఎంతగా అంటే వియన్నాలో జరిగిన ఒక ప్రదర్శనకు ఇడయంగుడి నుంచి మట్టి తీసుకొని వెళ్ళి అక్కడ ప్రదర్శించాడని డాక్టర్ మీనాక్షి సుందరం The Contribution of European scholars to Tamil(1974-పుట 35)అనే పుస్తకంలో వివరించాడు. బిషప్ కాల్డ్వెల్ 1891లో చనిపోయినప్పుడు ఇడయంగుడిలోనే ఖననం చేశారు. నేటికి ఆ సమాధి ఉంది. బ్రౌన్ దొర తాను నమ్మిన సిద్ధాంతాలను నమ్మిన ప్రజలను వమ్ము కానీయలేదు. పైగా తన ఆలోచనలను ఇతరులకు పంచి ఆ ప్రభావంతో సోదర భాషలను వృద్ధి చేయడానికి సహాయం చేశాడు. ఇంత మంచి మనసున్న బ్రౌన్ తిరిగి వచ్చి విధుల్లో చేరే సరికి బ్రిటీషు ప్రభుత్వం ఫార్సీ అనువాదకుడిగా నామమాత్ర ఉద్యోగం యిచ్చారు. ఒక విధంగా బ్రౌన్‌పై కక్ష సాధింపు జరిగింది.

కడపలో రెండవ అసిస్టెంట్‌గా చేరినప్పటి నుండి వివిధ ప్రాంతాల్లో సబార్డినేట్‌గా తొమ్మిది సంవత్సరాలు తక్కువ జీతంతో పని చేశాడు. 1852లో మాత్రమే ఫస్ట్‌క్లాస్ సివిల్ సర్వెంట్ హోదాపొందాడు. 1834లో సస్పెన్షన్ వల్ల రెవెన్యూ జ్యూడిషియల్ శాఖల్లో సరయిన పోస్టింగ్ లభించక బొటాబొటి జీతంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. 1832-33 సంవత్సరాల కాలంలో గుంటూరు కలెక్టర్‌గా పనిచేసే రోజులలో దుర్భరమైన కరువు వచ్చింది. నందన నామ సంవత్సరం కాబట్టి నందన కరువు అన్నారు. వానలు లేవు. పంటలు లేవు. పశుగ్రాసం లేక పశువులు, తినటానికి తిండిలేక ప్రజలు మరణించారు. అంటువ్యాధులు ప్రబలి వందల కొద్ది మరణాలు సంభవించాయి. పై అధికారులకు కరువు (Famine) విలయతాండవం చేస్తుందని, తిండి గింజలు పంపినట్టయితే గంజి సెంటర్లు ఏర్పాటు చేస్తానని రాశాడు. ప్రకృతి వైపరీత్యం అనిగాని, అనావృష్టి అనిగాని పేర్కొనాలి కాని కరువు అనే మాట బ్రిటీష్ రాజ్యంలో ఉపయోగించాడని కోపగించి 1833 మార్చి 19న చిత్తూరు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. గుంటూరులో కేవలం 12 వారాలు మాత్రమే కలెక్టర్‌గా పనిచేశాడు. 1834లో బ్రౌన్ ఒక తీర్పువిషయంలో నిక్కచ్చిగా ఉన్నాడని కుంఫిణీవారు శిక్షగా 1834 అక్టోబర్ 25న ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేశారు. అటువంటి కఠినమైన పరిస్థితుల్లో కూడా తెలుగు భాష సాహిత్యాల పునరుద్ధరణ మానలేదు. బలవంతంగా తిరిగి సీమకు వెళ్ళే సమయంలో తెలుగు ప్రజలు, తెలుగు జమిందార్లు, అధికార అనధికార గణం గుంపులు గుంపులుగా కన్నీళ్ళ పర్యంతం ఓడ దగ్గరకేగి వీడ్కోలు పలికినట్టు ఆయా లేఖలు స్పష్టం చేస్తున్నాయి. బ్రౌన్ లండన్ వెళ్ళేటప్పుడు అతి ముఖ్యమైన పుస్తకాలు, పరిష్కరించవలసినవి అన్నీ జాగ్రత్తగా తన అనుయాయులకిచ్చి వాటి

భద్రతకు కొంత డబ్బు యిచ్చిన ధర్మమూర్తి.

బ్రౌన్ దొరని బాగా పీడించిన వ్యాధి పక్షవాతం. 1845లో ఒకసారి 1848లో ఒకసారి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. 1849లో కుడిబొటనవేలు విరిగింది. అయినా నిఘంటు ప్రూపులను, ఇతర పుస్తకాలను ఎడమచేత్తో దిద్దినట్టు C.P.Brown, Oothacamand Memoranda June 1853లో రాసుకున్నాడు. ఆంగ్ల దేశమయినా, ఆంధ్ర దేశమయినా ప్రతిచోట జీవితకాలం పుస్తకాల అన్వేషణలో, పరిష్కరించడంలో జీవితాన్ని అంకితం చేశాడు. ఆయన జీవితకాలంలో సేకరించిన గ్రంథాలు 5751. తెలుగులో సేకరించి పరిష్కరించినవి 2450. లండన్‌లో 2106 పుస్తకాలు, మెకంజీ సేకరణ 913 ఇతరులు ద్వారా సేకరించినవి 292 దాకా ఉన్నాయి. ఆయన సేకరించిన పుస్తకాలు రెవరెండ్ టైలర్ 3 సంపుటాల్లో 1857,1860,1862 సంవత్సరాల్లో సెయింట్ జార్జ్ గజిట్ ప్రెస్‌లో అచ్చు వేశారు. బ్రౌన్ స్వంత గ్రంథాలయంలో 4000పైగా గ్రంథాలుండేవి. ఇదిలా ఉండగా ఆయన వద్ద పనిచేసే పండితులకు తన జీతం నుంచే జీతాలు చెల్లించాడు. ఒక సమయంలో రెండు నెలలు ఆలస్యం అయిన పరిస్థితులో అప్పుచేసి మరీ జీతాలిచ్చిన మహాను భావుడు. ఆయన లండన్ వెళ్ళిన తర్వాత కూడా తనవద్ద నమ్మకంగా పనిచేసిన పండితులకు, పనివాళ్ళకు పెన్షన్ ఏర్పాటు చేశాడు.

తెలుగు వారికోసం, తెలుగు భాష కోసం జీవితమంతా అంకితమై పని చేసిన త్యాగశీలి సి.పి.బ్రౌన్. లండన్‌లో కూడా ఆయన కొంతకాలం ఆచార్యుడుగా పనిచేసి 1884 డిసెంబర్ 12న లండన్ వెస్ట్ బార్న్ గ్రోవ్‌లో తుది శ్వాస విడిచాడు. నేటికి ఆయన సమాధి ఉంది.

సి.పి.బ్రౌన్‌పై విశేష కృషి జరిపిన ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, ఆరుద్ర, జోలెపాళెం మంగమ్మ, బంగోరే పరిశోధన చేసిన పలువురు పరిశోధకులు చిరస్మరణీయులు. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో సి.పి.బ్రౌన్ ప్రాజెక్ట్ పుణ్యమా అని లండన్ ఇండియా ఆఫీసులైబ్రరీలో ఉన్న 20 వేల పైచిలుకు పుటల్లో ఉన్న పుస్తకాలు, పత్రులు, చేతిరాత ప్రతులు మైక్రో ఫిల్ముల రూపంలో బంగోరే నేతృత్వంలో రావడం మన అదృష్టం. ఐతే ఆ ప్రాజెక్ట్ మధ్యంతరంగా ఆగిపోవడం మన దురదృష్టం. తెలుగుజాతి, తెలుగు భాష, తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ చిరంజీవిగానే ఉంటాడు. ఆయన మనకు చేసిన త్యాగం అమూల్యమూ, అపురూపమూ, ఆద్భుతమూ ఆశ్చర్యము అంటే తక్కువే నేమో.

ఈ వ్యాసపరంపరను ఈ సంచికతో ఆపుతున్నాను. ఈ విషయమై రాయవలసింది ఇంకా ఎంతయినా ఉంది. దీనిపై ఇంతవరకూ పాఠకుల నుండి ప్రశంసలు వస్తూనే ఉన్నాయి. ఈ అంశాలపై మరి కొంత సమాచారాన్ని సేకరించిన తరువాత మళ్లీ పాఠకుల ముందుకు వస్తాను.

(అయిపోయింది).

**43వ పుట తరువాయి...**

# దున్నబోతే దూడల్లోకి...

చేసే మానవసశాస్త్ర వేత్తలకు జానపద సాహిత్యం రూపంలోగల సంప్రదాయజ్ఞానం పై అవగాహన ఉండదు. భాషాసాహిత్య వేత్తలకు శాస్త్రదృష్టి తక్కువ.ఈ మూడు రంగాలలో జరుగుతున్న కృషి పట్ల అవగాహన పెంచుకునే అవకాశం గ్రామస్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, మార్కెట్ పోకడలు గమనించే ఉపాధ్యాయులకు ఎక్కువ.ఆ అవగాహనకు  తో వారు ఆయా వృత్తులు, వర్గాలనుండి వచ్చే విద్యార్థుల వారసత్వ జ్ఞానానికి చెందిన పలుకుబడులు కలుపుకుని చెపుతుంటే, పిల్లలలో ఎంతో ధైర్యం / విశ్వాసం నింపుతారు. వారికి ఆత్మీయులౌతారు. ఈ వాచకంలో విశేషాలను పెద్దలనడిగి మరింత తెలుసుకోవచ్చు.ఇంటిభాషను బడిభాషను సమన్వయం చేసుకోవచ్చు. పిల్లలలో న్యూనతా భావం తగ్గించి ఆత్మవిశ్వాసం పెంచ వచ్చు. చట్టాల అమలుకు కావలసిన చైతన్యం కలిగించవచ్చు. పర్యావరణ జీవ వైవిధ్య రక్షణకు తోడ్పడవచ్చు. మానవత్వపు విలువలు పెంచవచ్చు'నని ఉన్నతాధికారి గా పనిచేసిన  ఈ కరదీపిక సమన్వయకర్త 'ఈ పుస్తకం ఎందుకు' లో ఆశిస్తారు..

ఇంతాచేసి ఈ వాచకాన్ని గిరిజన సంక్షేమ శాఖ అచ్చువేయలేదు. ప్రచారంలోకి తేలేదని చెప్పక్కరలేదు. అయినా ప్రజలలోకి పోయి ఈ పలుకుబడులను గుర్తుచేయటం, హక్కుల పోరాటంలో వారిని భాగస్వాములను చేయటం  కొనసాగుతూనే ఉంది..

**'నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు'** ☺

**కవిత**

## శ్రమైక జీవన సౌందర్యం

అన్నదాతకు నేలమ్మ నీరాజనాలు
ఆరుగాలం స్వేదంతో సేద్యం
ఇంట చేరిన రాజనాల రాశులు
కంట జారిన ఆనంద అశ్రువులు
ఆకాశపు అంచుల్లో మేడలుమిద్దెలు
బ్రతుకుతెరువుకు టక్కుటమార విద్దెలు
ధనమే ఇంధనంగా నగరజీవితయంత్రం
చిద్విలాసపుచిరునవ్వుల ఆహార్యతంత్రం
పెట్టుబడికిపట్టుబడికిఅంతూపొంతూలేనిఅంతరం
తొలకరి పులకరింతల పుడమికి
ప్రణమిల్లి రైతు సాగుకు సిద్ధం
అతడికి వ్యాపారం కాదది జీవన విధానం
అనురాగంఆప్యాయతల నీడ లేని జనారణ్యం
మానవత మంచితనం కానరాని వ్యాపార వనం
నగర పొలిమేరల్లోశ్రామికుల బతుకు ఛిద్రం
రెక్కాడక డొక్కాడక వెనుదిరిగిన వలసల చిత్రం
ఏ సాయం లేకున్నా సాగుతుంది వ్యవసాయం
యంత్రపుచేతలు లేక సాగేనా నగర జీవనం
శ్రామిక జన జీవన సమస్తం అస్తవ్యస్తం
భారతీయ జీవన యవనికపై
సాగులో శ్రమైక జీవన సౌందర్యం

యఱ్ఱంశెట్టి హనుమంతరావు, 9603629957

# పదకవితా పరిశోధక నిపుణుడు ఆచార్య గంగప్ప

**ఆచార్య** ఎస్.గంగప్ప గారి పేరు తెలుగు సాహితీ లోకానికి చిరపరిచితమే. పద, జానపద, నాటక సాహిత్య పరిశోధకునిగా సాహిత్య లోకంలో వారి స్థానం పదిలమైంది. ఉత్తమ అధ్యాపకునిగా, ఆదర్శ పరిశోధక పర్యవేక్షకునిగా, అనేక ప్రక్రియల రచయితగా, సహస్రాధిక వ్యాసకర్తగా, శతాధిక గ్రంథకర్తగా, అన్నిటినీ మించి మంచి మనిషిగా అందరి మన్ననలు పొందిన ఆచార్య ఎస్.గంగప్పగారు 8-11-1936లో పెనుగొండ తాలూకా, అనంతపురంజిల్లా, నల్లగొంద్రాయనిపల్లిలో శ్రీమతి కృష్ణమ్మ శ్రీ వెంకటప్ప దంపతులకు జన్మించారు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో బి.ఎ.ఆనర్స్, ఎం.ఏ. పూర్తి చేసిన వెంటనే ప్రభుత్వ కళాశాలలో అనంతపురంలో ట్యూటర్‌గా చేరి, తర్వాత పలు ప్రాంతాల్లో ఆంధ్రోపన్యాసకునిగా పనిచేసి 1978లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు. వీరి పర్యవేక్షణలో 27 పిహెచ్.డిలు 20 ఎం.ఫిల్ డిగ్రీలు వచ్చాయి.

ఆచార్య ఎస్. గంగప్పగారు మృదుస్వభావి. అజాత శత్రువు. విద్యార్థుల పట్ల అత్యంత ప్రేమగా, ఆదర పూర్వకంగా వ్యవహరించేవారు. పరిశోధనలో బద్ధకాన్ని ప్రదర్శించేవారికి పదే పదే ఉత్తరాలు రాసి మరింతగా బాధ్యతను గుర్తుచేసేవారు. అందుకే కొంతమంది విద్యార్థులు గంగప్పగారు మాకు పర్యవేక్షకులు కాకపోతే మాకు 'డాక్టరేట్'లు వచ్చేవి కావు అని పలు సందర్భాల్లో కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. రాష్ట్ర, రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలలో పాఠ్య నిర్ణాయక సంఘ సభ్యులుగా వీరు వ్యవహరించారు. అంతే కాదు, ఆయా విశ్వ విద్యాలయాల్లో యు.జి.సి. అధ్యాపకునిగా పలు ప్రసంగాలు చేశారు. ఇక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో అనేక ప్రసంగ పత్రాలు సమర్పించారు.

నిరంతర రచన, ప్రచురణ ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా సాగిన సాహిత్య జీవి ఆచార్య శ్రీ రామప్పగారి గంగప్పగారని చెప్పటం సముచితం. ఏ సమయంలో వారింటకి వెళ్లినా చదువుతూ గాని, వ్రాస్తూ కాని మాత్రమే వారు కనిపించేవారు. వారిని చూడటానికి వచ్చిన వారికి ఆత్మీయ ఆతిథ్యం అందించే వారి శ్రీమతి పార్వతమ్మ గారిని ప్రతి విద్యార్థి, సాహితీ వేత్త తప్పక గుర్తుపెట్టు కొంటారు.

ఆచార్య గంగప్పగారి సాహిత్య సేవను గుర్తించి పలు సంస్థలు వారిని సత్కరించాయి. అవార్డులు అందించాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును (1973,81) రెండు సార్లు పొందారు. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సీనియర్ ఫెలోషిప్‌ని (1983-85), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం (1992) తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం (1993) వీరు అందుకొన్న అవార్డులలో కొన్ని.

స్వయంకృషితో ఉన్నత స్థానానికి చేరుకొన్న ఆచార్య ఎస్.గంగప్ప ఎందరికో ఆదర్శం. సమయపాలన వీరి ప్రత్యేక లక్షణం. ఎలాంటి



2003 సెప్టెంబరు 7న గుంటూరులో తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ ఆచార్య గంగప్ప(పైన కుడివైపు చివర ఉన్న వ్యక్తి) ఆధ్వర్యంలో జరిగింది. ఆ సందర్భంలో సమాఖ్య అధ్యక్షులు సి.ధర్మారావు గారికి ఆయన జ్ఞాపికను అందచేస్తున్న దృశ్యం ఎడమ వైపు చివర డా॥ వెన్నిసెట్టి సింగారావు

ఉపన్యాసం ఇవ్వాలన్నా ముందుగా దానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, రూపొందించుకోవటం వీరికి అలవాటు. రచించిన, ప్రచురించిన ప్రతీ విషయాన్ని భద్రపరుచుకోవటం నేను వీరి దగ్గర నుంచే నేర్చుకొన్నాను. నేను ఎం.ఏ చదివే రోజుల్లో, వీరు నాకు ప్రత్యక్షగురువులు. వీరు రచించిన ప్రతి వ్యాసానికి సిద్ధ ప్రతిని తయారు చేసే భాధ్యతను నాకు అప్పగించటంవల్ల నేను ఎంతో సాహిత్యజ్ఞానాన్ని సంపాదించుకోగలిగాను.

ఆచార్య గంగప్ప గారు 'ఆనర్సు' విద్యార్థి కావడంతో ఆంగ్లంలో కూడా వీరికి మంచి ప్రావీణ్యం ఉంది. అందుకే యు.జి.సి. సదస్సులలో అనేక ఆంగ్ల పత్రాలు పమర్పించారు. వాటిని పుస్తకాల రూపంలో ప్రకటించారు.

దేశంలో ఏ తెలుగు ఆచార్యునికి లభించని శిష్య సంపద ఆచార్య గంగప్పగారికి లభించిందని చెప్పటంలో అతిశయోక్తిలేదు. 1996లో వీరు పదవీ విరమణ చేసిన తర్వాత వీరి పేరుమీద ఏర్పాటు చేసిన "ఆచార్య గంగప్ప సాహితీ పురస్కారం" నిరంతరాయంగా కొనసాగుతున్నది. ప్రతి సంవత్సరం ఒక సాహితీ ప్రముఖునికి పురస్కారాన్ని అందిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ కారణంగా అందించలేక పోయిన పురస్కారాల్ని అందించాలనే ఆలోచనలో ఉన్న సమయంలో వయోభారం వల్ల ఏర్పడిన అనారోగ్యంతో ఆచార్య గంగప్పగారు 7-10-2022న తుది శ్వాస విడవటం సాహిత్య లోకానికి తీరని లోటు. తర్వాత వీరి స్మారకార్థం వీరి పురస్కారాన్ని అందిస్తామని వీరి విద్యార్థులు, పురస్కార కమిటీ బాధ్యులు డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ కందిమళ్ల సాంబశివరావు పలువురు ప్రకటించారు. శిష్య సంపదనే తమ సంపదగా భావించే ఆచార్య ఎస్. గంగప్ప గారికి శిష్యులందరి పక్షాన ఇదే కన్నీటి నివాళి.

- డా॥ గుమ్మా సాంబశివరావు
98492 65025

అభినందన

# ఒంటెత్తు పోకడ లేని సాహిత్య యోధుడు- 'సింగంపల్లి'!






**వర్గ** వైరుధ్యాలు, వర్గ సంఘర్షణ సమాజపు మౌలిక లక్షణాలుగా అర్థమైన 20 ఏళ్ల వయసు నుండి 52 ఏళ్లుగా సాహిత్య కృషిలో నిర్విరామ మెరుపు యోధుడు సింగంపల్లి అశోక్ కుమార్. సమ సమాజ నిర్మాణానికి ఎర్రజెండాయే ఎజెండాగా నిండుగా నమ్మే అశోక్ కుమార్, సాహిత్య రంగంలో అలుపెరుగని ఒక విశిష్ట కృషీవలుడు. సరిగ్గా 50 ఏళ్ల క్రితం విప్లవ రచయితల సంఘంలో సభ్యునిగా, కాకినాడ బాధ్యునిగా కలం ఎత్తిన అశోక్, విజయవాడ చేరుకున్న తర్వాత నుండి తనదైన శైలిలో సాహిత్య కృషి సాగిస్తున్నారు. శ్రీశ్రీ శత జయంతికి మూడేళ్లు ముందుగానే (2007), దాన్ని ఆంధ్రదేశమంతా విస్తారంగా జరుపుకునే ఒక వాతావరణ సృష్టికి, శ్రీశ్రీ సాహిత్య నిధికి పథక రచన చేసి, అందుకు తెలుగు నాట తాను ఇష్టపడే వామపక్ష సాహిత్య సంస్థలు అరసం, విరసం, జనసాహితి, సాహితీస్రవంతిలను కలుపుకొని నిరంతర కార్యక్రమాలు ఒంటి చేతి మీదుగా నిర్వహిస్తూ తాను ఎప్పుడూ ఒంటరి వాడిని కాదని రుజువు పరుచుకుంటూ ఉంటారు.

**ఒంటెత్తు పోకడలేని సాహిత్య యోధుడు సింగంపల్లి!**

అశోక్ కుమార్ 15 ఏళ్లుగా శ్రీశ్రీ జయంతి వర్ధంతులను తనకు ఇష్టమైన సాహిత్య పండుగలుగా నిర్వహిస్తూ, పదేళ్లగా తన పుట్టినరోజును సాహిత్యపు పండుగగా మార్చే అలవాటు చేసుకున్నారు.

గడచిన 17 ఏళ్లుగా "శ్రీ శ్రీ సాహిత్య నిధి" ప్రచురణలతో పాటు "ఆలోచన" ప్రచురణలు కూడా చేపట్టారు. 2022 నవంబరు 6న (ఆలోచన)22వ ప్రచురణ 'అశోకనివాళి దేశీయం-3' విడుదల చేశారు.

ఇంతకుముందే వివిధ రూపాలలో తన నివాళిని ప్రజాసాహితి తదితర పత్రికల ద్వారా పాఠకులకు పరిచయం చేసిన, తెలుగునాట ప్రసిద్ధిగాంచిన 50 మంది సాహిత్య, హేతువాద, కళా రంగాల ప్రముఖులకు అశోక నివాళి…3 ఇప్పుడు పుస్తక రూపంలో మన ముందుకు వస్తోంది. ఈ 50 మందిలో మనం ప్రత్యక్షంగా ఎరగడానికి అవకాశం లేని వేమన, సామినేని ముద్దు నరసింహంతో పాటు తక్కువ అవకాశాలు ఉన్న జలసూత్రం రుక్మిణినాథశాస్త్రినీ మినహాయిస్తే, మిగిలిన వారందరినీ మనం ప్రత్యక్షంగా ఎరుగుండే అవకాశం ఉన్నవారే!

కొడవటిగంటి రోహిణి ప్రసాద్‌తో సహా ప్రధానంగా హేతువాద భావ శ్రేణికి చెందిన అరడజను మంది ఇందులో ఉన్నారు. వీరిలో చాలామంది ఎరుగని ఒక పేరు ఈశ్వరప్రభుగా ప్రసిద్ధి పొందిన దాసరి చిన వెంకటేశ్వర్లు. పైగంబరకవి, 'రెక్కలు' అనే కవిత్వ శైలికి రూపకర్త ఎం.కె. సుగం బాబు(మహబూబ్ ఖాన్), శీలా వీర్రాజు, కంఠంనేని రవీంద్రరావు, కవి ఛాయరాజ్, కొమ్మిరెడ్డి విశ్వమోహన్ రెడ్డి, సింగమనేని నారాయణ వంటి పెద్దలకు నివాళి ఇందులో చదువవచ్చు.

ఒక ఏ-4 పేజీకి పరిమితమై నివాళి నిడివి ఉంటుంది. ఒక విలక్షణ శీర్షికతో, ఆ రచయిత గురించిన నాలుగు పంక్తుల పద్యంతో, ఆ రచయితను పాఠకులు గ్రహించేటట్లు, వారి రచన నుండి ఒక విశిష్ట ఉల్లేఖన ఉంటుంది. తర్వాత రచయిత జీవన క్రమం, సాహిత్య కృషీత్వమూ, పొందిన పురస్కారాల వివరాలు ఉంటాయి.

ఇప్పటివరకు పాఠకుల దృష్టికి తన నివాళి రచన ద్వారా అశోక్ తెచ్చిన సుమారు 200 మంది పైగా సాహిత్య కళా రంగ ప్రముఖుల ఉల్లేఖనలకు ఒక పుస్తక రూపం ఇచ్చినా ఒక ప్రయోగ, చదువులకు ప్రయోజన శీలంగా ఉంటుంది.

వందలాది మంది రచయితల సాహిత్య వ్యక్తిత్వాలను కొండను అద్దంలో చూపినట్లు చెప్పడం తేలికేమీ కాదు. రచయిత హృదయాన్ని పట్టుకోవాలి. అందుకు నిరంతర అధ్యయనం, దాన్ని మించి పరిశోధనా తత్వం ఉండాలి.వీటన్నిటి మేలు కలయిక సింగంపల్లి అశోక్ కుమార్. 72ఏళ్ళు పూర్తి చేసుకున్న చిరునవ్వుల వెన్నెల బాలుడు అశోక్‌కుమార్‌కు. ఆయనకు అభినందనలు.

-దివికుమార్,
94401 67891

## గ్రంథాలయం



పురాణపాత్రలపై **కొత్తవెలుగు**
లోహియా ఇతిహాస వ్యాసాలు
సంకలనం: **రావెల సోమయ్య**
పుటలు:253 వెల:రూ.200
ప్రతులకు: సదరన్‌స్ప్రింగ్స్ పబ్లిషర్సు ప్రై.లి.
హైదరాబాద్.
సెల్: 9100942260/74/75



రాజేందర్ జింబో కవిత్వం
**ఒకప్పుడు...**
రచయిత:**రాజేందర్ జింబో**
పుటలు:138 వెల:రూ.100
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్
ఆర్యసమాజం మందిరం ఎదురుగా,
హైదరాబాద్.



**కమ్మని కవి తుమ్మల**
రచయిత: **డా॥నాగభైరవ ఆదినారాయణ**
పుటలు:112 ; వెల: అమూల్యం
ప్రతులకు: డా. నాగభైరవ ఆదినారాయణ
202, శ్రీ వేంకటసాయి రెసిడెన్సీ, 2వ లైను
రామయ్యనగర్, ఒంగోలు-523 002
ప్రకాశం జిల్లా, ఫోన్:9849799711



తెలుగు కార్టూనిస్టుల **కరోనా కార్టూన్లు**
సంకలనం: **బాచి**
పుటలు:160 ; వెల:రూ.120
ప్రతులకు:ఎ.శ్రీధర్(బాజి), అడ్వకేట్
205, కాపిటల్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్స్
ఆశ్రమంరోడ్డు,
సి.ఎస్.ఆర్ కళ్యాణమండపం పక్కన,
తాడేపల్లి సెంటర్
గుంటూరు జిల్లా సెల్: 98489 92433



**విశ్వకర్మ విలాసం**
సంపాదకుడు: **కపిలవాయి అశోక్‌బాబు**
పుటలు:232 ; వెల:రూ.300
ప్రతులకు: కపిలవాయి అశోక్‌బాబు
ఇం.నెం 1-3-312/2 ఫ్లాట్ నెం.404,
సి-బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్,
అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్,
హైదరాబాద్-500 400
ఫోన్: 87907 27772,94402 06387



**ఆధునిక ఆంధ్రుల రాజకీయాలు**
హింస - దోపిడి - అణచివేత
రచయిత: **డా॥ కత్తి పద్మారావు**
పుటలు:264 ; వెల:రూ.300
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి
లోకాయత పబ్లికేషన్స్, లుంబినీవనం,
అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు-522124
గుంటూరుజిల్లా సెల్: 9849741695



**మెకంజీ కైఫీయతులు**(పశ్చిమ గోదావరి)
**డా॥ లంకా వెంకటేశ్వర్లు**
పుటలు:168 ; వెల:రూ.100
ప్రతులకు: డా॥ లంకా వెంకటేశ్వర్లు
26-2-4, అమీనాపేట, ఏలూరు.
ఫోన్:94924 71444



జర్నలిస్టుగా నా
**జ్ఞాపకాల సవ్వడి**
మూడు దశాబ్దాల యథార్థగాథల సమాహారం
సంపాదకత్వం: **అనిల్ కుమార్ తాళ్లూరి**
పుటలు:232 ; వెల:రూ.300
ప్రతులకు:ramanaandhrabhoomi@gmail.com
ఫోన్:98483 62588, 83176 58183



**నా సీమ యాసే నా శ్వాస**
రచయిత: **యెలిచెర్ల గజేంద్రనాథ్‌రెడ్డి**
పుటలు:222 ; వెల:రూ.150
ప్రతులకు: యెలిచర్ల చంద్ర ఓబుల్‌రెడ్డి
ఎన్.జి.ఓ. కొలనీ, బద్వేల్, కడప.
సెల్: 94411 12404



**తప్పుకాదు !?**
రచయిత: **గురుసహస్రావధాని**
**డా. కడిమిళ్ళ వరప్రసాద్**
పుటలు:20 వెల:రూ.30
ప్రతులకు: డా. కడిమిళ్ళ వరప్రసాద్,
3-6-50, యళ్లమిల్లివారి వీధి,
నరసాపురం-534275
ఫోను: 92478 79606

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# భారతీయ భాషా శాస్త్రజ్ఞుల 44వ అంతర్జాతీయ సమావేశం
## 24-26 నవంబరు 2022




ఒరిస్సా గవర్నరు ఆచార్య శ్రీ గణేశీలాల్, కేంద్రీయ భారతీయ భాషా సంస్థ సంస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ దేవీ ప్రసన్న పట్టనాయక్, సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు డా. సుప్రియా పట్టనాయక్, భారతీయ భాషా శాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు తదితరుల సమక్షంలో 24-26, నవంబరు 2022 44వ భారతీయ భాషా శాస్త్రజ్ఞుల అంతర్జాతీయ సమావేశం, భువనేశ్వర్‌లో జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమ దృశ్యాలివి.... సభల వివరాలు వచ్చే సంచికలో ఇస్తాము.


ఒరిస్సా గవర్నరు ఆచార్య శ్రీ గణేశీ లాల్


పద్మశ్రీ దేవీ ప్రసన్న పట్టనాయక్


ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు


డా. సుప్రియా పట్టనాయక్


సంస్థానాచార్య ఎస్.ఎన్.శ్రీధర్, స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్, స్టోనీబ్రూక్, అ.సం.రా.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
DECEMBER 2022 Vol :8, Issue 9
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

Bommidala
International

# బొమ్మిడాల
# ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244